

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 209

గురువారం 20-10-2022


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

దీపావళికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్‌లో లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% పైన కొంతమందికి మరింత ఎక్కువ పర్సంటేజ్ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరియు క్యాష్ బ్యాక్ ఆఫర్స్‌లో 22.5% వరకు అదనంగా డిస్కౌంట్ లభించడం వలన కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంది.



దీపావళి శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దీపావళి సేల్
LG
Life's Good
OLED
THE ONE AND ONLY
Celebration Of Your Success
LG OLED
Experience the Best of Cinema, Sports and Gaming.
WORLD'S LARGEST OLED TV | 97 G2
WORLD'S ONLY ROLLABLE OLED TV | 65 R1
WORLD'S FIRST 8K OLED TV | 88 Z2
Range Starts from ₹119990*
SELF-LIT OLED
α9 AI Processor
Dolby VISION IQ
Dolby ATMOS
NVIDIA G-SYNC
Eye Comfort Display
ThinQ AI
INTRODUCING THE ALL-NEW RANGE OF
LG REFRIGERATORS
STUNNINGLY STYLISH
GC-X257CSES
InstaView – Door-In-Door™
AI ThinQ
Hygiene Fresh+™
Door Cooling+™
UVnano™
Smart Diagnosis™
Non-Plumbing Water & Ice Dispenser
Automatic Ice Maker
Smart Pocket Handle
Spaceplus™ Ice System
Express Freezing
Multi Digital Sensor
Inverter Linear Compressor
Brush Steel
Capacity: 674 Litres
GC-L257SL4L
Side-by-Side Refrigerator
AI ThinQ
Hygiene Fresh+™
Door Cooling+™
Smart Diagnosis™
Non-Plumbing Water & Ice Dispenser
Multi Air Flow
Express Freezing
Multi Digital Sensor
Smart Inverter Compressor™
Shiny Steel
Capacity: 674 Litres
GL-T502APZY
Door Cooling+™
Convertible
Smart Diagnosis™
2-Star Rating
Smart Inverter Compressor™
Shiny Steel
Capacity: 471 Litres
Also available in 437 Litres
DoorCooling+™ Convertible
GL-T422VESX
AI ThinQ
Door Cooling+™
Hygiene Fresh
Convertible
3-Star Rating
Smart Inverter Compressor™
Ebony Sheen
Capacity: 423 Litres
Also available in 408, 360 and 340 Litres
DoorCooling+™
AI ThinQ | DoorCooling+™ | UVnano™
AI ThinQ | DoorCooling+™
AI ThinQ | HYGIENE FRESH | DoorCooling+™
EXCLUSIVE OFFERS
ADDITIONAL 2 YEAR MAINTENANCE STARTING AT ₹2* PER DAY
CASHBACK UP TO 20%* (On Select Side-by-Side Refrigerator Models)
Mini Bar Refrigerator (GL-M051RSWC) *Free Mini Bar Refrigerator with Select Side-by-Side Refrigerator Models.
Care & Delight LG Service
LG 24 x 7 CUSTOMER CARE
1800-315-9999 1800-180-9999 (Toll Free)
5757554 (Send SMS)
www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.twitter.com/LGIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
LG Greencycle
Regd. Office: LG Electronics India Pvt. Ltd., A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PTC220109
*T&C apply. Images are for representation purpose only. Actual product and feature may vary from model to model. For complete information, visit www.lg.com/in. *T&C Apply. Up To 20% Cash Back - Limited Period offer on Select Side-by-Side Refrigerator Models. Fixed EMI - Limited Period offer on Select Direct Cool Refrigerator Models. *Additional 2 year Maintenance starting at ₹2 per day Offer - ₹2 per day calculation is indicative and derived basis 2 year period on the select entry level models of Refrigerators and ranges up to ₹6.50 per day on select top end models. Maintenance shall be subject to standard AMC T&Cs. Maintenance does not cover physical damage, aesthetic parts and accessories. Offer valid from 6th Aug to 31st Oct 2022. AMC stands for Annual Maintenance Cost. For more information, please contact LG Customer Care 1800-315-9999 or speak to service engineer at the time of installation or visit www.lg.com/in. Product features may vary from model to
visit : www.sonovision.in మా టీమ్ ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన APలో అత్యంత నమ్మకమైన షోరూం సోనోవిజన్
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
శ్రీనగర్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81
వైజాగ్ డైమండ్ పార్క్ : 9390006608, వైజాగ్ ద్వారకా నగర్ : 9246667474, మధురవాడ : 9246666214, గాజువాక : 9246667575, న్యూగాజువాక : 9440804187, గోపాలపట్నం : 9100991704, శ్రీకాకుళం : 9154281140,
విజయనగరం : 9246666208 ★ గుంటూరు జిన్నాటవర్ సెంటర్ : 9246667373, గుంటూరు లక్ష్మీపురం : 9246666204, గుంటూరు బ్రాడీపేట : 9246666215 ★ రాజమండ్రి కోటిపల్లి బస్టాండ్ : 9246662288,
రాజమండ్రి జె.యన్.రోడ్ : 9100991700, రాజమండ్రి ఇన్నీసుపేట జంక్షన్ : 9154281197, కాకినాడ రామయ్య స్ట్రీట్ : 9246665511, కాకినాడ సర్పవరం జంక్షన్ : 7331149376
ఏలూరు : 9246666205, ఏలూరు అశోక్ నగర్ : 9390006620, భీమవరం : 8333924936, తణుకు : 8333924938 ★ తెనాలి : 9246666211, తెనాలి : 8333924937,
తాడేపల్లి : 7331149366, రేపల్లె : 9390006609, నెల్లూరు : 9246666206, నెల్లూరు : 8712600519, ఒంగోలు : 9246666329 ★ తిరుపతి : 9440804186,
తిరుపతి : 9100991707, తిరుపతి : 7331149370, చిత్తూరు : 8712600528 ★ కర్నూలు : 8333924947, కర్నూలు : 9154281642,
నంద్యాల : 8712600525, అనంతపురం : 9154281191 కడప : 9154281194 ★ ఖమ్మం : 9246666319, ఖమ్మం : 9100991709, ఖమ్మం : 8333924931, హైదరాబాద్ పంజాగుట్ట : 9440804181,
హైదరాబాద్ కూకట్‌పల్లి : 9154281180, హైదరాబాద్ : 7331149363 హైదరాబాద్ : 8333924932, హైదరాబాద్ ఎల్.బి.నగర్ : 8333924943



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 209

గురువారం 20-10-2022



విండీస్ విజయం

జింబాబ్వేపై 31 పరుగులతో గెలుపు.. సూపర్–12 ఆశలు సజీవం -IVలో



రెండు వారాల్లో 82 నుంచి 83

మరో చరిత్రాత్మక కనిష్టానికి రూపాయి.. ఒకరోజు 60 పైసలు నష్టం - 10లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బానిస మనస్తత్వం వద్దు

ఇంగ్లిష్‌పై ఉన్న బానిస మనస్తత్వం నుంచి నూతన విద్యా విధానంతో మన దేశం బయట పడుతుందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో



మరోసారి చైనా మోకాలడ్డు

లష్కరే నేత షహీద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలన్న భారత్, అమెరికా ప్రతిపాదనకు ఐరాసలో చైనా మోకాలడ్డింది.


వివరాలు 6లో



ఘజియాబాద్‌లో గ్యాంగ్ రేప్

ఢిల్లీకి చెందిన మహిళపై యూపీలోని ఘజియాబాద్‌లో ఐదుగురు దుర్మార్గులు అత్యంత క్రూరంగా అత్యాచారానికి పాల్పడ్డారు.

వివరాలు 6లో



ఆర్యన్‌ను కావాలనే ఇరికించారు

షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్‌ను ఎన్సీబీ అధికారులు కావాలనే డ్రగ్స్ కేసులో ఇరికించారని ఎన్సీబీ విజిలెన్స్ కమిటీ పేర్కొంది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

విశాఖ కేంద్రంగా రిమోట్ రేడియాలజీ సేవలు



టెలీ రేడియాలజీ సొల్యూషన్స్ సంస్థ విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. ఇక్కడి నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రులు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు టెలీ రేడియాలజీ సేవలను ఆ సంస్థ అందించనుంది.

వివరాలు 2లో ▸

జనసేన కార్యకర్తలకు బెయిల్ తిరస్కరణ



జనసేనకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల విశాఖలో అరెస్టయిన 9 మంది కార్యకర్తల బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. విచారణ ప్రాథమిక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది.

వివరాలు 8లో ▸

రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణలో

మనమే ముందుండాలి

మహిళ, శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం

- అంగన్‌వాడీలు, స్కూళ్లలో కచ్చితమైన పరిమాణంతో నాణ్యమైన ఆహారం
- నిర్దేశిత ప్రమాణాల ప్రకారం అందేలా 100% మానిటరింగ్
- పంపిణీ బాధ్యత మార్క్‌ఫెడ్‌కు.. సమర్థ పర్యవేక్షణకు ప్రత్యేక యాప్
- బాలింతలు, గర్భిణులు, పిల్లల ఆరోగ్య సంరక్షణపై సర్కారు దృష్టి
- గతంలో రూ.500 కోట్లే.. ఇప్పుడు ఏకంగా రూ.1,900 కోట్లు
- నాడు–నేడుతో తీర్చిదిద్దేలా విద్యాశాఖతో కలసి సమగ్ర ప్రణాళిక
- చిన్ననాటి నుంచే ఆంగ్లంలో రాణించేలా ఫౌండేషన్, శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు
- మన కృషిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తేనే ఎస్‌డీజీలో అగ్రస్థానం
- దేశంలోనే ఏపీ నంబర్ వన్‌గా నిలవాలి.. అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లకు 57,000 సెల్‌ఫోన్ల పంపిణీకి శ్రీకారం



అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లకు ఇచ్చే సెల్‌ఫోన్లను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: స్కూళ్లు, అంగన్‌వాడీలకు సరఫరా చేసే ఆహారంలో మంచి నాణ్యత, పరిమాణం, పర్యవేక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించడంతోపాటు నాణ్యతపై కేంద్ర ప్రభుత్వ సంస్థతో తనిఖీలు చేపట్టాలని నిర్ణయించింది. బాలింతలు, గర్భవతుల్లో రక్తహీనత, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణకు మరిన్ని చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా అందించే నాణ్యమైన ఆహారాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్ రూపకల్పన చేసినట్లు చెప్పారు. డిసెంబర్ 1 నుంచి పౌష్టికాహార పంపిణీ బాధ్యతలను మార్క్‌ఫెడ్ చేపట్టనుందని, దీన్ని ప్రత్యేక యాప్ ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

చారిత్రక విజయమే లక్ష్యం

- అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం జగన్
- సంక్షేమ పథకాలతో 87 శాతం కుటుంబాలకు మంచి చేశాం
- సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, ఆర్బీకేలతో కళ్లెదుటే అభివృద్ధి

2లో

నేడు కృష్ణా జిల్లా అవనిగడ్డలో

పర్యటించనున్న సీఎం

2లో

కాంగ్రెస్ సారథి ఖర్గే

శశిథరూర్‌పై భారీ విజయం

- మల్లికార్జున ఖర్గేకు 7,897 ఓట్లు, థరూర్‌కు 1,072 ఓట్లు
- 26న అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ.. ఖర్గే నివాసానికి వెళ్లి అభినందించిన సోనియాగాంధీ

- వివరాలు 6లో



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సోనియాగాంధీ

ఆ బాబు, ఈ బాబు ఒక్కరేగా పవన్..!



- అప్పుడు మీరు దోపీడీదారుడన్నది ఈయన్నే కదా?
- ఒక్క విశాఖపట్నంలోనే లక్ష కోట్లు దోచాడని చెప్పావు..
- అంతటా అవినీతేనని మండిపడ్డావు
- 2014లో ఎందుకు మద్దతిచ్చానా అని బాధ పడ్డావు
- చంద్రబాబు మళ్లీ సీఎం అయితే నీతే ఉండదు, అంతా అవినీతే అనలేదా?
- మళ్లీ టీడీపీకి ఓట్లేస్తే మన తల్లులు, అక్కలనూ దూషిస్తారన్నదీ నువ్వే కదా?
- నాడు ఇలా మాట్లాడింది వ్యతిరేక ఓట్లను చీల్చడానికే కదా..
- నేడు మాట తప్పింది అదే బాబుకు మళ్లీ మేలు చేయడం కోసం కాదా?

7లో

నీ ప్యాకేజీ కోసం యువత రౌడీలవ్వాలా?

పవన్‌కు మంత్రి కారుమూరి ప్రశ్న

7లో

బాబు ఆలోచనలే పవన్ అజెండా: మంత్రి చెల్లుబోయిన

పవన్.. ఈ ప్యాకేజీ ఎంత?

మంత్రి సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా

నేడు అవనిగడ్డలో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి.. 10.55 గంటలకు అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చేరుకుంటారు. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 22 ఏ (1) కింద ఉన్న నిషేధిత జాబితా నుంచి డీనోటిఫై చేసిన భూముల క్లియరెన్స్ పత్రాలను రైతులకు సీఎం జగన్ అందజేస్తారు. మధ్యాహ్నం 12.25 గంటలకు అవనిగడ్డ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 1.25 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

ఆ కులాలను ఎస్టీల్లో చేర్చే దానిపై ఏకసభ్య కమిషన్

సాక్షి, అమరావతి: వాల్మీకి, బోయ, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకుగాను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులిచ్చారు. వాల్మీకి, బోయ, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై అధ్యయనం చేసి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మకు అస్వస్థత



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్‌శర్మ అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఆయన స్వల్ప అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి ప్రాథమిక చికిత్స చేయించుకున్నారు. అయితే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా.. గుండె సంబంధిత చికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. కొద్ది రోజుల్లో ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి విధుల్లో చేరే అవకాశం ఉంది. కాగా, సమీర్‌శర్మను సీఎం వైఎస్ జగన్ బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలు విజయానంద్‌కు..

సీఎస్ డాక్టర్ సమీర్‌శర్మ అస్వస్థతకు గురై సెలవులో ఉన్న నేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముత్యాల రాజు ఉత్తర్వులిచ్చారు.

ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాశ్



సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ముఖ్య రెసిడెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్ రాష్ట్ర రహదారులు–భవనాలు(ఆర్ అండ్ బీ), రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు చూస్తున్న ఎంటీ కృష్ణబాబును రిలీవ్ చేశారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏపీ భవన్ ముఖ్య రెసిడెంట్ కమిషనర్‌గా ఆదిత్యనాథ్‌దాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న జి.వీరపాండ్యన్‌ను పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏపీ మార్క్‌ఫెడ్ జీఎండీగా కూడా వీరపాండ్యన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

తిరుగు ప్రయాణాలపై ఆర్టీసీ రాయితీ

- రేపటి నుంచి అమలు

సాక్షి, అమరావతి: ఆన్‌లైన్ అడ్వాన్స్ రిజర్వేషన్ టికెట్ ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ కొత్త స్కీమ్‌లను తీసుకొస్తోంది. ముందస్తుగా వెబ్‌పోర్టల్లోగానీ, మొబైల్ యాప్ ద్వారాగానీ బుక్ చేసుకున్న నాన్–ఏసీ సర్వీసుల తిరుగు ప్రయాణ టికెట్‌లపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఆరునెలల పాటు.. రేపటి (శుక్రవారం) నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ట్రయల్ రన్‌గా దీన్ని అమలు చేయనుంది. మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తుల పోటీని తట్టుకోవడంతో పాటు ప్రయాణికులను ఆకర్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏసీ సర్వీసుల్లో రిటర్న్ జర్నీ టికెట్‌లపై 10 శాతం, ఏసీ, నాన్–ఏసీ గ్రూప్ బుకింగ్‌పై ఐదుశాతం (చైల్డ్ పాసింజర్‌తోసహా నలుగురు సభ్యులు), ఏపీఎస్‌ఆర్టీసీ ఈ–వాలెట్ ద్వారా చేసే చెల్లింపులపై ఐదుశాతం రాయితీ ఇస్తోంది.

తెలుగు రిపోర్టర్ పోస్టుల భర్తీ పరీక్ష 16కు వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ లెజిస్లేచర్ విభాగంలో తెలుగు రిపోర్టర్ పోస్టుల భర్తీకోసం నవంబర్ 5వ తేదీ మధ్యాహ్నం నిర్వహించాల్సిన పేపర్–2 పరీక్షను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను నవంబర్ 16న ఉదయం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చారిత్రక విజయమే లక్ష్యం

అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం జగన్.. సంక్షేమ పథకాలతో 87% కుటుంబాలకు మంచి చేశాం





అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

- సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, ఆర్బీకేలతో కళ్లెదుటే అభివృద్ధి ఫలాలు
- ఇంత మంచి చేస్తున్నప్పుడు 175 స్థానాల్లోనూ గెలవడం సాధ్యమే
- కలసికట్టుగా పనిచేస్తే చరిత్రలో నిలిచిపోయేలా ఘనవిజయం సాధిస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల ఆశీస్సులు, దేవుడి దయతో చరిత్రలో నిలిచేలా గొప్ప పరిపాలన అందించగలుగుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతోనూ విడివిడిగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీరూ, నేనూ అంతా కలసి పనిచేస్తే చరిత్రలో నిలిచిపోయేలా 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ గెలుస్తామని, చారిత్రక విజయమే లక్ష్యమని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బాచిన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అద్దంకి నియోజకవర్గంలో చేసిన మంచిని ఈ సందర్భంగా సీఎం జగన్ గణాంకాలతో వివరించారు.

- మరో 19 నెలల్లో ఎన్నికలు రానున్నాయి. ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఈ రోజు నుంచే పార్టీని గ్రామస్థాయి నుంచి సన్నద్ధం చేయాలి. ఇకపై వేసే ప్రతి అడుగూ ఎన్నికల దిశగానే ఉండాలి.
- అద్దంకి నియోజకవర్గంలో టీడీపీపై విపరీతమైన వ్యతిరేకత ఉంది. నియోజకవర్గంలో కచ్చితంగా మార్పు వస్తుంది. మూడేళ్లలో అద్దంకి నియోజకవర్గంలో 93,124 కుటుంబాలకు రూ.1,081 కోట్లు అందచేశాం. 6,382 మందికి ఇళ్లు, 9,368 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం. 47,123 మందికి బియ్యం కార్డులు మంజూరు చేశాం. పారదర్శకంగా లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హత ఉన్న ఏ ఒక్కరూ మిస్ కాకుండా ఆయా కుటుంబాలకు మంచిచేశాం.
- చేసిన మంచిని ప్రతి అక్కకూ, చెల్లెమ్మకూ లేఖలతో వివరిస్తూ గడపగడపకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మన ప్రతినిధిగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఇంట్లో జరిగిన మంచిని ఆయా కుటుంబాలకు వివరిస్తున్నారు. ఎక్కడైనా పొరపాటున అర్హత ఉండికూడా రాని పరిస్థితి ఉంటే వారికి కూడా మంచి చేయాలన్నదే గడపగడపకు కార్యక్రమం ఉద్దేశం.
- ప్రతి గ్రామ సచివాలయానికీ రూ.20 లక్షలు ఇచ్చాం. ప్రాధాన్యతగా గుర్తించిన పనులకు ఈ నిధులు కేటాయిస్తాం.
- ప్రతి సచివాలయంలో కనీసం రెండు రోజులు గడపగడపకు కార్యక్రమం చేపట్టాలని, కనీసం రోజుకు 6 గంటలు ఉండాలని, అంటే రెండు రోజుల్లో 12 గంటలపాటు ఆ సచివాలయంలో తిరగాలని చెప్పాం. దీనివల్ల ప్రాధాన్యతగా చేపట్టాల్సిన పనులను గుర్తించగలుగుతాం. ఎన్నికలకు దాదాపుగా రెండేళ్ల ముందే నాయకులను ఇలా పంపిన కార్యక్రమం గతంలో ఎన్నడూ లేదు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు ఎలాంటి సాధకబాధకాలున్నా పరిష్కరించే విధంగా కృషి చేయాలి.

> ప్రతి గ్రామంలో 87 శాతం కుటుంబాలకు మేలు జరిగినప్పుడు, ఆ గ్రామంలో అందరి కంటికి కనిపించే విధంగా సచివాలయాలు, ఇంగ్లిషు మీడియం, విలేజ్ క్లినిక్స్, ఆర్బీకేలు, వ్యవసాయం చేసే తీరు మారుతున్నప్పుడు ఆ ఊరిలో మెజార్టీ రావడం ఎందుకు సాధ్యం కాదు? గ్రామంలో వచ్చినప్పుడు నియోజకవర్గంలో మెజార్టీ ఎందుకు రాదు? నియోజకవర్గాల్లో వచ్చినప్పుడు 175కి 175 శాసనసభ స్థానాలు ఎందుకు రావు?

- కుప్పంలో అలాంటి ఫలితాలు వస్తాయని ఎవరైనా అనుకున్నారా? కుప్పంలోనే కాదు అద్దంకిలో కూడా మొత్తం 5కి ఐదు జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఐదింటికి ఐదు, అద్దంకి మున్సిపాల్టీ, 103 గ్రామ పంచాయతీల్లో 87 సర్పంచి స్థానాలను గెలిచాం.
- ఏమైనా సమస్యలు ఉంటే ఒక కుటుంబంగా పరిష్కరించుకుంటూ ముందుకు నడవాలి. అందరం ఒక్కటై కష్టపడదాం. 175కి 175 సీట్లు సాధిద్దాం. అద్దంకిలో మునుపెన్నడూలేని విజయాన్ని నమోదు చేద్దాం.
- ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ అందరం కలసికట్టుగా ఉంటేనే మనం మంచి విజయాలు సాధిస్తాం. డీబీటీ ఇవ్వడం, స్కూళ్లు, ఆస్పత్రులు బాగు చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం.. ఇలా ముఖ్యమంత్రిగా నేను చేయాల్సింది నేను చేయాలి. అదే సమయంలో మీరు చేయాల్సింది మీరూ చేయాలి.

వైద్యుల నియామకానికి అపూర్వ స్పందన

- తొలి రోజు 577 మంది హాజరు
- అత్యధికంగా జనరల్ సర్జరీ ఆరు పోస్టులకు 127 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డీఎంఈ, ఏపీవీవీపీ విభాగాల్లో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకానికి బుధవారం ప్రారంభమైన వాక్–ఇన్ ఇంటర్వ్యూలకు అపూర్వ స్పందన వచ్చింది. మూడు రోజులుపాటు ఇంటర్వ్యూలు జరుగుతాయి. తొలిరోజు డీఎంఈలో 15 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో 96 పోస్టులు, ఏపీవీవీపీలో 5 స్పెషాలిటీల్లో 172 పోస్టులకు ఇంటర్వ్యూలు చేపట్టారు. డీఎంఈ పరిధిలోని పోస్టులకు 331 మంది, ఏపీవీవీపీ పోస్టులకు 246 మంది వైద్యులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. డీఎంఈ పరిధిలో జనరల్ సర్జరీ పోస్టులు 6 ఉండగా, అత్యధికంగా 127 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ మెడిసిన్‌లో 21 పోస్టులకు 112 దరఖాస్తులు వచ్చాయి. ఏపీవీవీపీలో జనరల్ సర్జరీలోని 61 పోస్టులకు 137 మంది దరఖాస్తు చేశారు. రోస్టర్ పాయింట్ల ఆధారంగా పోస్టులు, ఖాళీల వివరాలను అధికారులు ప్రదర్శించారు. తొలుత హాజరైన అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలించి మెరిట్, ఆర్‌వోఆర్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని పోస్టుల భర్తీ చేపట్టారు. ఏదైనా స్పెషాలిటీ పోస్టుకు ఆర్‌వోఆర్‌కు లోబడి అభ్యర్థులు లేకపోతే కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేస్తారు. గురువారం ఏపీవీవీపీలో జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, సైకియాట్రి స్పెషాలిటీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. డీఎంఈలో న్యూక్లియర్ మెడిసిన్, అనస్తీషియా, ఆర్థోపెడిక్స్, ఓబీజీ, రేడియాలజీ/రేడియో డయగ్నోసిస్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయి.

వైద్య శాఖలో మానవ వనరుల కొరత లేకుండా

ఏపీలోని ప్రజలందరికీ మంచి వైద్యం అందించాలని సీఎం జగన్ సంకల్పించిన నేపథ్యంలో వైద్య శాఖలో మానవ వనరుల కొరత లేకుండా ప్రభుత్వం కృషి చేస్తోంది. మూడేళ్లలో 40,676 పోస్టులను భర్తీ చేసింది. డీఎంఈలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏపీవీవీపీలో సీఏఎస్ఎస్ పోస్టులకు పలుమార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా, కొన్ని పోస్టులు మిగిలిపోతున్నాయి. దీంతో 400కు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్, సీఏఎస్ఎస్ పోస్టుల భర్తీకి మూడు రోజుల పాటు ఇంటర్వ్యూలను వైద్య శాఖ నిర్వహిస్తోంది.

కేరళలోనూ ఆర్బీకే తరహా సేవలు

- కేరళ రాష్ట్ర మంత్రి చించురాణి వెల్లడి



వణుకూరులో వైఎస్సార్ సంచార పశువైద్య సేవ వాహనాన్ని పరిశీలిస్తున్న కేరళ మంత్రి చించురాణి

సాక్షి, అమరావతి/పెనమలూరు: ఏపీలోని రైతు భరోసా కేంద్రాలు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయని, ఎక్కడకు వెళ్లినా వీటిపైనే చర్చ జరుగుతోందని కేరళ రాష్ట్ర పశు సంవర్థక, పాడి అభివృద్ధి శాఖ మంత్రి చించురాణి తెలిపారు. వీటిని ఆదర్శంగా తీసుకుని కేరళలోనూ ఆర్బీకే తరహా సేవలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి తేవాలని తమ ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం కృష్ణా జిల్లా వణుకూరు ఆర్బీకే కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆర్బీకే ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కియోస్క్ ద్వారా సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాస విత్తనాలను రైతులు ఏ విధంగా పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవ వాహనాలు, వాటి సేవలనూ పరిశీలించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా నియోజకవర్గ స్థాయిలో సంచార పశు వైద్య వాహనాలను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అనంతరం పెదపారుపూడి మండలం ఎలమర్రులోని పుంగనూరు గో జాతి పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. జాయింట్ లయబిలిటీ గ్రూపు సభ్యులతో సంభాషించారు. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆర్బీకేలను వన్ స్టాప్ సొల్యూషన్స్ సెంటర్స్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దిందని చెప్పారు. ప్రతి ఆర్బీకేను రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్‌గా తీర్చిదిద్దారని, గ్రామ స్థాయిలో పశుసంవర్ధక సహాయకులను నియమించారని చెప్పారు.

జాగ్రత్త వహించకపోతే ఎముకలు గుల్లే

- ప్రపంచంలో 20 కోట్ల మందికి బోలు ఎముకల వ్యాధి
- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ డే



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల మందికిపైగా బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపోరోసిస్) వ్యాధితో బాధపడుతున్నారని అంచనా. 50 ఏళ్లు పైబడిన ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు, ప్రతి 5గురు పురుషుల్లో ఒకరు చొప్పున ఆస్టియోపోరోసిస్ వ్యాధి వస్తుందని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథరామారెడ్డి చెప్పారు. అక్టోబర్ 20న ప్రపంచ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా ఆయన చెప్పిన వివరాలు ఇవీ...

ఆస్టియోపోరోసిస్ అంటే?

ఎముకలు వాటి ఖనిజ సాంద్రతను కోల్పోయి పెళుసుబారడం వల్ల ఈ వ్యాధి ఏర్పడుతుంది. ఇది ఎముకలను బలహీనపరిచి విరిగిపోయేలా చేస్తుంది. తుంటి ఎముకలు, పక్కటెముకలు, మణికట్టు ఇంకా వెన్నెముక వంటి ఎముకలు విరిగే (ఫ్రాక్చర్) అవకాశం ఉంటుంది. ప్రైమరీ ఆస్టియోపోరోసిస్ అనేది సహజమైన వయసు సంబంధిత మార్పుల వల్ల ఎముకల సాంద్రత తగ్గి వస్తుంది. సెకండరీ ఆస్టియోపోరోసిస్ కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల వల్ల లేదా మందుల వల్ల కలుగుతుంది. దీని లక్షణాలు ఏంటంటే.. వీపు కింది భాగంలో నొప్పి వస్తుంది. ఎత్తు తగ్గడం, వెన్నెముక విరగడం వల్ల శరీరం వంగిపోవడం, శరీర భంగిమల్లో మార్పు, శ్వాస ఆడకపోవడం జరుగుతుంది.

నివారణోపాయాలు ఇవీ

వ్యాయామం చేయడం, కాల్షియం, విటమిన్‌–డి, ఇతర విటమిన్లతో కూడిన ఆహారం లేక మందులు తీసుకోవడం వంటివి చేయాలి. పురుషుల్లో టెస్టోస్టెరాన్ థెరపీ ఎముకల సాంద్రతను పెంచుతుంది. ఈస్ట్రోజెన్ హార్మోన్ ఇవ్వడం ద్వారా ఎముకల సాంద్రత తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని ఆపొచ్చు. పాలు, చీజ్, పెరుగు, బ్రొకోలీ వంటి ఆకు కూరలు, కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

విశాఖ కేంద్రంగా రిమోట్ రేడియాలజీ సేవలు

మెడ్‌టెక్ జోన్‌లో 'టెలీ రేడియాలజీ సొల్యూషన్స్' కొత్త కేంద్రం ప్రారంభం



టెలీ రేడియాలజీ నూతన కేంద్రం ప్రారంభోత్సవంలో ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ అండ్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ, టెలీ రేడియాలజీ సొల్యూషన్స్ సీఈవో డాక్టర్ అర్జున్ కల్యాణ్‌పూర్ తదితరులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): దేశవ్యాప్తంగా ఆస్పత్రులు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు టెలీ రేడియాలజీ సేవలు అందించేందుకు 'టెలీ రేడియాలజీ సొల్యూషన్స్(టీఆర్ఎస్).. విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. దేశంలోని ఆరోగ్య సంరక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టెలీ రేడియాలజీ సొల్యూషన్స్ సీఈవో, చీఫ్ రేడియాలజిస్ట్ డాక్టర్ అర్జున్ కల్యాణ్‌పూర్ మాట్లాడుతూ దేశంలో 70 శాతం గ్రామీణ, ఇతర ప్రాంతాల ప్రజలు రేడియాలజీ సేవల కోసం మెట్రో, పెద్ద నగరాలకు వెళ్లాల్సి వస్తోందని, మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన నూతన కేంద్రం ద్వారా ఆలోటు తీరుతుందన్నారు. యువ రేడియాలజిస్టులు, మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజిస్టులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇతర సహాయక సిబ్బందికి ఉపాధి అవకాశాలను కూడా ఈ హబ్ సృష్టిస్తుందన్నారు. ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ అండ్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద వైద్య పరికరాల తయారీ పార్కుగా ఉన్న ఏపీ మెడ్‌టెక్ జోన్.. రేడియాలజిస్టులు అందుబాటులో లేని ప్రదేశాల్లో టీఆర్ఎస్ సహకారంతో సీటీ స్కానర్, ఎంఆర్ఐ వంటి స్థానిక మెడ్‌టెక్ ఉత్పత్తుల వృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

పది విడతల్లో పిల్లల సంరక్షణ సెలవులు వాడుకోవచ్చు

- మహిళా ఉద్యోగులకు వెసులుబాటు

సాక్షి, అమరావతి: మహిళా ఉద్యోగులు ఇకనుంచి పిల్లల సంరక్షణ సెలవులను 10 విడతల్లో వినియోగించుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 11వ వేతన సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం పిల్లల సంరక్షణ సెలవులను 60 రోజుల నుంచి 180 రోజులకు పెంచుతూ 3 విడతల్లో వినియోగించుకోవాలని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే ఏపీ సచివాలయ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మూడు విడతలకు బదులుగా పది విడతల్లో సెలవులను వినియోగించుకునేందుకు వీలుగా సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎవరైనా కొన్ని రోజులు పిల్లల సంరక్షణ సెలవులు వినియోగించుకుంటే.. మిగతా సెలవులను పది విడతల్లో వినియోగించుకునేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ట్రిబుల్ మర్డర్ కేసులో ముద్దాయికి ఉరి

- భార్యపై అనుమానం, కుటుంబంపై కోపంతో తల్లి, చెల్లి, తమ్ముడిని చంపిన కరీముల్లా
- కోర్టులో నేరాన్ని అంగీకరించిన ముద్దాయి.. ఉరిశిక్ష విధిస్తూ ప్రొద్దుటూరు కోర్టు తీర్పు



కరీముల్లా (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం: ట్రిబుల్ మర్డర్ కేసులో ముద్దాయి కరీముల్లాకు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రొద్దుటూరులోని హైదర్‌ఖాన్ వీధిలో నివసించే ఉప్పలూరు చాంద్‌బాషా, గుల్జార్‌బేగం దంపతులకు ఓ కుమార్తె (కరీమున్నీసా), ముగ్గురు కుమారులు(కరీముల్లా, మహబూబ్‌బాషా, మహ్మద్ రఫీ). రఫీ మినహా ఇద్దరు కుమారులు, కుమార్తెకు పెళ్లిళ్లు అయ్యాయి. కరీముల్లా గతంలో తల్లిదండ్రుల వద్దే ఉండేవాడు. అయితే అతను కుటుంబాన్ని సరిగ్గా పట్టించుకోకపోవడంతో.. తల్లిదండ్రులు పక్క వీధిలో వేరే కాపురం పెట్టించారు. ఆ సమయంలో కొందరి చెప్పుడు మాటలు విన్న కరీముల్లా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తనపై నింద వేయడంతో.. ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో కరీముల్లా మళ్లీ తల్లిదండ్రుల వద్దకు వచ్చేశాడు. గర్భిణి అయిన చెల్లెలు కరీమున్నీసా కూడా పుట్టింటికి వచ్చింది. భార్యతో విడాకులు ఇప్పించాలని కరీముల్లా అడుగుతుండగా.. తల్లిదండ్రులు సర్ది చెబుతూ వచ్చారు. దీంతో 2021 ఏప్రిల్ 25వ తేదీన కరీముల్లా కుటుంబసభ్యులతో గొడవ పడ్డాడు. ఆ మరుసటి రోజు(26వ తేదీ) తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న తల్లి గుల్జార్‌బేగం, చెల్లి కరీమున్నీసా, తమ్ముడు రఫీని కరీముల్లా రోకలి బండతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా.. ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతూ వచ్చింది. ముగ్గురిని తానే హత్య చేశానని కరీముల్లా అంగీకరించడం.. నేరం రుజువు కావడంతో జడ్జి జి.రమేశ్‌బాబు ఉరిశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. ప్రొద్దుటూరు కోర్టు చరిత్రలో ఇది మొదటి ఉరిశిక్ష తీర్పు అని ఏపీపీ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మనమే ముందుండాలి

▶ మొదటి పేజీ తరువాయి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. నవంబరు నుంచి గుడ్ల పంపిణీపై కూడా యాప్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణలో ఏపీ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచేలా కృషి చేయాలని అధికార యంత్రాంగానికి సూచించారు. తద్వారా సుస్థిర ప్రగతి లక్ష్యాలను సాధించాలని దిశా నిర్దేశం చేశారు. దీనికి సంబంధించి గతంలో రూ.500 కోట్ల బడ్జెట్ మాత్రమే ఉండగా ఇప్పుడు రూ.1,900 కోట్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. మనం చేస్తున్న కృషిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తేనే సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో నంబర్ వన్‌గా ఉంటామని, లేదంటే ఫలితం ఉండదని స్పష్టం చేశారు. మహిళా, శిశు సంక్షేమంపై ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ..

క్వాలిటీ, క్వాంటిటీ..

అంగన్‌వాడీల్లో పిల్లలకు ఇచ్చే ఆహారం నాణ్యతతోపాటు కచ్చితమైన పరిమాణంలో ఉండాలని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారు. పాలు, గుడ్లలో క్వాలిటీ, క్వాంటిటీ ఉండి తీరాలని, వీటిపై పర్యవేక్షణ తప్పనిసరన్నారు. రోజూ నిర్దేశిత మేరకు ఆహారం అందుతుందా? లేదా? అన్నదానిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం క్వాలిటీ, క్వాంటిటీతో కూడిన ఆహారం పిల్లలకు అందేలా పూర్తి స్థాయిలో నూరు శాతం పర్యవేక్షణ మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. దీనికోసమే దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ల నియామకాలను ప్రారంభించగా దురదృష్టవశాత్తూ కోర్టుల ద్వారా అడ్డుకునే యత్నం చేశారని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ పోస్టుల భర్తీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నాడు – నేడుతో సదుపాయాలు

అంగన్‌వాడీల్లో టాయిలెట్ల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. సొంత భవనాల్లోనే కాకుండా అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీల్లోనూ సదుపాయాలు కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు లాంటివి పాడైపోతే వెంటనే రీప్లేస్ చేయాలని సూచించారు. నిర్వహణను పట్టించుకోకపోతే మళ్లీ అలాగే ఉంటాయని, అంగన్‌వాడీలను సిబ్బంది తమవిగా భావించాలన్నారు. వెంటనే ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు. నాడు – నేడుతో అంగన్‌వాడీలను సమగ్రాభివృద్ధి చేసేలా పాఠశాల విద్యాశాఖతో కలసి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడీల్లో ప్రస్తుత పరిస్థితులు ఏమిటి? ఎలాంటి సదుపాయాలు కల్పించాలి? ఎలా తీర్చిదిద్దాలి? తదితర అంశాలతో ప్రణాళిక రూపొందించి విడతలవారీగా పనులు చేపట్టి ముందుకు వెళ్లాలని నిర్దేశించారు.

అంగన్‌వాడీలకు ఫ్రిడ్జ్‌లు

పిల్లలకు ఇచ్చే ఆహారం పాడవకుండా, పాలు, గుడ్లు లాంటివి నిల్వ చేసే విధానాలపై కూడా దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. అంగన్‌వాడీల్లో ప్రతిచోటా ఫ్రిడ్జ్‌ల ఏర్పాటు దిశగా ఆలోచన చేయాలన్నారు.

చిన్ననాటి నుంచే చదువుల్లో రాణించేలా..

ఇంగ్లిష్ మీడియాన్ని చిన్ననాటి నుంచే అలవాటు చేసేందుకు ఫౌండేషన్ స్కూళ్లు, శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు తెచ్చామని సీఎం జగన్ చెప్పారు. రూ.వేల కోట్లు ఖర్చు చేసి విప్లవాత్మక మార్పులు తెచ్చినా సరైన పర్యవేక్షణ లేకపోతే ప్రయోజనం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వంద శాతం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారంపై అధికారులు సరైన సమయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే అరణ్య రోదనే అవుతుందని స్పష్టం చేశారు.

57 వేల సెల్‌ఫోన్ల పంపిణీకి శ్రీకారం

అంగన్‌వాడీలకు, సూపర్‌వైజర్లకు దాదాపు 57 వేల సెల్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని సమీక్ష సందర్భంగా సీఎం జగన్ ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం సరఫరా, ఇతర సేవలను సమర్థంగా అమలు చేయడంతో పాటు సమగ్ర పర్యవేక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, వర్కింగ్ సూపర్‌వైజర్లకు ప్రభుత్వం వీటిని అందచేస్తోంది. సమీక్షలో మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీడీడీసీఎఫ్ ఎండీ ఎ. బాబు, మార్క్‌ఫెడ్ ఎండీ పీఎస్ ప్రద్యుమ్న, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి తదితరులు పాల్గొన్నారు.

తొలిదశలోనే అరికట్టేలా..

అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై విలేజ్ క్లినిక్స్, ఆశా వర్కర్ల ద్వారా వైద్యాధికారులు సమగ్రంగా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా ఇందులో భాగస్వామి కావాలని స్పష్టం చేశారు. శారీరకంగా బలహీనంగా ఉన్న పిల్లలకు వైద్య సాయం, పౌష్టికాహారం అందించడం ద్వారా రుగ్మతలను తొలిదశలోనే నివారించే అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడీలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణను జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.

నాడు రూ.500 కోట్లు.. నేడు రూ.1,900 కోట్లు

గతంలో పిల్లల భోజనానికి ఏడాదికి సుమారు రూ.500 కోట్లు మాత్రమే ఇవ్వగా ఇప్పుడు ఏటా సుమారు రూ.1,900 కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. తల్లులు, చిన్నారుల బాగోగుల కోసం ఎంతో కృషి చేస్తున్నామని, ఈ కేటగిరీ ఎస్‌డీజీల్లో దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్‌గా నిలవాలని స్పష్టం చేశారు. ఇంత చేసినా ఆ వివరాలను (డేటా) అప్‌డేట్ చేయకపోతే మన కృషి ఎస్‌డీజీలో ప్రతిబింబించదని, ఆ పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళ, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ చాలా పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామని తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్ట్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం


7 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్న వరద నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్/మాచర్ల: శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి 212.9198 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. కొద్దివారాలుగా జలాశయానికి వరద భారీగా వచ్చి చేరుతుండటంతో దిగువ ప్రాంతాలకు నీటిని వదులుతున్నారు. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి 1,52,966 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వస్తోంది. 7 రేడియల్ క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర తెరిచి 1,54,922 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు కుడిగట్టు కేంద్రంలో 15.361 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.085 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 68,661 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడిచిపెట్టారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యాం నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది.

సాగర్‌లో 6 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జున సాగర్ జలాశయానికి వరద నీరు కొనసాగుతుండటంతో బుధవారం 6 క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,54,922 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దీంతో 6 క్రస్ట్‌గేట్లు 10 అడుగుల మేర ఎత్తి 1,20,766 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువ, ఎస్ఎల్‌బీసీ, వరద కాలువలు కలిపి 13,627 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయ ప్రస్తుత నీటిమట్టం 588.70 అడుగులు ఉంది. ఇది 308.1702 టీఎంసీలకు సమానం.



స్వీయ సంస్కరణ దానికదే సామాజిక సంస్కరణను తీసుకొస్తుంది.
- రమణ మహర్షి

సాక్షి

గురువారం, అక్టోబర్, 20

కాంగ్రెస్‌లో ఖర్గే హవా!

అందరూ ఊహించినట్టే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో సీనియర్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఘనవిజయం సాధించారు. 137 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో అధ్యక్ష పదవికి 'నిజమైన' ఎన్నిక జరగటం ఇది ఆరోసారి. హైకమాండ్ సంస్కృతి, దాని అండదండలతో రాష్ట్రాల్లో వేళ్లూనుకున్న ముఠాలు కాంగ్రెస్‌కు పెను భారమై అది అవసాన దశకు చేరువవుతున్న వేళ ఈ ఎన్నికలు జరిగాయి. గతంలో 'బయటి వ్యక్తులు' పార్టీ అధ్యక్షులైన సందర్భాలున్నా అవి అధికారంలో ఉండగా జరిగినవే. విపక్షంలో ఉంటూ, గాంధీ కుటుంబసభ్యులు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నా 'బయటి వ్యక్తి' అధ్యక్షుడు కావటం ఇదే తొలిసారి. పార్టీ సారథ్యం కుమారుడు రాహుల్ చేతుల్లోనే ఉండాలని అధినేత సోనియాగాంధీ తాపత్రయపడ్డారు.కొద్దికాలం అధ్యక్ష పీఠంపై ఉన్న రాహుల్ తీరా 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం పొందాక అందుకు నైతికబాధ్యత వహించి తప్పుకున్నారు. ఆ తర్వాత చాన్నాళ్లపాటు ఆయన్ను బతిమాలటం, బుజ్జగించటం చేశారు. కానీ అవి ఫలించకపోవటంతో విధిలేక కేవలం ఆర్నెల్లపాటు మాత్రమే అధ్యక్ష బాధ్యతలు చూస్తానని సోనియా ప్రకటించారు. అది జరిగి కూడా మూడేళ్లు దాటిపోయింది. ఇన్నాళ్లకు ఎన్నికలు నిర్వహించటం, సుదీర్ఘ అనుభవం, స్వతంత్ర భావాలు ఉన్న దళిత నాయకుడు ఖర్గే అధ్యక్షుడు కావటం మెచ్చదగ్గ పరిణామం. అయితే ఆయనను గాంధీ కుటుంబసభ్యులు స్వతంత్రంగా పని చేయనిస్తారా, వెనకనుంచి శాసించే విధానాలకు స్వస్తిపలుకుతారా అన్నది ముమ్మందు గానీ తెలియదు. సమస్యలు తలెత్తినప్పుడు స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటున్నారన్న అభిప్రాయం కలగకపోతే మొత్తం వ్యవహారం మొదటికొస్తుంది. ఆయన కీలుబొమ్మ అధ్యక్షుడిగా మిగిలిపోతారు.

అధ్యక్ష ఎన్నికలు ఏ పరిస్థితుల్లో జరిగాయో, వాటి తీరుతెన్నులేమిటో అందరికీ తెలుస్తూనే ఉంది. ఈ పదవికి గాంధీ కుటుంబ వీరవిధేయుడిగా ముద్రపడిన రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌ను అనుకున్నారు. సీఎం పదవినుంచి వైదొలగటం తప్పనిసరని తేలాక ఆయన చిన్న సైజు తిరుగుబాటు ప్రకటించటం పార్టీని సంక్షోభంలో పడేసింది. ఆ తర్వాతే ఖర్గే పేరు తెరపైకొచ్చింది. ఈ ఎన్నికల్లో 'అధికారిక అభ్యర్థి' ఎవరూ లేరని రాహుల్ ఒకటికి రెండుసార్లు చెప్పినా వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. అనధికార అధికారిక అభ్యర్థి ఖర్గేయేనని కాంగ్రెస్ శ్రేణులకు లోపాయికారీగా సందేశం వెళ్లిపోయింది. అందుకే ఆయనపై పోటీపడిన శశిథరూర్‌కు ఎక్కడా పెద్దగా ఆదరణ దొరకలేదు. ఆఖరికి ఉత్తరకుమారులుగా, జీ–23 నేతలుగా ముద్రపడినవారు సైతం ఆయన వెనక లేరు. తమలో ఒకరు పోటీచేస్తున్నారన్న స్పృహ కూడా లేకుండా వారిలో అత్యధికులు మౌనంగా ఉన్నారు. మిగిలినవారు ఖర్గే అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించి తమ వీర విధేయత చాటుకున్నారు. థరూర్‌కు ద్వితీయశ్రేణి నేతల్లో ఒకరిద్దరు మాత్రమే మిగిలారు. 'అనుభవానికి' పట్టం కట్టాలంటూ కొందరు నేతలు ప్రకటించి, పోటీనుంచి తప్పుకోమని పరోక్షంగా థరూర్‌కు సూచించారు. ఇవన్నీ గుర్తించబట్టే ఈ ఎన్నికల్లో తనకు సమానావకాశం లేకుండా పోయిందని ఆయన వాపోయారు. పార్టీలో ఇకపై మీ పాత్రేమిటన్న ప్రశ్నకు జవాబుగా ఆ సంగతిని ఖర్గే, సోనియా నిర్ణయిస్తారని ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగానే రాహుల్‌గాంధీ నోరుజారటం గమనిస్తే థరూర్ ఆరోపణలో వాస్తవముందని తేలుతుంది.

అనుభవాన్ని మించిన గురువు లేరని నానుడి. దీర్ఘకాలం అధికారానికి దూరమైనా కాంగ్రెస్ దీన్ని గుర్తించలేకపోయింది. ఎన్నడూలేని విధంగా అత్యంత బలహీన స్థితిలో పడ్డామని తెలిసినా సోనియా, రాహుల్ పాత పద్ధతులకు స్వస్తి చెప్పలేకపోయారు. పదవులపై వ్యామోహం లేదంటూనే తెరచాటుగా పావులు కదిపే విధానాలు వదులుకోలేదు. జవాబుదారీతనం లేకుండా పెత్తనం చెలాయించటం, బెడిసికొట్టిన పక్షంలో సంబంధం లేనట్టు ఉండిపోవటం రాహుల్ ఇన్నాళ్లుగా చేసిన పని. దాని పర్యవసానంగానే పార్టీ అస్తవ్యస్తమైంది. వయసురీత్యా ఖర్గే వృద్ధాప్యంలో ఉన్నారు. ఈ వయసులో చురుగ్గా తిరిగి పార్టీని పరుగెత్తించటం ఎంతవరకూ సాధ్యమన్న ప్రశ్న ఉండనే ఉంది. కాంగ్రెస్ సీనియర్లలో సగం మంది, అనుబంధ సంస్థల నాయకగణంలో 70 శాతంమంది పనికి మాలిన సరుకని ఏడేళ్లక్రితం అప్పట్లో పార్టీ నేత సందీప్ దీక్షిత్ వ్యాఖ్యానించారు. ఏ పదవికైనా గాంధీ కుటుంబానికి విధేయతే గీటురాయిగా మారడంవల్ల వచ్చిపడిన ఉపద్రవమిది. ఖర్గే ముందు సంస్థాగతంగా చాలా సవాళ్లున్నాయి. పార్టీ వర్కింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి. పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ తదితరాలను పునరుద్ధరించాలి. అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ముఠా పోరు ముదిరింది. స్వరాష్ట్రమైన కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు శివకుమార్ వర్గాలు నువ్వా నేనా అన్నట్టున్నాయి. విపక్షంలో ఉన్న తెలంగాణ, కేరళ, పంజాబ్ తదితరచోట్ల కుమ్ములాటలు ఆగటం లేదు. ఇవన్నీ రాహుల్ 'భారత్ జోడో యాత్ర' గాలి తీస్తున్నాయి. వీటన్నిటిపైనా గాంధీ కుటుంబ ప్రమేయంలేకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవటం సాధ్యమేనా అన్నది పెద్ద ప్రశ్న. ఇక బీజేపీ దూకుడు సరేసరి. ఏం చేసైనా ఎన్నికల్లో నెగ్గాలని చూడటం, ఓడినపక్షంలో ఫిరాయింపుల పాచిక వాడటం దాని నైజం. సంక్షోభ సమయాల్లో ప్రదర్శించే చాకచక్యతే నాయకత్వ పటిమను నిగ్గుతేలుస్తుంది. ఖర్గే దాన్ని ఏ మేరకు చూపగలరో వేచిచూడాల్సి ఉంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.దశమి ప.1.40 వరకు తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.9.23 వరకు, తదుపరి మఖ **వర్జ్యం:** రా.10.24 నుండి 12.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.34 వరకు, తదుపరి ప.2.27 నుండి 3.14 వరకు **అమృతఘడియలు:** ఉ.7.34 నుండి 9.21 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

ఆమె కథ మన జీవిత కథ

సందర్భం



ఎమ్మాన్యుయేల్ లెనెయిన్

ఆనీ ఎర్నొ రచనలకు గానీ, శైలికి గానీ అంత 'వాడి' ఎక్కడిదంటే... ఎవరు చదువుతుంటే వాళ్లకు అది తమ కథలానే అనిపించడంతో అవి ఎప్పటికప్పుడు పదును తేలుతూ ఉంటాయి! రచయిత్రిగా ఆనీ పోరాటం, ఆమె రచనలు చదివే స్త్రీల పోరాటం వేర్వేరు కాదు. స్త్రీలు తమ శరీరాలపై అధికారాన్ని కలిగి ఉండటానికీ, పురుషులతో సమానంగా జీవించడానికీ చేసే పోరాటమే ఆమె రచనల సారం. ఒక తరం స్త్రీల ఉద్యమగానం అది. ఆమె రచనలన్నీ కూడా కల్పనలా అనిపించే స్వీయ వాస్తవానుభవాలే. సాహిత్యం, సామాజిక శాస్త్రం, చరిత్ర అనే మూడు కూడళ్ల నడుమ నిలబడి సమాజం మరుపున పడి ఉన్న వాళ్ల కోసం ఎలుగెత్తుతున్న స్వరం ఆనీ!

సాహిత్యంలో ఇప్పటివరకు పదహారు మంది నోబెల్ గ్రహీతలతో అత్యధికంగా విజేతలను కలిగి ఉన్న దేశం ఫ్రాన్స్. వారిలో ఏకైక మహిళ ఆనీ ఎర్నొ. 2022 సంవత్సరానికి గాను ఆనీ నోబెల్ విజేతగా నిలిచారు. ఆమె కంటే ముందు 2014లో ప్యాట్రిక్ మొడియానో, 2008లో జె.ఎం.జి. క్లెజియో ఈ ఘనత సాధించారు. ఫ్రాన్స్‌లోని నార్మాండీలో 1940లో జన్మించిన ఆనీ ఎర్నొ నిరాడంబరమైన కుటుంబంలో పెరిగారు. జీవిక కోసం ఆమె తల్లిదండ్రులు నిత్యావసర వస్తువులను విక్రయించే దుకాణాన్ని నడుపుతుండేవారు. తర్వాతి కాలంలో ఆ దుకాణం బార్‌గా, కెఫేగా విస్తరించింది. అక్కడికంతా శ్రామిక వర్గమే వస్తుండేది. తల్లి ప్రోత్సాహం, ప్రోద్బలంతో ఆనీ యూనివర్సిటీ స్థాయి వరకు విద్యను అభ్యసించి, అనంతరం టీచరుగా మారారు. రచయిత్రిగా మారారు. వర్గ వ్యత్యాసాలు, పితృస్వామ్య వ్యవస్థ, అసమానతలు వంటి విస్తృత సామాజిక అంశాలను తన రచనల్లో చర్చించారు.

ఆనీ ఎర్నొ తొలి నవల 'క్లీన్డ్ ఔట్' (ఫ్రెంచిలో లెజ్ ఆర్మ్‌వార్ విడేస్) 1974లో వచ్చింది. అయితే ఆమెకు గుర్తింపు వచ్చింది మాత్రం 1983లో వచ్చిన 'ఎ మ్యాన్స్ ప్లేస్'తోనే. తల్లిదండ్రులు నడిపిన కెఫేలో తను ఎదుగుతున్నప్పటి జ్ఞాపకాలను అందులో రాసుకున్నారామె. తర్వాత 1987లో 'ఎ ఉమన్ స్టోరీ' అనే నవల రాశారు. అది ఆనీ తల్లి కథ. అక్కడి నుంచి అంతా రచనా ప్రవాహమే. 2008లో 'ది ఇయర్స్' పుస్తకం వచ్చే నాటికి కాలానుక్రమ వైయక్తిక స్మృతుల సమ్మేళనంగా అనేకానేక రచనల్ని చేశారు. 'ది ఇయర్స్' ఆనీ స్వీయ గాథ. ఆ నవల ఇంగ్లిష్‌లోకి అనువాదం కాగానే (లెజ్ అన్నీస్ అన్నది ఫ్రెంచి టైటిల్) ఆనీ పేరు సాహితీ ప్రపంచంలో మార్మోగిపోయింది. 1940లు, 90ల మధ్య కాలంలో ఒక స్త్రీ జీవితంలోని ఉత్థాన పతనాలను కథనపరచిన ఈ రచన... మూడో మనిషి చెబుతున్నట్లుగా ముందుకు సాగుతుంది. పాత ఫొటోలను, సినిమా జ్ఞాపకాలను జత పరుస్తూ బాల్యం నుంచి తల్లి అయ్యేవరకు తన జీవితాన్ని అందులో అక్షరబద్ధం చేశారు ఆనీ.

1960లలో తమ కుటుంబం ఎలా జీవించిందీ చెబుతూ, ''మేమెంత సమయాన్ని పొదుపు చేశామో చూసుకుని ఆశ్చర్యపోయే వాళ్లం. సిద్ధంగా అందుబాటులో ఉండే మిరప పొడులతో మా సూప్ తయారయ్యేది. ప్రెస్టో ప్రెషర్ కుక్కర్‌తో త్వరత్వరగా వంట చేసే వాళ్లం. 'యమోనైజ్' అయితే రెడీమేడ్‌గా ట్యూబులలో దొరికేసేది. గుడ్డు పచ్చసొన, నూనె, నిమ్మరసం కలిపి తయారు చేసే ఈ మసాలా సాస్‌ను మేమెప్పుడూ సమయం వెచ్చించి సొంతంగా సిద్ధం చేసుకున్నది లేదు. బఠాణీలను తోటలోంచి తెంపుకొచ్చే పని లేకుండా క్యాన్‌లలో లభించేవాటిని ఇంట్లో తెచ్చి పెట్టుకునేవాళ్లం. చెట్టుపై పండే బేరీ పండ్లను కాకుండా బేరీ పండ్ల సిరప్‌ను వాడేవాళ్లం. జీవితం ఎంత సరళం అయిపోయింది! అదంతా కూడా శతాబ్దాల ప్రయాసలను తుడిచిపెట్టేసే అద్భుతమైన ఆవిష్కరణల ఫలితమే. ఒకరోజు



2022 నోబెల్ గ్రహీత ఆనీ ఎర్నొ

వస్తుంది.. మనమిక ఏదీ చేసుకునే పని లేకుండా'' అని రాశారు ఆనీ. 1967 గురించి, గర్భ నిరోధక మాత్రల చట్టబద్ధత గురించి చెబుతూ– ''ఆ మాత్రలు జీవితాన్ని ఒక్కసారిగా మార్చేస్తాయని మేము భావించాం. భీతిగొలిపే మా దేహాల నుంచి మాకు విముక్తి లభిస్తుందనీ, మగవాళ్లకు ఉన్నంత స్వేచ్ఛ ఆ మాత్రలతో మాకూ వచ్చేస్తుందనీ అనుకున్నాం'' అని రాసుకున్నారు. తన దేశ పౌరురాలికి సాహిత్యంలో నోబెల్ వచ్చిందని తెలియగానే, ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇలా ట్వీట్ చేశారు. ''గత యాభై ఏళ్లుగా ఆనీ ఎర్నొ దేశ క్రమానుగతులతో పాటు దేశంలోని ప్రజా సమూహాల చారిత్రక జ్ఞాపకాలను అక్షరీకరిస్తున్నారు'' అని ప్రశంసించారు.

ఆనీ రచనా శైలి కత్తిలా పదునైనది. 'కత్తి పదునులా రాయడం' పేరుతో 2003లో ఆమె ఒక వ్యాసం కూడా రాశారు. ఆమె రచనలకు గానీ, శైలికి గానీ అంత పదును ఎక్కడిదంటే... ఎవరు చదువుతుంటే వాళ్లకు అది తమ కథలానే అనిపించడంతో అవి పదునెక్కుతాయి. రచయిత్రిగా ఆనీ పోరాటం, ఆమె రచనలు చదివే స్త్రీల పోరాటం వేర్వేరు కాదు. స్త్రీలు తమ శరీరాలపై అధికారాన్ని కలిగి ఉండటానికీ, పురుషులతో సమానంగా జీవించడానికీ చేసే పోరాటమే ఆనీ రచనల్లోని పోరాటం కూడా. ఒక తరం స్త్రీల ఉద్యమగానం అది. ఆమె రచనలన్నీ కూడా కల్పనలా అనిపించే స్వీయ వాస్తవానుభవాలే. ఫ్రాన్స్‌లో గర్భవిచ్ఛిత్తిపై నిషేధం ఉన్నకాలంలో 2000 సంవత్సరంలో ఆమె 'హ్యాపెనింగ్' నవల రాశారు. ఆ నవలను అదే పేరుతో ఆడ్రీ దివాన్ సినిమాగా తీశారు. గత ఏడాది విడుదలైన ఆ సినిమా 2021 వెనిస్ చలన చిత్రోత్సవంలో 'గోల్డెన్ లయన్' అవార్డు గెలుచుకుంది. సూపర్ మార్కెట్ సంస్కృతి దృక్కోణం నుంచి ఆనీ 2014 లో రాసిన నవల 'రిగార్డ్‌లెస్ ల్యూమినరీస్' సామాజిక అసమానతల్ని సునిశితంగా పరిశీలించింది. ఈ ఏడాదే విడుదలైన ఆమె కొత్త పుస్తకం 'జ్యాన్ ఓమె' తన కన్నా 30 ఏళ్ల చిన్నవాడైన వ్యక్తితో ఆమెకున్న సాన్నిహిత్యం గురించి దాపరికం లేకుండా చెబుతుంది. సాహిత్యం, సామాజిక శాస్త్రం, చరిత్ర అనే మూడు కూడళ్ల నడుమ నిలబడి సమాజం మరుపున పడిపోయిన వాళ్ల కోసం, అసమానతలపై మూగ సాక్షులుగా మిగిలిపోయిన బాధితులకోసం ఎలుగెత్తుతున్న స్వరం ఆనీ ఎర్నొ.

ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత మార్సెల్ ప్రూస్ట్ రచనా సంవిధానానికి ప్రూస్టియన్ స్టైయిల్ అని పేరు. కోల్పోయిన గతాన్ని పునరుద్ధరించే, అపస్మారక జ్ఞాపకశక్తిని ప్రేరేపించే గుణం కలిగి ఉండే ఆయన ధోరణే ఆనీ రచనల్లోనూ కనిపిస్తుంది. సమయం గడిచేకొద్దీ కనుమరుగైపోయే జ్ఞాపకాలను అంటి పెట్టుకుని ఉండేందుకు తన రచనను ఒక మార్గంగా ఆమె నిర్మించుకున్నారు. ''ఒక్క సెకనులో అంతా తుడిచి పెట్టుకు పోతుంది. ఊయలకు, మరణశయ్యకు మధ్య పేరుకుపోయిన పదాల నిఘంటువు పక్కకు ఒరిగిపోతుంది. ఇక మిగిలింది నిశ్శబ్దం. మాటలకు పదాలు ఉండవు. 'నేను', 'నాకు' అనేవి నోటిలోంచి బయటికి రావు. నలుగురు చేరి నవ్వుకునే వేళ తరాల విస్తారమైన అనామకత్వంలోకి అదృశ్యం అయ్యే వరకు మనం మన పేరు తప్ప మరేమీ కాదు... మన పేరును ఎవరైనా ఒక కాగితం మీద పెట్టేవరకు'' అని రాస్తారామె.

ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్త పియర్ బోర్ద్యూ ''కళంకానికి గురైనవారికి జ్ఞాపకశక్తి అధికం'' అంటారు. అవమానం జరిగిన జ్ఞాపకాలను అస్సలు మర్చిపోలేము. 1997లో ఆనీ రాసిన 'షేమ్' పుస్తకంలోని కథాంశం ఇదే. భారతీయ దళిత రచయితలు రాసిన కొన్ని పుస్తకాలను కూడా ఆమె చదివారు. ఓం ప్రకాశ్ వాల్మీకి రాసిన 'జూఠన్ : యాన్ అన్‌టచబుల్ లైఫ్' వాటిలో ఒకటి. ఇటీవలే ఈ పుస్తకం ఫ్రెంచిలోకి తర్జమా అయింది. అదొక ప్రామాణికమైన ఆత్మకథ. ముల్క్ రాజ్ ఆనంద్ రచనలు కూడా ఆమెకు సుపరిచితమే.

మరికొన్ని నెలల్లో ఢిల్లీలో వరల్డ్ బుక్ ఫెయిర్ జరగబోతోంది. ఆనీ ఎర్నొ నోబెల్ గెలుచుకున్న సందర్భం ఒక్కటే కాదు... ఇండియా గౌరవ అతిథిగా ఫ్రాన్స్ ఆ పుస్తక ప్రదర్శనకు వస్తుండటం, 20 కంటే ఎక్కువ మంది ఫ్రెంచి రచయితల బృందం హాజరవుతుండటం కూడా బుక్ ఫెయిర్‌కు మరింత ప్రాధాన్యం తెచ్చింది. 'పి.ఎ.పి. (పబ్లికేషన్ అసిస్టెంట్ ప్రోగ్రామ్) టాగోర్' పేరుతో ఇండియా, రొమెయిన్ రోలాండ్ అవార్డ్ (ఆపీజే ఆక్స్‌ఫర్డ్ బుక్ స్టోర్స్ భాగస్వామ్యంతో ఉత్తమ అనువాదానికి ప్రదానం చేసే అవార్డు)తో ఫ్రాన్స్ ఈ పుస్తక ప్రదర్శనలో ఇచ్చుకోబోయే పరస్పర ప్రచురణ సహకారంతో మరిన్ని ఫ్రెంచి పుస్తకాలు భారతీయ భాషల్లోకి తర్జుమా అయ్యే అవకాశం కలుగుతుందని మనం ఆశించవచ్చు. యాదృచ్ఛికమే అయినా ఇక్కడ ఒక విశేషాన్ని గమనించాలి. టాగోర్ (1913), రొమెయిన్ రోలాండ్ (1915) ఇద్దరూ సాహిత్యంలో నోబెల్ గ్రహీతలే.

వ్యాసకర్త ఇండియాకు ఫ్రాన్స్ రాయబారి
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం జరగనుంది?



ఆసియా కప్ పాకిస్తాన్‌లో జరగకపోతే (ఇండియాతోగానీ, లేకుండాగానీ), పాకిస్తాన్ ఆసియా కప్‌లోనూ ఆడదు; ఏసీసీ (ఏసియన్ క్రికెట్ కౌన్సిల్)లోనూ ఉండదని విశ్వసనీయ వర్గాలు నిర్ధారించాయి.
– ఆలియా రషీద్, పాక్ క్రికెట్ వ్యాఖ్యాత

ముందివి నేర్చుకోవాలి



ఉత్తరప్రదేశ్‌లోని జనాలు తమిళం, తెలుగు నేర్చుకోవడం మొదలుపెట్టాలి. భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలను అది మెరుగుపరచగలదు.
– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

అదే కావాలని ఆశ



'మెటా' (ఫేస్‌బుక్) మీద చేసిన అల్లకల్లోలపు కథనా లను ఇన్ని రోజులుగా రెట్టించి సమర్థించుకున్న 'ద వైర్' వాటిని తొలగించింది. ఇక్కడ కేవలం రెండు సాధ్యా సాధ్యాలున్నాయి: ఎ. మెటా, బీజేపీలను అపఖ్యాతిపాలు చేయడానికి ఉద్దేశపూర్వకంగా వైర్ ఈ తప్పుడు కథనాలను రాసివుండాలి. బి. 'సోర్సులు' వారిని మోసగించివుండాలి. నేను 'బి' అనుకుంటున్నాను.
– మేఘనాత్, క్రియేటివ్ డైరెక్టర్

ఇప్పుడు తెలిసిందా?



మన వారసత్వమైన భారత సముద్రయాన చరిత్రను మనం మరిచిపోయామని ప్రధాని మోదీ చెబుతున్నారు. మేము చోళుల గురించి బడిలో ఉన్నప్పుడే చదువుకున్నాం. బీజేపీ మాత్రం పొన్నియన్ సెల్వన్ సినిమా వచ్చిన తర్వాత వారిని కనుక్కుంది.
– సంగీత నంబి, రచయిత్రి

మనం నేర్చుకోలేమా?



వెనక్కి జారుతున్న ప్రజాస్వామ్యాల గురించి తెలుసు కోవడానికి నేను పోలండ్‌లో ఉన్నాను. పోలండ్‌లో కరడుగట్టిన మితవాద అధికార పార్టీ కోర్టుల మీద నియంత్రణతో స్వతంత్ర న్యాయ వ్యవస్థకు చెల్లుచీటి రాసింది. ప్రజాస్వామ్య శత్రువులు ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటున్నారు. ప్రజాస్వామ్య మిత్రులు కూడా ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవచ్చు.
– జాసన్ స్టాన్లీ, ఫిలాసఫీ ప్రొఫెసర్

చారిత్రక ఎన్నిక



కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎన్నిక చాలావిధాలుగా చారిత్రకం: యాభై ఏళ్లలో పార్టీకి మొదటి దళిత అధ్యక్షుడు. చివరి వ్యక్తి 1970–71లో జగ్జీవన్ రామ్. 1969లో ఎస్.నిజలింగప్ప తర్వాత కర్ణాటక నుంచి మొదటివాడు. 1998 నుంచి గాంధీ కుటుంబానికి చెందని మొదటి వ్యక్తి.
– ఆదిత్య మేనన్, జర్నలిస్ట్

ఓడినప్పటికీ...



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావడమనేది గౌరవంతో పాటు పెద్ద బాధ్యతతో కూడుకున్నది. మల్లికార్జున్ ఖర్గే ఆ పనిలో విజయవంతం కాగలరని కోరుకుంటున్నా. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేయోభిలాషుల ఆశలు, ఆకాంక్షలను మోస్తూ వెయ్యికి పైగా సహచరుల మద్దతును నేను పొందడం గౌరవంగా భావిస్తున్నా.
– శశి థరూర్, కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి

ఇన్‌బాక్స్

కోర్టుల సంఖ్య పెంచాలి

దేశవ్యాప్తంగా జైళ్లలోని ఖైదీలు, పోలీసు కస్టడీలోని నిందితులు 2016 నుండి 2022 మధ్య 11,656 మంది మరణించినట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. పోలీసు కస్టడీలో 7 శాతం, జైళ్లలో 93 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 672 న్యాయస్థానాల్లో 4.70 కోట్ల కేసులు విచారణ దశలో పెండింగులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో న్యాయమూర్తుల సంఖ్యను దేశ జనాభాతో పోల్చిచూసినప్పుడు ప్రతి 50 వేలమంది పౌరులకు కేవలం ఒక్క న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు. చైనాలో ప్రతీ 3,500 మంది పౌరులకు ఒక న్యాయమూర్తి, అమెరికాలో ప్రతీ 7,000 మంది పౌరులకు ఒక జడ్జి చొప్పున అందుబాటులో ఉన్నారు. అందుకే ఆయా దేశాల్లో పౌరులకు సత్వర న్యాయం లభిస్తుంది. దేశంలో సుమారు 4 లక్షల 88 వేలకు పైగా విచారణ ఖైదీలు జైలు జీవితం గడుపుతున్నారు. న్యాయస్థానాలు వీరిలో కొందరిని నిర్దోషులుగా తేల్చినప్పుడు, వీరు కోల్పోయిన స్వేచ్ఛాజీవితానికి ఎవరు బాధ్యులు? ప్రభుత్వాలు తగిన సంఖ్యలో కోర్టులను ఏర్పాటు చేసి పెండింగ్ కేసులను పరిష్కరించాలి. దేశంలో పోలీసు కేసుల నమోదు ప్రక్రియ నుండి కోర్టుల్లో విచారణ వరకు ప్రాథమిక అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చి ప్రజలకు అవగాహన కల్పించాలి.

– కోడెపాక కుమార స్వామి, హైదరాబాద్

ద్రావిడ సంస్కృతిపై శోధన సాగాలంటే...

ఈ దేశ మూలవాసులైన ద్రావిడులు మొదట్లో ఉత్తర భారతంలో నివసించేవారు. ఆర్యుల రాక తర్వాత వారు దక్షిణ ప్రాంతానికి వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకుని ఒక విలక్షణమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోది చేశారు. దక్షిణ భారతీయ సమాజం వేల సంవత్సరాలుగా అనేక జాతులతో కలిసి జీవన గమనాన్ని సాగించినప్పటికీ వారి సాంస్కృతిక విలక్షణత మాత్రం పుస్తె కట్టడం నుండి పాడె కట్టడం వరకు కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే ఉంటుంది.

దక్షిణ భారతదేశంలో ద్రవిడ జాతులు అత్యంత ప్రాచీనమైన సాంస్కృతిక నేపథ్యం కలిగి ఉన్నప్పటికీ ఈ భాషల్లో సాహిత్యం మాత్రం పదో శతాబ్దానికి అటూ ఇటుగా మాత్రమే లభిస్తోంది. తమిళులు మాత్రమే తమ సంగ సాహిత్యం అత్యంత ప్రాచీనమైనదనీ, ఈ సాహిత్యం క్రీ.పూ. 500 నుండి కనిపిస్తున్నదనీ ప్రకటించుకున్నారు. దాదాపుగా క్రీస్తుశకం ఒకటో శతాబ్దం వాడైన శాతవాహన చక్రవర్తి హాలుడు సేకరించి గుదిగుచ్చిన 'గాథా సప్తశతి' అనే ప్రాకృత గ్రంథంలో పిల్ల, పొట్ట, కరణి వంటి తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. దీన్ని బట్టి ఆనాటికే తెలుగు భాష సమాజంలో బాగా స్థిరపడిన వ్యవహారిక భాషగా ఉందని చెప్పవచ్చు. అంతేగాకుండా, సాహిత్య భాషలుగా పేరుపడిన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రంథ రూపంలో లభిస్తున్న సాహిత్యం కంటే ముందే మౌఖిక రూపంలో నిక్షిప్తమైన జానపద సాహిత్యం పుంఖానుపుంఖాలుగా తప్పకుండా ఉండి ఉంటుంది. ఉదాహరణకు ఇప్పటివరకు ఉన్న ఆధారాలను అనుసరించి తెలుగులో నన్నయ భారతాన్ని ఆది గ్రంథంగా భావిస్తున్నాం. అయితే, నన్నయ తల్లి పాడిన జోల పాట కూడా మౌఖిక వాఙ్మయంలో ఆనాటికే నెలకొని ఉంది అన్న సత్యాన్ని ఇక్కడ మనం మరచిపోకూడదు.

కాబట్టి, నన్నయకు పూర్వమే తెలుగువారికి విస్తృతమైన మౌఖిక సాహిత్యం కూడా తప్పకుండా ఉంది. ఇటువంటి సాహిత్యం మాత్రమే ఒక జాతికి సంబంధించిన సహజమైన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. అందుచేత, పరిశోధకులు ప్రధానంగా మూల వాసులు మౌఖికంగా నిక్షిప్తం చేసిన జానపద సాహిత్యంపై విరివిగా పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది.

నేటి భాషా శాస్త్ర పరిశోధకుల అంచనాలకు అందినంతవరకు ద్రావిడ భాషలు 27 కనిపిస్తున్నాయి. ఈ విషయంలో కూడా మరింత పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అంతే కాకుండా, ఈ ఆదిమ జాతులు అందించిన సంస్కృతిపై తగినంత పరిశోధన జరగలేదు అన్నది నిర్వివాదాంశం. ఈ లోటును భర్తీ చేయడం కోసమే ప్రొఫెసర్ వీఐ సుబ్రహ్మణ్యం, ఐఏఎస్ అధికారి కాశీ పాండ్యన్ వంటి మేధావులు కొందరు ద్రవిడ సంస్కృతిపై పరిశోధన కోసం ఒక కేంద్రాన్ని మంజూరు చేయాలని నాటి సీఎం నందమూరి తారక రామారావుని కోరారు. అయితే ద్రవిడ సంస్కృతిపై అత్యంత ఆదరాభిమానాలు కలిగిన రామారావు ఏకంగా ఒక విశ్వవిద్యాలయాన్నే మంజూరు చేశారు. అది 1997 అక్టోబర్ 20న కుప్పంలో ప్రారంభమైంది.



ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యాలలో కొన్ని... ద్రవిడ సంస్కృతిలోని ప్రాచీనత, విలక్షణతను, విశిష్టతను లోక విదితం చేయడం; ద్రవిడ సంస్కృతిపై వివిధ భాషల్లో నేటి వరకు జరిగిన పరిశోధనలు, ప్రచురణలను పదిల పరచడం, ప్రచారం చేయడం; తద్వారా, భావ వినిమయానికి, సంస్కృతీ పరిరక్షణకు బాటలు వేయడం. ద్రావిడ కుటుంబానికి చెందిన గిరిజన భాషలతో సహా లిఖిత భాషలు, మాట్లాడే ద్రావిడ భాషల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం; ద్రావిడ భాషలు, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన కళలు, హస్తకళలు, అనుబంధ విషయాలలో ఉన్నత స్థాయిలో బోధనను, శిక్షణను అందించడం. భారత దేశం లోపల, వెలుపల ద్రావిడ భాషలు, సాహిత్యం, సంస్కృతి, ఆధునిక శాస్త్రాలు, వైద్యం, ఇంజనీరింగ్, సాంకేతికత వాటి అనుబంధ విషయాలపై అధ్యయనం చేయాలనుకునే వారికి శిక్షణ ఇవ్వడం. విశ్వవిద్యాలయ లక్ష్యాలకు అనుగుణంగా, అవసరాలకు అనుగుణంగా ఇతర భాషల సాహిత్యాన్ని ద్రావిడ భాషలలోకి అనువదించడం అలాగే ద్రావిడ భాషల సాహిత్యాన్ని ఇతర భాషలలోకి అనువదించడం.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇప్పటికే మూలికా వనం ఏర్పాటయింది. ఈ వనంలో ద్రవిడ సాహిత్యంలోనూ, వైద్యంలోనూ కనిపించే చాలా అరుదైన, వివిధ జాతులకు చెందిన 250 వన మూలికలు సేకరించి, పెంచుతున్నారు. జానపద గిరిజన విజ్ఞానాలపై ప్రత్యేకమైన మ్యూజియం ఏర్పాటు చేశారు. అరుదైన తాళ పత్రాలను సేకరించి భద్రపరిచారు. ఒక ద్రావిడ భాషలో ప్రచురితమైన విలువైన పుస్తకాలను, పదకోశాలను ఇతర ద్రావిడ భాషల్లోకి అనువదించి ముద్రించారు.

ద్రావిడ సంస్కృతిని మరింత మూలాల్లోకి వెళ్లి పరిశోధించడానికి తగిన విధంగా ఏపీ ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని 'తెలుగు ప్రాచీన హోదా కేంద్రా'న్ని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడానికి గట్టి కృషి చేయాలి. అలాగే, తెలుగు అకాడమీని (ప్రస్తుతం తెలుగు సంస్కృత అకాడమీని) కూడా ద్రావిడ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేయడం ద్వారా తెలుగు భాషా సాహిత్యాలపై జరిగిన, జరుగుతున్న విశేష కృషిని సమన్వయం చేసుకోవడానికి వీలు కలుగుతుంది. సంస్కృత సాహిత్యంలో ప్రవేశించిన ద్రావిడ సాంస్కృతిక మూలాలను కూడా మరింత లోతుగా అన్వేషించే అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి అంశాలపై చొరవను చూపినట్లయితే ప్రభుత్వం ద్రావిడ సంస్కృతి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నట్లవుతుంది.

– డా॥ వేలం పళని
సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం
(నేడు ద్రావిడ విశ్వవిద్యాలయం రజతోత్సవాల సందర్భంగా)

అన్వయం ముఖ్యం

ఒకడు వేదాంత తరగతులకు రోజూ హాజరయ్యే వాడు. ఇదంతా మాయ, నువ్వు నేను వేరు కాదు, అంతా ఒకటే అనే మాటలు విని, తాను వేదాంత జ్ఞానం పొందానని తనను తాను పెద్ద వేదాంతిగా భావించుకోసాగాడు.

ఒకసారి భోజనశాలకు వెళ్లి అక్కడ నచ్చిన పదార్థాలు తిన్నాడు. 'నేనూ, నాకు వడ్డించేవాడూ, వండే వాడూ, హోటల్ వ్యాపారీ వేరు వేరు కాదు. అంతా ఒకటే కాబట్టి డబ్బులు ఇవ్వక్కరలేదు' అనుకుంటూ వెళ్లిపోతుంటే భోజనశాల వాళ్ళు పట్టుకున్నారు. అతడు చెప్పింది విని ఇరవై కొరడా దెబ్బల శిక్ష వేశాడు భోజనశాల యజమాని. అంతేకాక 'అయ్యా! మీరన్నది నిజమే. దెబ్బలు కొడుతున్న వాడూ, దెబ్బలు తింటున్న మీరూ వేరు వేరు కాదు. మీరిద్దరూ ఒకటే. మిమ్మల్ని మీరే కొట్టుకుంటున్నారు' అన్నాడు. శిక్ష అనుభవిస్తున్న ఆ వ్యక్తి... దెబ్బలు ఆపమని వేడుకొని వేదాంతాన్ని పక్కన పెట్టి డబ్బులు చెల్లించి ఏడుస్తూ వెళ్లిపోయాడు.

విజ్ఞాన రహస్యాలను, ధర్మ సూక్ష్మాలను సరిగా అర్థం చేసుకుని జీవితానికి అన్వయించుకోకపోతే ఫలితం ఇలాగే ఉంటుంది.

– శివలెంక ప్రసాదరావు

తుపాను ముప్పు బెంగాల్‌కే..!

ఏపీపై ప్రభావం ఉండదని తాజా అంచనాలు
ఈశాన్య రుతు పవనాల రాక ఆలస్యం



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడే తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండే అవకాశాలు దాదాపు లేనట్టేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు కదిలే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్ర పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి 22వ తేదీ నాటికి వాయుగుండంగా.. ఆ తర్వాత 48 గంటల్లో తుపానుగా బలపడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తొలుత ఇది ఏపీ, ఒడిశా మధ్య తీరం దాటవచ్చని భావించారు. కానీ ఏపీ–ఒడిశా తీరం వైపు వచ్చినా.. మధ్యలో దిశ మార్చుకుని ఉత్తర ఒడిశా–పశ్చిమబెంగాల్ వైపు కదులుతుందని తాజాగా అంచనా వేస్తున్నారు. ఏపీలో 15 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇక్కడి సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. అదే సమయంలో పశ్చిమబెంగాల్ తీరంలో సముద్ర ఉష్ణోగ్రతలు ఇక్కడికంటే ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల తుపాను పశ్చిమబెంగాల్‌వైపు కదిలేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని, వాతావరణంలో అనూహ్య మార్పులు జరిగితే తప్ప ఏపీకి తుపాను ప్రభావం ఉండదని వాతావరణ శాఖ చెబుతోంది. అయితే, దీని ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే వీలుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో 7.4 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలం దళపతిగూడలో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రకాశం, ఏలూరు, అల్లూరి, కర్నూలు జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. వచ్చే రెండు రోజులు ఇలాగే మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

నెలాఖరుకు ఈశాన్య రుతు పవనాలు

ఈశాన్య రుతుపవనాలు ఈ ఏడాది ఆలస్యంగా ప్రవేశించనున్నాయి. సాధారణంగా ఈశాన్య రుతు పవనాలు అక్టోబర్ 15కల్లా ప్రవేశిస్తాయి. అయితే నైరుతి రుతు పవనాల ఉపసంహరణలో జాప్యం.. త్వరలో బంగాళాఖాతంలో తుపాను, అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడుతుండటం వంటి పరిస్థితులు ఈశాన్య రుతు పవనాల రాక ఆలస్యం కావడానికి కారణమవుతున్నాయి. దీని వల్ల ఈశాన్య రుతుపవనాలు ఈ నెల 28–31 తేదీల మధ్య ప్రవేశించే వీలుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మోపిదేవి సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో బ్రహ్మానంద సరస్వతి


ఆలయంలో ప్రవచిస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి

మోపిదేవి: కృష్ణా జిల్లా మోపిదేవిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని నైమిశారణ్య పీఠాధిపతి (ఇచ్ఛాపురం) బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మానంద సరస్వతి ఆలయ ప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయాధికారి అర్జునరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు. బాల బ్రహ్మానంద సరస్వతి మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్ కోరికపై 108 ఆలయాల్లో ప్రవచనాలు ఇవ్వడం ప్రారంభించినట్లు తెలిపారు. 91వ దేవాలయం మోపిదేవిలో భక్తులకు ప్రవచనం అందించినట్లు చెప్పారు.

‘ఏకలవ్య’ జాతీయ క్రీడా పోటీలకు వేదికలు!

డిసెంబర్ 17 నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ

- 15 వ్యక్తిగత, 7 టీమ్ విభాగాల్లో పోటీలు
- అత్యధికంగా ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి క్రీడాకారుల హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ 3వ జాతీయ క్రీడాపోటీలకు వేదికలు ఖరారయ్యాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కలిపి ఐదు చోట్ల పోటీలను నిర్వహించనున్నారు. డిసెంబర్ 17 నుంచి 23వ తేదీ వరకు 15 వ్యక్తిగత విభాగాల్లో 2,763 మంది, ఏడు టీమ్ విభాగాల్లో 2,207 మంది దేశవ్యాప్తంగా క్రీడాకారులు పోటీపడనున్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గిరిజన పాఠశాలల క్రీడా పోటీల్లో 20 రాష్ట్రాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అత్యధికంగా ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి 480 చొప్పున, అత్యల్పంగా అరుణాచల్ ప్రదేశ్ 61, సిక్కిం 83, ఉత్తర ప్రదేశ్ 96 మంది క్రీడాకారులతో బరిలోకి దిగనున్నాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎన్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ‘సాక్షి’తో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా ఏకలవ్య జాతీయ పోటీలను సమర్థవంతంగా చేపడతామన్నారు. పోటీలు ప్రారంభానికి ముందే ఏపీ క్రీడాకారులకు నిపుణులైన శిక్షకులతో తర్ఫీదు ఇవ్వనున్నట్టు వివరించారు. కచ్చితంగా పతకాలు వచ్చే విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

టీమ్ ఈవెంట్స్

బాస్కెట్ బాల్	లయోల కాలేజీ గ్రౌండ్–1, విజయవాడ
ఫుట్‌బాల్	లయోల కాలేజీ గ్యాలరీ గ్రౌండ్
హ్యాండ్ బాల్	మల్టీపుల్ గ్రౌండ్–1, ఏఎన్‌యూ
హాకీ	లయోల మల్టీపుల్ హాకీ గ్రౌండ్
కబడ్డీ	మల్టీపుల్ కాంప్లెక్స్–2, ఏఎన్‌యూ
ఖోఖో	మల్టీపుల్ కాంప్లెక్స్–1, ఏఎన్‌యూ
వాలీబాల్	ఆపోజిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్, ఏఎన్‌యూ

వ్యక్తిగత క్రీడాంశాలు



క్రీడ	పోటీ ప్రదేశం
ఆర్చరీ	ఏఎన్‌యూ, ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్
అథ్లెటిక్స్	ఏఎన్‌యూ మెయిన్ గ్రౌండ్
బ్యాడ్మింటన్	దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియం, విజయవాడ
బాక్సింగ్	జిమ్‌హాల్–1, ఆంధ్ర లయోల కాలేజీ, విజయవాడ
చెస్	ఏఎన్‌యూ, ఇంజనీరింగ్ కాలేజీ బిల్డింగ్స్
జిమ్నాస్టిక్స్	బీఆర్ స్టేడియం, గుంటూరు
జూడో	ఆడిటోరియం హాల్–2, లయోల కాలేజీ, విజయవాడ
షూటింగ్, తైక్వాండో	న్యూ స్పోర్ట్స్ హాస్టల్ గ్రౌండ్స్, ఏఎన్‌యూ
స్విమ్మింగ్	వీఎంసీ జింఖానా స్విమ్మింగ్ పూల్, గాంధీ నగర్, విజయవాడ
టేబుల్ టెన్నిస్	స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఏఎన్‌యూ
వెయిట్ లిఫ్టింగ్	ఇండోర్ వెయిట్ లిఫ్టింగ్ హాల్, ఏఎన్‌యూ
రెజ్లింగ్	లయోల ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్, విజయవాడ
యోగా	యోగా సెంటర్, ఏఎన్‌యూ

శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి


కాణిపాకంలో నిర్మలాసీతారామన్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప తదితరులు

తిరుమల/కాణిపాకం (యాదమరి)/రేణిగుంట: తిరుమల శ్రీవారిని బుధవారం రాత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దర్శించుకున్నారు. తిరుమల చేరుకున్న ఆమెకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి పద్మావతి అతిథి గృహం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు దర్శన ఏర్పాట్లు చేశారు. అంతకుముందు ఆమె కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయం వద్ద రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో రాణాప్రతాప్ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనాన్ని, ఆలయాధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. అంతకుముందు కేంద్ర మంత్రికి రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రి బుగ్గన తదితరులు స్వాగతం పలికారు. కాగా, కేంద్ర మంత్రి ఈ నెల 21వ తేదీ వరకు తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారు.

కాణిపాకం మరో తిరుమలలా ఉంది..

దర్శనం అనంతరం నిర్మలాసీతారామన్ మీడియాతో మాట్లాడుతూ..కాణిపాకం మరో తిరుమలలా ఉందని, ఆలయంలోకి వస్తుంటే మనసులో ఏదో భక్తి భావన కలుగుతోందని అన్నారు. ప్రజలందరూ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చల్లగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. ఆలయాన్ని బాగా అభివృద్ధి చేశారని ఆమె పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబును అభినందించారు. ఆలయంలో శిల్పకళ ఉట్టిపడుతోందన్నారు.

24, 25, నవంబర్ 8న బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఈ నెల 24న దీపావళి ఆస్థానం నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజున బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా 23న సిఫార్సు లేఖలను టీటీడీ స్వీకరించదు. అలాగే, 25న సూర్యగ్రహణం నాడు ఉదయం 8 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ కారణంగా ఆ రోజున బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. దీంతో 24న సిఫార్సు లేఖలు స్వీకరించరు. నవంబర్ 8న చంద్రగ్రహణం నాడు ఉదయం 8.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ కారణంగా ఆ రోజున కూడా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో నవంబర్ 7న సిఫార్సు లేఖలను స్వీకరించరు. కాగా, 25, నవంబర్ 8న శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా టీటీడీ రద్దు చేసింది. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వదర్శనానికి 8 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,420 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.28 కోట్లు వేశారు.

లైంగికదాడి నిందితుడికి పదేళ్ల జైలు

చిలకలపూడి(మచిలీపట్నం): లైంగికదాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా బుధవారం తీర్పు చెప్పారు. గుడివాడ మండలం బిళ్లపాడు గ్రామానికి చెందిన పెనుమాల నాగార్జున అదే గ్రామానికి చెందిన వలంటీర్(20)ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2020 ఏప్రిల్ 4వ తేదీన లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితురాలు గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాలు జైలుశిక్ష, రూ. 3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సుకు బుధవారం పెనుప్రమాదం తప్పింది. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తెలంగాణ జిల్లా భద్రాచలం నుంచి కాకినాడకు ప్రయాణికులతో వస్తోంది. వాలమూరు గ్రామం సమీపంలోని వాలిసుగ్రీవ్ కొండ మలుపు దిగుతుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. గమనించిన డ్రైవర్ డి.సుబ్బారావు బస్సులోని ప్రయాణికులను అప్రమత్తం చేసి, రోడ్డు పక్కనే ఉన్న కొండను ఢీ కొట్టాడు. దీంతో బస్సు అక్కడే నిలిచిపోయింది. క్యాబిన్ దెబ్బతిని నొక్కోయడంతో డ్రైవర్ సీటులో ఇరుక్కుపోయాడు. కాళ్ల వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

కులవాదుల వీధినాటకాలకు తెరదించాలి

752వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రైతుల పేరుతో కులవాదులు పాదయాత్రలు చేస్తూ.. వేస్తున్న వీధి నాటకాలకు తెరదించకపోతే ప్రజలు తరిమికొట్టడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 752వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రైతుల పేరుతో ఊరేగుతున్న కులవాదులు రాజధానిని ఎంపిక చేసే సమయంలో 5 కోట్ల మంది ప్రజలను అడిగి రాజధానిని ఎంపిక చేశారేమో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతిలో చిన్నపాటి వర్షాలకే వరదలు వచ్చి వాహనాలు కూడా నడిచే పరిస్థితి లేక వీఐపీలు నానా అవస్థలు పడుతున్నారంటే ఈ ప్రాంతానికి ముంపు ముప్పు ఉందో లేదో గుండెలపై చేయి వేసుకుని చెప్పాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక అన్ని పార్టీల నాయకులకు ప్యాకేజీలిచ్చి మరీ చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లేందుకు యత్నించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులంతా ఏకమైతే పరిస్థితి ఏంటో ఊహించుకుని అడుగేస్తే మంచిదన్నారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాషలపై పరిశోధనల కోసమే ద్రవిడ వర్సిటీ

- వర్సిటీ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: దేశంలోనే భాషా పరిశోధనల కోసం ఏర్పాటు చేసిన ఏకైక యూనివర్సిటీ ద్రవిడ వర్సిటీ మాత్రమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ద్రవిడ వర్సిటీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాండిచ్చేరితో కలిపి ఐదు రాష్ట్రాల భాషలపై పరిశోధనా కేంద్రంగా ఏర్పాటు చేసిన ద్రవిడ వర్సిటీ మన రాష్ట్రంలో ఉండడం గర్వకారణమన్నారు. మొదట్లో మాజీ ముఖ్యమంత్రి రామారావు యూనివర్సిటీ ప్రారంభించారని, అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్సిటీ అభివృద్ధికి 6 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. యూనివర్సిటీ స్థితిగతులను సీఎం దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, వర్సిటీ వైస్ చాన్సలర్ తుమ్మల రామకృష్ణ, రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భారతీయ జనతాపార్టీలో లుకలుకలు

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు టార్గెట్‌గా మాజీ అధ్యక్షుడు కన్నా విమర్శలు
- జనసేనతో సమన్వయంలో పార్టీ విఫలమైందని విమర్శ
- 2024 ఎన్నికల వరకు సోమునే రాష్ట్ర అధ్యక్షుడిగా నిర్ణయం
- అందుకే కన్నా విమర్శలు చేస్తున్నారంటున్న వీర్రాజు వర్గం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శలు చేయడం ఆ పార్టీలో కలకలం రేపింది. మంగళవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు కలయిక నేపథ్యంలో రెండు రోజులుగా సోము వీర్రాజునుద్దేశించి కన్నా లక్ష్మీనారాయణ విమర్శలు చేశారు. ‘పొత్తులో ఉన్న జనసేనతో సమన్వయంలో మా రాష్ట్ర నాయకత్వం విఫలమైంది. గతంలో ఇలాంటి పార్టీ విషయాలపై రెండు నెలలకోసారి అందరమూ కూర్చొని మాట్లాడే వాళ్లం. ఇప్పుడు సోము వీర్రాజు ఒక్కరే ఇవన్నీ చూస్తున్నారు. ఎవరితోనూ చర్చించడంలేదు. చివరకు కోర్ కమిటీలో కూడా చర్చకు రావడంలేదు. అసలు పార్టీలో ఏం జరుగుతోందో మాకు తెలియడంలేదు’ అని వ్యాఖ్యానించారు. పవన్‌తో సమన్వయ లోపాన్ని పార్టీ అధిష్టానం గుర్తించిందని, ఆ బాధ్యతను జాతీయ నాయకుడు మురళీధరన్‌కు అప్పగించినట్లు తెలిసిందని చెప్పారు. అయితే, 2024 ఎన్నికల వరకు సోము వీర్రాజే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారని అధిష్టానం స్పష్టం చేసిందని.. అందువల్లే అసంతృప్తితో కన్నా లక్ష్మీనారాయణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని సోము వీర్రాజు మద్దతుదారులు అంటున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవధర్ కూడా రాష్ట్రంలో సోము వీర్రాజు నాయకత్వంలోనే పార్టీ వచ్చే ఎన్నికలకు వెళ్లబోతున్నట్టు ఇటీవల ప్రకటించారు. మరోవైపు.. పార్టీ మారుతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని కన్నా కొట్టిపారేస్తున్నారు. తాను బీజేపీలో చేరిన నాటి నుంచి ఇలాంటి ప్రచారమే జరుగుతోందని అన్నారు. బుధవారం తాను ఎలాంటి కార్యకర్తల సమావేశం నిర్వహించలేదని కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు.

ఢిల్లీకి వెళ్లిన సోము వీర్రాజు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలతో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై మాట్లాడారని పార్టీ వర్గాలు తెలిపాయి. బుధవారం సాయంత్రం వీర్రాజు ఢిల్లీ నుంచి రాగానే గన్నవరం ఎయిర్‌పోర్టులో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని పార్టీలో ప్రచారం జరిగింది. అయితే, ఆయన విజయవాడకు రాలేదు. నేరుగా బెంగళూరుకు వెళ్లారని పార్టీ నాయకులు తెలిపారు.

నిర్భయ తరహాలో హింసించి గాజియాబాద్‌లో గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ/గాజియాబాద్: ఆస్తి తగాదాల కారణంగా ఢిల్లీకి చెందిన ఓ 36 ఏళ్ల మహిళపై యూపీలోని గాజియాబాద్‌లో ఐదుగురు వ్యక్తులు దారుణ రీతిలో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతేగాక నిర్భయ అత్యాచారాన్ని తలపించేలా ఆమె జననాంగంలో ఐరన్ రాడ్ చొప్పించి క్రూరంగా హింసించినట్టు తెలుస్తోంది. అనంతరం కాళ్లూ చేతులూ కట్టేసి ఓ బస్తాలో కుక్కి రోడ్డు పక్కన పడేసిపోయారు. బాధితురాలు ఢిల్లీ ఆస్పత్రిలో కోలుకుంటోంది. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు డాక్టర్లు చెప్పారు. నిందితుల్లో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇది మాటల్లో చెప్పలేని ఘోరమని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతీ మలివాల్ ఆవేదన వెలిబుచ్చారు. బాధితురాలిని రెండు రోజులపాటు చిత్రహింసలు పెట్టినట్టు చెప్పారు. దీనిపై నివేదిక సమర్పించాల్సిందిగా గాజియాబాద్ ఎస్పీని ఆదేశించారు.

ఒంటివాసనే దోమకాటుకు మూలం




న్యూయార్క్: దోమలు. మనందరికీ ఉమ్మడి శత్రువులు. మలేరియా, జైకా, డెంగీ ప్రాణాంతక జ్వరాలకు కారణం. ఇవి కొందరినే ఎక్కువగా కుట్టడానికి కారణం ఏమిటి? ఫలానా రక్తం గ్రూప్ ఉన్నవారిని, రక్తంలో చక్కెర స్థాయిలు బాగా ఉన్నవారిని, వెల్లుల్లి, అరటిపండ్లు ఎక్కువగా తినేవారిని, మహిళలను దోమలు అధికంగా కుడుతుంటాయని అనుకుంటుంటారు. కానీ, ఇవేవీ నిజం కాదని అమెరికాలోని రాక్‌ఫెల్లర్ వర్సిటీ పరిశోధకులు తేల్చిచెప్పారు. శరీరం నుంచి వెలువడే ఓ రకం వాసనే దోమలను అయస్కాంతంలా ఆకర్షిస్తుందని, అలాంటి వారినే అవి ఎక్కువగా కుడుతుంటాయని తేల్చారు. ఈ వాసనకు కారణం శరీరంలోని కొవ్వు అమ్లాలు (ఫ్యాటీ యాసిడ్స్). ఇవి దోమలను ఆకర్షించే వాసనను ఈ ఉత్పత్తి చేస్తాయట! అధ్యయనం వివరాలను 'జర్నల్ సెల్'లో ప్రచురించారు.

మస్కిటో మ్యాగ్నెట్ మారదు

చర్మంలో కార్బోక్సిలిక్ యాసిడ్స్ స్థాయిలు అధికంగా ఉన్నవారి పట్ల దోమలు విపరీతంగా ఆకర్షణకు గురవుతాయని అమెరికాలోని 'రాక్‌ఫెల్లర్స్ ల్యాబొరేటరీ ఆఫ్ న్యూరోలింగ్విస్ట్ అండ్ బిహేవియర్ ప్రతినిధి లెస్లీ వూషెల్ చెప్పారు. చర్మంలో భారీగా ఫ్యాటీ యాసిడ్స్ ఉంటే దోమల ముప్పు అధికమేనని వివరించారు. జైకా, డెంగ్యూ, ఎల్లో ఫీవర్, చికున్ గున్యా వంటి జ్వరాలకు కారణమయ్యే 'ఏడిస్ ఈజిప్టి' దోమలపై మూడేళ్ల అధ్యయనం చేశారు. చర్మంలో ఫ్యాటీ యాసిడ్స్ స్థాయిలు బాగా ఉన్నవారే ఎక్కువగా దోమకాటుకు గురవుతున్నట్లు గుర్తించారు. ఆ అమ్లాల నుంచి ఉత్పత్తయ్యే గ్రీజులాంటి కార్బోక్సిలిక్ యాసిడ్స్ చర్మంపై కలిసి పొరలాగా పేరుకుంటాయి. వాటి నుంచి వచ్చే ఒక రకమైన వాసన దోమలను ఆకట్టుకుంటుందట!.

కరోనాతో ముందస్తు రజస్వల



న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి ముందస్తు రజస్వల అవడానికి కూడా దారి తీస్తోందన్న దిగ్భ్రాంతికరమైన విషయం తాజాగా బయట పడింది. కరోనా తర్వాత ప్రపంచవ్యాప్తంగా బాలికల్లో ఈ కేసులు పెరుగుతున్నట్లు సర్వేల్లో తేలింది. సాధారణంగా బాలికలు 13 నుంచి 16 ఏళ్ల వయసులో రజస్వల అవుతుంటారు. కానీ, 8 ఏళ్ల బాలికలు సైతం ఉదంతాలు బయటపడ్డాయి. ''ఒకమ్మాయి నా దగ్గరికొచ్చింది. ఆమె వయసు ఎనిమిదేళ్ల తొమ్మిది నెలలు. అప్పుడే పీరియడ్స్ మొదలయ్యాయి'' అని ఢిల్లీలోని ప్రముఖ పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ మన్‌ప్రీత్ సేథీ చెప్పారు. కరోనాకు ముందు ఎర్లీ ప్యూబర్టీ కేసులు నెలకు 10 వరకూ వచ్చేవని, ఇప్పుడు 30 దాటుతున్నాయని వెల్లడించారు. ఇటలీ, టర్కీ, అమెరికాల్లోనూ ఈ కేసులు వెలుగు చూస్తున్నాయి.

కారణమేమిటి?: ముందస్తు రజస్వలకు ప్రధాన కారణం కోవిడ్-19 వ్యాప్తిని నియంత్రించడానికి ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్. విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆ సమయంలో జనమంతా ఇళ్లకే పరిమితయ్యారు. విద్యార్థులకు ఆటపాటలు కూడా లేవు. నెలల తరబడి ఇళ్లల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఫలితంగా వారిలో జీవక్రియలు(మెటబాలిజం) ప్రభావితమయ్యాయి. మన మెదడు మన శరీరం ఎత్తును పరిగణనలోకి తీసుకోదు. బరువును మాత్రం పరిగణనలోకి తీసుకుంటుంది. శరీరంలో ఉత్పత్తి అయ్యే అన్ని హార్మోన్ల స్థాయిలను పిట్యూటరీ గ్రంథి పర్యవేక్షిస్తూ ఉంటుంది. శరీరం ఒక స్థాయి బరువుకు చేరుకోగానే ఈ గ్రంథి ప్యూబర్టీని ప్రేరేపిస్తుంది. ఫలితంగా బాలికల్లో పీరియడ్స్ ప్రారంభమవుతాయి. ఇందులో హార్మోన్ల స్థాయి కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అంటే బరువును నియంత్రణలో ఉంచుకుంటే ముందుస్తు రజస్వలను అరికట్టవచ్చని దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

క్లుప్తంగా...

పెరోల్లోనూ పిచ్చి చేష్టలే

బిల్కిస్ బానో దోషి నిర్వాకం

అహ్మదాబాద్: బిల్కిస్ బానో కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న 11 దోషులను సత్ప్రవర్తన పేరిట ఇటీవల విడుదల చేసిన గుజరాత్ ప్రభుత్వానికి మరో ఇబ్బందికర పరిణామం! సదరు దోషుల్లో ఒకరైన మితేశ్ చిమన్‌లాల్ భట్ (57) 2020లో పెరోల్‌పై బయట ఉన్న సమయంలో ఓ మహిళను లైంగికంగా వేధించినట్టు తేలింది. ఈ కేసులో అతనిపై చార్జిషీటు కూడా నమోదైంది. అంతేగాక జైల్లో ఉన్న కాలంలో అతను ఏకంగా 954 రోజులు పెరోల్ తదితరాలపై బయటే గడిపాడని గుజరాత్ ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్లో పేర్కొంది. బానో కేసులో దోషుల విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

ఢిల్లీలో టపాసులు కాలిస్తే జైలే

న్యూఢిల్లీ: దీపావళి సందర్భంగా ఢిల్లీలో టపాసులు కొన్నా, కాల్చినా ఆర్నెల్ల జైలు శిక్ష తప్పదని రాష్ట్ర పర్యావరణ మంత్రి గోపాల్ రాజ్ బుధవారం హెచ్చరించారు. అలాగే రాజధానిలో బాణసంచా ఉత్పత్తి, నిల్వ, అమ్మకాలకు పాల్పడితే మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5,000 జరిమానా పడుతుందన్నారు. 'ప్రమిదలు వెలిగించండి, పటాకులు కాదు' అంటూ శుక్రవారం నుంచి నగరమంతటా ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు.

రక్షణ కార్యదర్శిగా గిరిధర్

సాక్షి, న్యూఢిల్లీ: రక్షణ శాఖ కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఆరమానె గిరిధర్ నియమితులయ్యారు. కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారులు శాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన అక్టోబర్ 31న కొత్త బాధ్యతలు చేపడతారు. ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి సుమితా దావ్రా డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ ప్రత్యేక కార్యదర్శిగా నియమించినట్లు కేంద్రం తెలిపింది.

ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాల్లో... మార్షల్ లా విధించిన రష్యా

మాస్కో: ఉక్రెయిన్‌లో ఇటీవల ఆక్రమించుకున్న నాలుగు ప్రాంతాల్లో రష్యా మార్షల్ లా అమల్లోకి తెచ్చింది. దీంతో ఆ ప్రాంతాల గవర్నర్లకు మరిన్ని అధికారాలు దఖలుపడ్డాయి. మార్షల్ లా నేపథ్యంలో ఈ నాలుగు ప్రాంతాల్లో కొత్తగా స్థానిక రక్షణబలగాల ఏర్పాటు, ప్రయాణ ఆంక్షలు, ప్రజాసమావేశాల రద్దు, కఠిన సెన్సార్‌షిప్ విధానాలు, పాలనా యంత్రాంగానికి మరిన్ని అధికారాలు వంటి చర్యలు తీసుకునే అవకాశముంది. ' కీలకమైన సమస్యలకు పరిష్కారం కనుగొంటూ రష్యా రక్షణ, భవిష్యత్ భద్రత కోసం శ్రమిస్తున్నాం' అంటూ రష్యా భద్రతా మండలి సమావేశం ప్రారంభం సందర్భంగా పుతిన్ చేసిన ప్రసంగాన్ని టెలివిజన్‌లో ప్రసారంచేశారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్లోని భారతీయులు వీలైనంత త్వరగా దేశం వీడాలని అక్కడి భారత దౌత్య కార్యాలయం సూచించింది.

అప్పుడే భారత గొంతుకకు అంతర్జాతీయంగా విలువ

ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్



26/11 ముంబై బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పిస్తున్న గుటెరస్

ముంబై/అహ్మదాబాద్: దేశీయంగా మైనారిటీలు, అణగారిన వర్గాల మానవహక్కులను పరిరక్షించినప్పుడే అంతర్జాతీయంగా భారత్ మాటలకు విలువ పెరుగుతుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ముంబై చేరుకుని 26/11 పేలుళ్ల మృతులకు నివాళులర్పించారు. ఐఐటీ-ముంబై విద్యార్థులతో మాట్లాడారు. మైనారిటీలు సహా మానవహక్కుల కార్యకర్తలు, విద్యార్థులు, విద్యావేత్తలు, పాత్రికేయుల హక్కులకు గొడుగుపట్టాలని సూచించారు. ''పర్యావరణ సంక్షోభం భారత్‌తో సహా ప్రతి దేశానికీ గొడ్డలిపెట్టుగా మారింది. భారత ఆర్థిక, వ్యవసాయ, ఆహార, వైద్యరంగాలపై పెను ప్రభావం చూపుతోంది. పునరుత్పాదక సాంకేతికతలకు ప్రాధాన్యత పెంచాలి'' అని సూచించారు. గురువారం ఆయన గుజరాత్‌లో పర్యటిస్తారు.

కాంగ్రెస్ సారథి ఖర్గే



శశిథరూర్‌పై భారీ విజయం

- ఖర్గేకు 7,897 ఓట్లు, థరూర్‌కి 1,072
- 26న అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ
- కాంగ్రెస్‌కు రెండో దళిత అధ్యక్షుడు
- ఫాసిస్టు శక్తులపై పోరాడాలన్న ఖర్గే
- ఇంటికి వెళ్లి అభినందించిన సోనియా

థరూర్‌తో కలిసి ఖర్గే విజయాభివాదం

న్యూఢిల్లీ: అందరూ ఊహించినట్టుగానే గాంధీ కుటుంబానికి వీరవిధేయుడు, సీనియర్ దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విజయం సాధించారు. తన ప్రత్యర్థి శశిథరూర్‌పై భారీ ఓట్ల తేడాతో గెలుపొందారు. మొత్తం పోలయిన ఓట్లలో 84 శాతం ఖర్గేకే వచ్చాయి. 137 ఏళ్ల ఘనమైన కాంగ్రెస్ పార్టీ చరిత్రలో 24 ఏళ్ల తర్వాత అధ్యక్షుడైన గాంధీయేతర కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఖర్గే రికార్డు సృష్టించారు. జగజ్జీవన్ రామ్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడైన రెండో దళిత నాయకుడిగానూ నిలిచారు. ఈ నెల 26 ఆయన బాధ్యతలు చేపడతారు. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూధన్ మిస్త్రీ బుధవారం ఫలితాలను ప్రకటించారు. ఖర్గేకు 7,897, థరూర్‌కు 1,072 ఓట్లు పోలయ్యాయి. 416 ఓట్లు చెల్లలేదు. అనంతరం కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ కుమార్తె ప్రియాంకతో కలిసి ఢిల్లీలోని ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఖర్గేను అభినందిస్తూ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్విటర్‌లో ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యయుత భారత్ అన్న కాంగ్రెస్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఖర్గే సుదీర్ఘ అనుభవం, చిత్తశుద్ధి ఉపయోగపడతాయని రాహుల్ పేర్కొన్నారు.

ఫాసిస్ట్ శక్తులతో పోరాడదాం: ఖర్గే

కాంగ్రెస్‌లో పెద్ద, చిన్న అనే తేడా లేదని ఖర్గే మీడియాతో అన్నారు. పార్టీని పటిష్టపరచడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఫాసిస్ట్ శక్తుల్ని ఉమ్మడిగా ఎదుర్కోవాలన్నారు.


కలిసి పనిచేద్దాం : థరూర్

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో తన ఓటమిని శశిథరూర్, ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనని అభినందించారు. పార్టీ పటిష్టత కోసం కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఓటమి పాలైనప్పటికీ ఎన్నికల ప్రచారంలో పార్టీలో మార్పు కోసం తాను లేవనెత్తిన చర్చ పార్టీకి పునర్వైభవం తీసుకువస్తుందని థరూర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో అవకతవకలు: థరూర్ బృందం

శశిథరూర్ ప్రచార బృందం ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు ఆరోపిస్తోంది. ఈ మేరకు పార్టీ చీఫ్ ఎలక్షన్ అథారిటీకి లేఖ రాసింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన పోలింగ్‌లో రిగ్గింగ్ జరిగిందని ఆ లేఖలో పేర్కొంది. ఆ రాష్ట్రంలో పోలయిన ఓట్లన్నీ చెల్లని ఓట్లుగా ప్రకటించాలని డిమాండ్ చేసింది. కౌంటింగ్ జరుగుతుండగానే ఖర్గేని అధ్యక్షుడన్న రాహుల్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఫలితాలు ప్రకటించడానికి ముందే పార్టీ అధ్యక్షుడు ఖర్గేయే అన్నట్టు మాట్లాడడం చర్చనీయాంశమైంది. భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలోని ఆదోనిలో విలేకరుల సమావేశంలో పార్టీలో మీ పాత్ర ఏంటని అడిగిన ప్రశ్నకు తానేం చెయ్యాలో కొత్త అధ్యక్షుడు నిర్ణయిస్తారని అన్నారు.అంతటితో ఆగకుండా ''ఈ విషయాన్ని మీరు ఖర్గేని, సోనియాని అడగండి'' అని వ్యాఖ్యానించారు. ఇంకా కౌంటింగ్ జరుగుతూ ఉండగానే రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు!

వీర విధేయుడు



రాజకీయాల్లో స్వయంకృషితో బ్లాక్ స్థాయి అధ్యక్షుడి నుంచి ఎదిగిన మల్లికార్జున ఖర్గే పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో ఎన్నో సవాళ్ల నడుమ అధ్యక్షుడయ్యారు. ఎస్. నిజలింగప్ప తర్వాత ఈ పదవి చేపట్టిన రెండో కన్నడ నేతగా నిలిచారు.

- కర్నాటకలోని బీదర్‌లో వరవట్టి గ్రామంలో 1949 జులై 12న నిరుపేద కుటుంబంలో ఖర్గే జన్మించారు.
- గుల్బార్గా సేఠ్ శంకర్‌లాల్ కాలేజీలో లా చదివారు. కార్మిక యూనియన్ కేసులెన్నింటినో వాదించి గెలిచారు. తర్వాత కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేయడం విశేషం.
- 1968లో రాధాబాయిని వివాహం చేసుకున్నారు. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఎమ్మెల్యేగా ఉన్నారు.
- ఖర్గే 1969లో కాంగ్రెస్‌లో చేరి గుల్బార్గా బ్లాక్ అధ్యక్షుడి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. కాంగ్రెస్ చీలినప్పుడు ఇందిరాగాంధీ వెంట నడిచారు. 1978లో మాత్రం ఇందిరపై తిరుగుబాటు చేసి తన గురువు దేవరాజ్ వెంట నడిచారు. కొంతకాలానికే ఇందిర గూటికి చేరారు. అప్పట్నుంచి గాంధీ కుటుంబానికి వీరవిధేయునిగా ఉన్నారు.
- 1972లో తొలిసారిగా కర్నాటక అసెంబ్లీ ఎన్నికయ్యారు. అప్పట్నుంచి 2014 దాకా వరసగా 11 సార్లు అప్రతిహతంగా గెలుస్తూ వచ్చారు. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో రైల్వే, కార్మిక శాఖల్ని సమర్థంగా నిర్వహించారు. కార్మికులకు మేలు చేసే సంస్కరణలతో విపక్షాల మన్ననలు కూడా పొందారు.
- రాజకీయాల్లో విలువలు పాటించే క్లీన్ ఇమేజ్ ఉన్న నేత ఖర్గే. కర్నాటక సీఎం పదవి మూడుసార్లు వచ్చినట్టే వచ్చి చేజారింది. తీవ్ర నిరాశ చెందినా, పార్టీకి నిబద్ధుడిగానే ఉన్నారు.
- 2014లో కాంగ్రెస్ పార్టీ 44 సీట్లతో లోక్‌సభలో ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయిన వేళ పార్టీని ముందుండి నడిపి బీజేపీని ఎదుర్కొన్న తీరు అందరినీ ఆకట్టుకుంది.
- 2019లో గుల్బార్గా నుంచి తొలిసారి ఓడిపోయారు. దాంతో పార్టీ ఆయనను రాజ్యసభకు పంపింది.
- విద్యార్థిగా ఉన్నప్పుడు కబడ్డీ, ఫుట్‌బాల్, హాకీ ఆటల్లో ఆయనకు ప్రవేశం ఉంది. సౌమ్యుడు, మృదుస్వభావిగా పేరున్నప్పటికీ బీజేపీని విమర్శించే సమయంలో ఆయన మాటలే తూటాల్లా పేలేవి. మోదీ సర్కార్‌ను ఇరుకున పెట్టేలా విమర్శల్ని సంధించే కాంగ్రెస్ నాయకుల్లో ఖర్గే ముందు వరసలో ఉంటారు.
- సంఘ్ పరివార్ భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించే ఖర్గే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా తన గళాన్ని బలంగానే వినిపించారు. బుద్ధుడు, అంబేడ్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

మరోసారి చైనా మోకాలడ్డు

ఐరాస: పాకిస్తాన్‌కు చెందిన లష్కరే నేత షహీద్ మహమూద్ (42)ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలంటూ ఐక్యరాజ్యసమితిలో భారత్, అమెరికా చేసిన సంయుక్త ప్రతిపాదనకు చైనా మరోసారి మోకాలడ్డింది. ఈ ప్రతిపాదనను చైనా అడ్డుకోవడం గత నాలుగు నెలల్లో ఇది నాలుగోసారి. పాక్‌లో తలదాచుకుంటున్న అబ్దుల్ రెహ్మాన్ మక్కీ తదితరులను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటించాలన్న ఇరు దేశాల సంయుక్త ప్రతిపాదనలకు కూడా చైనా ఎప్పటికప్పుడు ఐరాసలో గండి కొడుతూ పాక్‌ను ఆదుకుంటూ వస్తోంది. భారత్, అమెరికాలపై దాడులే లష్కరే ప్రధాన లక్ష్యమని 2011 నుంచి పదేపదే చెబుతూ వస్తున్నాడని అమెరికా ఒక ప్రకటనలో పేర్కొంది.

బ్రిటన్ హోం మంత్రి బ్రేవర్మన్ రాజీనామా



లండన్: భారత సంతతికి చెందిన బ్రిటన్ హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్ రాజీనామా చేశారు. లండన్‌లోని ఆమె కార్యాలయ వర్గాలు ఈ విషయాన్ని బుధవారం ధ్రువీకరించాయి. గోవా మూలాలున్న తండ్రి-తమిళనాడు మూలాలున్న తల్లికి జన్మించిన బ్రేవర్మన్ 43 రోజుల క్రితమే యూకే హోం సెక్రెటరీగా నియమితులయ్యారు. యూకే ఆర్థిక వ్యవస్థ నానాటికీ దిగజారిపోతుండడంతో ప్రధాని లిజ్ ట్రస్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. బ్రవెర్మన్ బుధవారం ఉదయం లిజ్ ట్రస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం రాజీనామా సమర్పించినట్లు తెలిసింది. ట్రస్ విధానాలతో బ్రవెర్మన్ విభేదిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ రాజీనామా పరిణామంతో ట్రస్‌పై ఒత్తిడి మరింత పెరిగింది.

హిమాచల్‌లో బీజేపీ తొలి జాబితా

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు 62 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ బుధవారం విడుదల చేసింది. కేబినెట్ మంత్రి మహేంద్రసింగ్‌తో పాటు 11 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండిచేయి చూపింది. అయితే మహేంద్ర సింగ్ కుమారునికి టికెట్ దక్కింది. ఇద్దరు మంత్రుల స్థానాలు మార్చింది. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇతర అత్యున్నత నేతలతో కూడిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సోమవారం జాబితాను ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 68 అసెంబ్లీ స్థానాలున్నాయి. సీఎం జైరాం ఠాకూర్ మళ్లీ సెరాజ్ అసెంబ్లీ స్థానం నుంచే బరిలో దిగుతున్నారు. మాజీ సీఎం, సీనియర్ నేత ప్రేమ్ కుమార్ ధుమాల్ (78)కు టికెట్ దక్కలేదు.

ఆంగ్ల బానిసత్వం మనకొద్దు

నూతన విద్యా విధానంతో దాన్నుంచి బయటపడతాం: మోదీ

- గుజరాత్ 'డిఫెన్స్ ఎక్స్‌పో' ప్రారంభం
- వైమానిక స్థావరానికి పునాదిరాయి



'మిషన్ స్కూల్స్' విద్యార్థులతో ప్రధాని మోదీ

అదాలజ్/గాంధీనగర్: ఆంగ్ల భాష పట్ల బానిస మనస్తత్వం నుంచి నూతన విద్యా విధానంతో దేశం బయట పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. 5జీ టెలికాం సేవలు విద్యా వ్యవస్థను మరో స్థాయికి తీసుకెళ్తాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ సదుపాయాలు, స్మార్ట్ తరగతి గదులు, స్మార్ట్ బోధనా రీతులు అందుబాటులోకి వస్తాయన్నారు. గుజరాత్‌లో గాంధీనగర్ జిల్లాలోని అదాలజ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'మిషన్ స్కూల్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను మోదీ బుధవారం ప్రారంభించారు. ''ఇంగ్లిష్ కేవలం ఒక భావప్రసార మాధ్యమమే. అయినా ఆ భాషలో పరిజ్ఞానముంటేనే మేధావులుగా పరిగణించే పరిస్థితి ఉంది. ప్రతిభావంతులైన గ్రామీణ యువత ఇంగ్లిష్‌లో నైపుణ్యం లేదన్న కారణంతో డాక్టర్లు, ఇంజనీర్లు కాలేకపోతున్నారు''అని వాపోయారు. ఇతర భాషల్లోనూ ఉన్నత చదువులు చదువుకొనే అవకాశం ఇప్పుడుందన్నారు.

గ్రామీణ విద్యార్థులకు లబ్ధి

తన స్వరాష్ట్రం గుజరాత్‌లో విద్యారంగంలో గత రెండు దశాబ్దాల్లో ఎనలేని మార్పులు వచ్చాయని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. 1.25 లక్షల కొత్త తరగతి గదులు నిర్మించారని, 2 లక్షల మంది టీచర్లను నియమించారని ప్రశంసించారు. స్కూల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద మరో 50,000 క్లాస్‌రూమ్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు. లక్ష క్లాస్‌రూమ్‌లను 5జీ టెక్నాలజీతో స్మార్ట్ తరగతి గదులుగా మార్చబోతున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో పాఠాలు వినొచ్చని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎంతగానో లబ్ధి పొందుతారని వివరించారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే పోటీ పరీక్షల కోసం సన్నద్ధం కావొచ్చని, రోబోటిక్స్ వంటి కొత్త సబ్జెక్టులు నేర్చుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మార్చడానికి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'శాల ప్రవేశోత్సవ్, గుణోత్సవ్' వంటి కార్యక్రమాలు ప్రారంభించానని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మోదీ సంభాషించారు.

రక్షణ స్వావలంబన గర్వకారణం

ఇకపై దేశీయంగా ఉత్పత్తి అయిన రక్షణ పరికరాలనే కొనుగోలు చేయాలని మన రక్షణ దళాలు నిర్ణయించుకోవడం సంతోషకరమని మోదీ చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది నిదర్శనమన్నారు. గుజరాత్‌లో 'డిఫెన్స్ ఎక్స్‌పో-2022ను ప్రధాని మోదీ ప్రారంభించారు. 2021-22లో 13,000 కోట్ల రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేశామని, రూ.40,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. భారత్-పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో బనస్కాంతా జిల్లా దీసాలో వైమానిక స్థావరం నిర్మాణానికి మోదీ పునాదిరాయి వేశారు.

సముద్రాల గుండె చప్పుడు విందాం!

ఐరిష్ కళాకారిణి మెక్‌డొనాల్డ్ వినూత్న ప్రయోగం

- సముద్ర గర్భంలోని శబ్దాలు మైక్రోఫోన్ల సాయంతో రికార్డు
- భవిష్యత్తు విపరిణామాలను ముందే తెలుసుకొనే అవకాశం



వాషింగ్టన్: వాతావరణ మార్పులు.. భూగోళంపై మానవళి మనుగడకు పెనుముప్పుగా పరిణమించాయి. ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. ధ్రువ ప్రాంతాల్లోని మంచు వేగంగా కరిగిపోతోంది. ఫలితంగా సముద్రాల్లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. తీర ప్రాంతాల్లో ముంపు భయం వెంటాడుతోంది. వీటన్నింటికి మానవుల అత్యాశే కారణమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో సముద్రాల గుండె ఘోష వినేందుకు ఐర్లాండ్‌కు చెందిన కళాకారిణి సియోభాన్ మెక్‌డొనాల్డ్ నడుం బిగించారు. సముద్రాల అడుగు భాగంలో సంభవించే భూకంపాలు, విరిగిపడే కొండ చరియలు, జీవజాలం మనుగడ, కాలుష్యం, కరిగిపోతున్న మంచు గురించి సమగ్రంగా తెలుసుకొనేందుకు కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సముద్రం వివిధ ప్రాంతాల్లో మైక్రోఫోన్లు(హైడ్రోఫోన్స్) జార విడుస్తున్నారు. ఇందుకోసం గ్రీన్‌ల్యాండ్, కెనడా మధ్య ఉన్న డెవిస్ అఖాతాన్ని ఎంచుకున్నారు. ఇప్పటిదాకా 12 మైక్రోఫోన్లను జారవిడిచారు. ఈ ప్రయోగానికి అమెరికా నేషనల్ సైన్స్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది.

ఈ ప్రయోగం ఒక టైమ్ క్యాప్సూల్

మైక్రోఫోన్లు రెండేళ్లపాటు సముద్రంలోనే ఉంటాయి. 2024లో బయటకు తీస్తారు. ఇవి ప్రతి గంటకోసారి సముద్ర అడుగు భాగంలోని శబ్దాలను స్పష్టంగా రికార్డు చేస్తాయి. ఈ శబ్దాలన్నింటిని కలిపి ఒక ఆడియోను రూపొందిస్తారు. ఇది 'సముద్ర జ్ఞాపకం'గా మెక్‌డొనాల్డ్ అభివర్ణించారు. వాతావరణ మార్పులు, పర్యావరణ విపత్తుల విషయంలో ఇదే మొట్టమొదటి సైన్స్, ఆర్ట్స్ ఉమ్మడి ప్రయోగమని చెబుతున్నారు. సముద్రాల గుండె చప్పుడు వినడం ద్వారా భూమిపై సమీప భవిష్యత్తులో సంభవించే విపరిణామాలను ముందే అంచనా వేయొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రయోగం ఒక టైమ్ క్యాప్సూల్ లాంటిదేనని మెక్‌డొనాల్డ్ అన్నారు. పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ తనను ఈ ప్రయత్నానికి పురికొల్పిందని చెప్పారు. గ్రీన్‌ల్యాండ్‌లో పెద్ద ఎత్తున మంచు పేరుకొని ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు శిలాజ ఇంధనాల వాడకం ఆపేసినా సరే గ్రీన్‌ల్యాండ్‌లో 110 క్వాడ్రిలియన్ టన్నుల మంచు కరిగిపోయి సముద్ర మట్టం 27 సెంటీమీటర్లు(10.6 అంగుళాలు) పెరుగుతుందని అంచనా.

బ్రిటన్లో నేరాల కట్టడికి ఈ-రిక్షాలు!



లండన్: నేరాల కట్టడికి ప్రపంచమంతటా పోలీసులు గాలితో పందెం వేస్తూ దూసుకెళ్లే అత్యాధునిక వాహనాలను వాడుతున్నారు. కానీ బ్రిటన్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా టుక్‌టుక్ (ఈ-రిక్షా)లను రంగంలోకి దించుతోంది. వేల్స్‌లోని గ్వెంట్ కౌంటీ పోలీసులు ఇప్పటికే నాలుగు టుక్‌టుక్‌లు కొనుగోలు చేశారు. స్థానిక న్యూపోర్ట్, అబెర్‌గ్రావెనీ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పార్కులు, వాక్‌వేలు, బహిరంగ స్థలాల్లో గస్తీకి వాటిని వాడుతున్నారు. నేరాలు జరిగితే సమీపంలోని ఏ టుక్‌టుక్‌నైనా సంప్రదించి ఫిర్యాదు చేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. వీటిపై ప్రజల నుంచి విపరీతమైన సానుకూల స్పందన వస్తోందట! అయితే ఈ టుక్‌టుక్‌ల గరిష్ట వేగాన్ని గంటలకు 55 కిలోమీటర్లకు పరిమితం చేయడం మరో విశేషం. ఈ-రిక్షాల సేకరణకు మహీంద్రా ఎలక్ట్రిక్‌తో గ్వెంట్ పోలీసు విభాగం భాగస్వామ్యం కుదుర్చుకుంది.

'ఆర్యన్‌ను ఇరికించారు'

ముంబై: బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్‌ను నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు కావాలనే డ్రగ్స్ కేసులో ఇరికించారని ఎన్సీబీ విజిలెన్స్ కమిటీ పేర్కొంది. దీనికి సంబంధించి ఒక సీనియర్ అధికారితో పాటు ఎనిమిది మందిపై చర్యలకు సిఫార్సు చేసింది. ఓ క్రూయిజ్ పడవలో పార్టీ సందర్భంగా డ్రగ్స్ తీసుకున్నారంటూ ఆర్యన్‌తో పాటు 15 మందిని గతేడాది అక్టోబర్లో ఎన్సీబీ అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. కానీ ఆర్యన్‌ను కేసు నుంచి తప్పించేందుకు అధికారులు లంచం డిమాండ్ చేశారని అనంతరం ఆరోపణలొచ్చాయి. ఆర్యన్‌తో పాటు ఇతర కేసుల్లో వచ్చిన ఇలాంటి ఆరోపణలపై విచారణ జరిపిన విజిలెన్స్ కమిటీ గత ఆగస్టులో మొత్తం 8 మంది అధికారులపై 3,000 పేజీల సుదీర్ఘ చార్జ్‌షీట్ నమోదు చేసింది. డ్రగ్స్ కేసులో ఆర్యన్ ఖాన్‌కు కమిటీ గత మేలో క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇప్పుడు సొంత అధికారులే ఆర్యన్‌ను కావాలని ఇరికించారని తేల్చడం ఎన్సీబీకి మరోసారి తలవంపులు తెచ్చింది.

ఆ బాబు.. ఈ బాబు ఒక్కరేగా పవన్!

నాడు తిట్టింది.. నేడు మాట తప్పింది అదే బాబుకు మేలు చేయడం కోసం కాదా?

సాక్షి, అమరావతి: 'రాష్ట్ర రాజకీయాల్లో ఇద్దరు చంద్రబాబులు ఉన్నారా?' అన్న ప్రశ్నకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే జవాబు చెప్పాలి. ఎందుకంటే.. 'చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలో భూ కబ్జాలు, దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఒక్క విశాఖలోనే ఎకరం రూ.కోటి చేసే.. లక్ష ఎకరాల భూములను దోచుకున్నారు' అని గత అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు పవన్ కళ్యాణ్ విశాఖపట్నం జిల్లా పర్యటనలో తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేశారు. మరి ఇప్పుడేమో ఇదే పవన్ కళ్యాణ్.. తెలుగుదేశం పార్టీ అధినేత, అదే చంద్రబాబు చంకనెక్కడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పుడు బాబుతో కలిసి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతానని చెబుతుండటం విస్తుగొలుపుతోంది. 'చంద్రబాబు మళ్లీ సీఎం అయితే, నీతే ఉండదు.. అంతా అవినీతే' అని జనసేన పార్టీ కార్యకర్తలందరి సమక్షంలో నొక్కి నొక్కి చెప్పిన ఇదే పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఆ విషయం మరచిపోయారా? అని వికేంద్రీకరణను స్వాగతిస్తున్న ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుపై చాలా సభల్లో పెద్ద పెద్ద విమర్శలు చేశారు. ఈ దృష్ట్యా ఆ చంద్రబాబు వేరు.. ఈ చంద్రబాబు వేరని పవన్ భావిస్తున్నారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ఇదంతా చూస్తుంటే అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ చంద్రబాబు కోసమే పని చేసే పవన్.. నాటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అధికార పార్టీ వ్యతిరేక ఓట్లను చీల్చి మళ్లీ చంద్రబాబును సీఎం చేయాలని నాటకం ఆడారనేది సుస్పష్టం. ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా చేసి, అదే బాబుకు మేలు చేయాలని తాపత్రయ పడుతుండటం కళ్లెదుటే కనిపిస్తోంది. గతంలో టీడీపీపై, బాబుపై పవన్ మాటలను ఓసారి పరిశీలిద్దాం...



ఈ బాబు హయాంలో ఏపీ రోడ్ల కంటే తెలంగాణ రోడ్లే మెరుగు

మంత్రి లోకేశ్ మాత్రం 14 వేల కిలోమీటర్ల మేర రోడ్లు వేశాం అంటారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల్లో తిరిగితే ఏదో కొండలు, లోయల్లో ప్రయాణించినట్లుగా ఉంది. మరి లోకేశ్ చెప్పిన 14 వేల కిలోమీటర్ల రోడ్లు ఎక్కడ వేశారు? టీడీపీ నాయకులు తిరిగే చోటే వేసుకుంటున్నారా? ఇక్కడి కంటే తెలంగాణలోని రోడ్లు కాస్త మెరుగ్గా ఉన్నాయి.

– 2018 అక్టోబర్ 2న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంలో పవన్

కాంగ్రెస్ కంటే చంద్రబాబుదే రెట్టింపు స్థాయి అవినీతి, దోపిడీ

చంద్రబాబు ప్రస్తుతం కాంగ్రెస్ కంటే రెట్టింపు స్థాయిలో అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మూడు దశాబ్దాలు వెనక్కి నెట్టిన కాంగ్రెస్‌తో జత కట్టారు. టీడీపీ నేతలు బాబు మళ్లీ రావాలని హోర్డింగ్‌లు పెడుతున్నారు. ఆయన మళ్లీ వస్తే నీతి అనేదే ఉండదు. అంతటా అవినీతే.

– 2018 నవంబరు 5న తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో పవన్

2014లో టీడీపీకి ఎందుకు మద్దతిచ్చానని బాధ పడుతున్నా..

చంద్రబాబు తన కొడుకు లోకేశ్‌ని తప్ప ఎవర్నీ నమ్మడు. 2014 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఎందుకు ఇచ్చామా అని బాధ పడుతున్నా. యువతకు ఉపాధి, ఆడపడుచులకు రక్షణ ఉంటుందని ఆశిస్తే అవేవీ లేవు. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు అప్పులు చేయడంలోనే అభివృద్ధి చూపించారు. బాబు సీఎం కాకముందు రూ.55వేల కోట్లు ఉన్న అప్పు ఇప్పుడు రూ.లక్ష 55 వేల కోట్లకు చేరింది. ఈ రుణాలను మీరు తీరుస్తారా? మీ అబ్బాయి లోకేశ్ తీరుస్తారా?

– 2018 అక్టోబరు 2న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం సభలో పవన్

ఏం చేశారని మళ్లీ చంద్రబాబును ఎన్నుకోవాలి?

నాలుగేళ్ల రాష్ట్రానికి ఏం చేశారని మిమ్మల్ని మళ్లీ ఎన్నుకోవాలి చంద్రబాబూ? మీరు చేసిన అద్భుతాలు ఇక చాలు. ఒక్క కొత్త పరిశ్రమ రాలేదు. ఉన్న వాటిని కూడా మూసివేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉత్తరాంధ్ర వాసులు ఎదురుతిరగరన్న భావనతో పరిశ్రమల పేరిట వేలాది ఎకరాలను దోచుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. తన ప్రభుత్వంలో అవినీతి ఎక్కడ ఉందని సీఎం చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు. శారదా నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలే ఇందుకు జవాబు.

– 2018 జులై 3న విశాఖపట్నం పర్యటనలో పవన్ కళ్యాణ్

లోకేశ్ సీఎం అయితే రాష్ట్రంలో భూముల పరిస్థితి ఏమిటో!

లోకేశ్ సీఎం అయితే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆయన సీఎం అయితే మాత్రం రాష్ట్రం ఏమవుతుందో అనేదే నన్ను భయపెడుతోంది. లోకేశ్ సీఎం అయితే రాష్ట్రంలో భూముల పరిస్థితి ఏమిటోనని భయపడుతున్నా.

– 2018 జూలై 22న విజయవాడలో పవన్ కళ్యాణ్

వందల కోట్ల ప్రభుత్వ డబ్బుతో స్టార్ హోటళ్లలో ఉన్నారు..

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి రిపేర్ సాకుతో హోటల్లో ఉండేందుకు వంద కోట్లు ఖర్చు చేశారు. గిరిజన ప్రాంతంలో అర్హత ఉన్న వ్యక్తులు వ్యాపారాలు పెట్టుకుంటామంటే వారికి రుణాలు ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. లంచాలు ఇస్తే గానీ పని జరగదు. ఇలాంటి పరిస్థితుల వల్లే గిరిజన యువత పక్కదారి పడుతోంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, ప్రజా ప్రతినిధుల పని తీరును ఎవరూ ప్రశ్నించకూడదా? ఒక్క మాట అనరాదు అన్న చందాన పరిస్థితి ఉంది. జన్మభూమి కమిటీలు తీసుకువచ్చి పంచాయతీ వ్యవస్థని చంపేసి, వెనుకబడిన వర్గాలు అధికారానికి దూరమయ్యేలా చేశారు.

– 2018 అక్టోబరు 7న పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో జనసేనాని

మూడు మాటలు.. ఆరు అబద్ధాలు

రాజు నీతి తప్పితే నేల సారం తప్పిందని సామెత. రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో చాలా అనుభవజ్ఞులు కావాలని ఆలోచించి, నేను టీడీపీకి మద్దతిచ్చాను. ఈ నాలుగేళ్లలో వారు మాట్లాడిన మూడు మాటల్లో.. ఆరు అబద్ధాలు వినిపిస్తున్నాయి. నేను టీడీపీకి అండగా నిలబడింది.. ఏపీ పునఃనిర్మాణం కోసం గానీ, తెలుగుదేశం పార్టీ పునఃనిర్మాణానికి కాదు. మూడేళ్ల నుంచి చూస్తున్నాం సరిచేసుకుంటారేమోనని. న్యాయ పోరాటాలు చేస్తున్న వారిపై దాడి చేస్తారా? మా పొలిటికల్ బాస్‌ల వల్ల ఇష్టం లేకపోయినా తప్పులు చేస్తున్నామని అధికారులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు ఓ మహిళా ఎమ్మార్వోపై ఎలా దాడి చేయించారో చూశాం. దాడి చేసిన ఎమ్మెల్యేను ఏమి చేయరా? ఆ ఎమ్మెల్యేకు కొమ్ములొచ్చాయా? మహిళా అధికారిపై దాడి చేస్తే సర్దుకుపోవడం ఏమిటి?

అభివృద్ధి అంతా ఇక్కడేనా? అయితే ఉత్తరాంధ్ర సంగతేంటి?

కేవలం రాజధాని అమరావతి చుట్టూ అభివృద్ధి కేంద్రీకృతమైతే, ఉత్తరాంధ్ర ప్రాంతం ఏమి కావాలి? రాయలసీమ ప్రాంతం ఏమి కావాలి? ప్రకాశం జిల్లా ఏమి కావాలి? ఆ అభివృద్ధి కూడా కొద్ది మందికేనా? ఇలాగైతే మళ్లీ మనకు తెలంగాణ ఉద్యమం వచ్చినట్టు మరో ఉద్యమం రాదా? ఆ కోణంలో ఎందుకు ఆలోచించడం లేదు? ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు?

– 2018 మార్చి 14న గుంటూరు నాగార్జున యూనివర్శిటీ వద్ద పవన్

రెండు నాల్కల చంద్రబాబు

పార్లమెంట్‌లో తలుపులు మూసేసి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజిస్తే.. అలాంటి కాంగ్రెస్‌కు జై కొట్టేందుకు సీఎం చంద్రబాబు 40 ఏళ్ల అనుభవం ఉపయోగపడింది. చంద్రబాబు తెలంగాణలో ఒక మాట, ఏపీలో మరో మాట మాట్లాడుతూ తన స్వప్రయోజనాల కోసం కాంగ్రెస్‌తో కలుస్తుంటే బాధ కలుగుతోంది. టీడీపీ నేతలు సిగ్గులేకుండా ఇప్పుడు కాంగ్రెస్‌తోనే కలుస్తున్నారు.


– 2018 నవంబరు 13న తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో జనసేనాని

ఒక్క విశాఖలోనే లక్ష కోట్ల భూములు దోపిడీ..

చంద్రబాబు సీఎం అయ్యాక భూ కబ్జాలు, దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఒక్క విశాఖలోనే ఎకరం కోటి రూపాయలు చేసే లక్ష ఎకరాల భూములను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ టీడీపీకి ఓట్లేస్తే మన తల్లులు, అక్కలను కూడా దూషిస్తారు.

– 2018 జులై 7న విశాఖపట్నం జిల్లా పర్యటనలో పవన్‌కళ్యాణ్

సహనం లేకుంటే తప్పుకోండి
జనసేన ఓ సెలబ్రిటీ పార్టీ: మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: జనసేన ఓ సెలబ్రిటీ పార్టీ అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటం మంచిది కాదన్నారు. సహనం కోల్పోతే నాయకత్వ స్థానాన్ని వదిలేయడమే మంచిదని సూచించారు. నోరుంది కదా అని ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు. విజయవాడలో బుధవారం బొత్స తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ భేటీతో ఇన్నాళ్లు తాము చెబుతున్నది నిజమేనని రుజువైందన్నారు. 'చిరంజీవి కూడా రాజకీయాల్లో ఉన్నారు కదా.. ఆయన ఎప్పుడైనా ఇలాంటి భాష వాడారా? మొదటి నుంచీ టీడీపీతో టైఅప్ అయ్యావు కాబట్టే ప్యాకేజీ స్టార్ అన్నారు. చెప్పులు అందరి దగ్గరా ఉన్నాయి. మీకు కూడా చెప్పులు చూపిస్తే ఏమైపోతారు? చేతగాని వాళ్లకే మాటలెక్కువ. విశాఖ ఉక్కును ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు.' అని బొత్స అన్నారు.

పోలీసుల అదుపులో ఐదుగురు జనసేన కార్యకర్తలు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విమానాశ్రయంలో మంత్రుల కార్లపై దాడిచేసిన కేసులో మరో ఐదుగురు జనసేన కార్యకర్తలను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే 68 మందిని అరెస్టు చేసిన పోలీసులు 59 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. తొమ్మిదిమంది రిమాండ్‌లో ఉన్నారు.

పవన్.. ఈ ప్యాకేజీ ఎంత?

- మంత్రి సీదిరి అప్పలరాజు మండిపాటు
- టీడీపీ మీ అమ్మను తిట్టిన తిట్లు ఆశీర్వచనాలా?
- నీ యుద్ధాలన్నీ రాత్రి పూటే అని నీ సైనికులకు చెప్పు

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో విడిపోయిన నువ్వు.. మళ్లీ ఆయనతో కలవడానికి ఎంత ప్యాకేజీ అందుకున్నావో చెప్పాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నా కుటుంబాన్ని, మా అమ్మను దూషించిన చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ5 అంతమే నా లక్ష్యమని బీరాలు పలికావే? ఇప్పుడు ఆ తిట్లే నీకు ఆశీర్వచనాలయ్యాయా?' అని నిలదీశారు. 'సినిమాల పరంగా మేం చిరంజీవి అభిమానులం. మీ తల్లిని తిడితే మీకు రోషం లేదేమోగానీ.. చిరంజీవి తల్లి అంటే మాకు గౌరవం.. అప్పట్లో చిరంజీవి తల్లిపై టీడీపీ, ఎల్లో మీడియా చేసిన దూషణలను మేం ఖండించాం' అని గుర్తుచేశారు. కొందరి ప్రయోజనాల కోసమే అమరావతి రాజధాని నిరిస్తున్నారని.. దోచుకోవడం, దాచుకోవడమే చంద్రబాబు విధానమని.. అభివృద్ధి కేంద్రీకృతమైతే మళ్లీ విభజన ఉద్యమాలు వస్తాయని అప్పట్లో నువ్వు మాట్లాడిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయని పవన్‌ను నిలదీశారు. కేవలం ప్యాకేజీ ముట్టడం వల్లే మళ్లీ చంద్రబాబుతో కలిసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నువ్వు ప్యాకేజీ స్టార్‌వి కాకపోతే.. జనసేన టీడీపీ అనుబంధ విభాగం కాకపోతే.. 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెడతానని ప్రకటించాలని సవాల్ విసిరారు. 'ఉత్తరాంధ్ర జేఏసీ నిర్వహించిన విశాఖ గర్జన సక్సెస్ అవ్వడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వంటి ఊర కుక్కలన్నీ ఒక్కటవుతున్నాయి. బాబు సూచనతో విశాఖకు వచ్చి నీ సైకోలతో మంత్రులపై దాడులు చేయించావు. ఇది మా ఉత్తరాంధ్ర ప్రజల గుండెల మీద తన్నటం కాదా?' అని మండిపడ్డారు. మంత్రి అప్పల రాజు ఇంకా ఏమన్నారంటే...



అనైతికతే పవన్ విధానం

- 'నా కొడకల్లారా.. తేల్చుకుందాం..' అంటూ పవన్ పదే పదే వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులను దూషిస్తూ మాట్లాడాడు. వాటికి జనసేన కార్యకర్తలు మరింత రెచ్చిపోతూ క్లాప్స్ కొట్టారు. ఈ తంతుకు ఎల్లో మీడియా, చంద్రబాబు మద్దతు పలకడం.. ఆశ్చర్యం వేసింది. దేశంలో.. ఏ రాష్ట్రంలో అయినా ఇలాంటివి చూశామా?
- రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగే విధంగా.. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా దాదాపు రూ.2 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి.. వారి సామాజిక, ఆర్థిక ప్రగతికి సీఎం వైఎస్ జగన్ తోడ్పడుతున్నది వాస్తవం కాదా? మీరు చేసిన మంచి ఏమిటో చెప్పలేక, ఆఖరికి చెప్పులు చూపించుకునే పరిస్థితి వచ్చింది.
- సినిమాల్లో నటిస్తూ, ప్రతి సినిమాకు పవన్ ఒక ప్యాకేజీ తీసుకుంటాడు. అలానే ఖాళీ సమయాల్లో, చంద్రబాబు దగ్గర ప్యాకేజీలు తీసుకుని రాజకీయాలు చేసి మళ్లీ కొత్త ప్యాకేజీ వచ్చే వరకు కనిపించకుండా వెళతాడు.
- ఇప్పటికైనా నీ కోసం చొక్కాలు చింపుకునే నీ ఫ్యాన్స్‌కు నిజం చెప్పు పవన్ కళ్యాణ్. నీ గురించి తెలియక, నీ మాటలకు, చేష్టలకు వారు ఆవేశపడిపోతున్నారు. నీ యుద్ధాలన్నీ రాత్రి పూటే తప్పితే.. పగటి పూట కాదని నీ సైనికులకు చెప్పు. ఫాం హౌస్‌లో యుద్ధానికే కదా నీవు సిద్ధం? నీకు ఏ విలువలూ లేవు. నైతికత లేదు. ఒక భార్య ఉండగానే, మరో ఆవిడతో పిల్లల్ని కనడం నైతికతా? అందుకే ప్రజలు నిన్ను పోటీ చేసిన రెండు చోట్లా తిరస్కరించారు.

అది ప్రజాస్వామ్యమా బాబూ?

- మంత్రులపై జనసేన కార్యకర్తలతో దాడి చేయించడం ప్రజాస్వామ్య పరిరక్షణా బాబూ? మంత్రులపై దాడులు చేయించిన వ్యక్తులను పరామర్శించడానికి హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తావా? టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మా పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను అక్రమంగా కొనుగోలు చేసి, అందులో నలుగురిని మంత్రులను కూడా చేయడం రాజ్యాంగ పరిరక్షణా?
- అప్పట్లో ఎమ్మెల్యే రోజాను ఏడాది పాటు సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య పరిరక్షణా? ప్రతి పక్ష నాయకుడిగా వైఎస్ జగన్ హక్కులను కాలరాసి.. శాసనసభలో మైకు ఇవ్వకుండా, బూతులు తిట్టిస్తూ, పైశాచిక ఆనందం పొందడం ప్రజాస్వామ్యమా? మీ హయాంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయబట్టే.. వైఎస్ జగన్ ఒక హీరోలా.. బయటకు వచ్చి పాదయాత్ర చేశారు. మీ పార్టీని 23 సీట్లకు పరిమితం చేశారు. పవన్, బాబు కలిసి వస్తుంటే కొన్ని చానళ్లకు ముసిముసి నవ్వులు మాత్రమే కనిపించాయి. నాకు మాత్రం తడిసిపోయిన వారి ప్యాంట్లు కనిపించాయి.
- రాజధాని ఏర్పాటుపై కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ సూచన మేరకు సీఎం జగన్ వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకే మీకు కడుపు మంట. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల గుండెల్లో నిలిచిన సీఎం వైఎస్ జగన్ అంటే పచ్చమందకు భయం.

నీ ప్యాకేజీ కోసం వాళ్లు రౌడీలవ్వాలా?

- పవన్ కళ్యాణ్‌ను నిలదీసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఇదేనా నువ్వు యువతకు ఇచ్చే సందేశం?
- కాపులకు ద్రోహం చేసిన చంద్రబాబు చంకనెక్కడానికి సిగ్గుగా లేదా?

సాక్షి, అమరావతి: 'నీ ప్యాకేజీ కోసం రౌడీయిజం చేయాలని యువతకు పిలుపునిస్తావా? బిడ్డల భవిష్యత్‌పై తల్లితండ్రులు పెట్టుకున్న కలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తుంటే.. వాటిని కల్లలు చేసే దుస్సాహసానికి ఒడిగడతావా?' అంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిలదీశారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేయాలని ఆకాంక్షిస్తూ ఉత్తరాంధ్ర జేఏసీ గర్జన నిర్వహించిన రోజునే.. దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి జనవాణి నిర్వహించడం కోసం పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు విశాఖకు పంపారన్నారు. విశాఖ గర్జన గ్రాండ్ సక్సెస్ అవ్వడంతో ఓర్వలేని చంద్రబాబు.. విశాఖ ఎయిర్‌పోర్టులో మంత్రులపై జనసేన కార్యకర్తలతో దాడి చేయించేలా పవన్ కళ్యాణ్‌ను ప్రేరేపించారని విమర్శించారు. మంత్రి కారుమూరి ఇంకా ఏమన్నారంటే...

దిగజారుడుతనానికి నిదర్శనం

- వైఎస్సార్‌సీపీ నేతలపై ఇనుప రాడ్‌లు, హాకీ స్టిక్‌లు, చెప్పులతో దాడి చేయాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం పవన్ కళ్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనం. సినిమా హీరోవి కాబట్టి కొంత మంది యువత నిన్ను ప్రేమించిన పాపానికి... రౌడీయిజం చేసేలా వారిని ప్రేరేపించి... పెడదోవ పట్టించి... వారి భవిష్యత్తును బుగ్గిపాలు చేయొద్దు. ప్రజలంటే చంద్రబాబుకు ద్వేషం, అసూయ. ఆయన డైరెక్షన్‌లో నడిచే పవన్ కళ్యాణ్‌కూ ప్రజలంటే ద్వేషం.



- ప్రజలు ఎన్నుకున్న 151 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై దాడులు చేయాలని పవన్ కళ్యాణ్ పిలుపు ఇవ్వడమంటే.. ప్రజలపై దాడి చేయడమే. దాడికి గురైన మంత్రులకు సంఘీభావం తెలిపాల్సిన ప్రతిపక్ష నేత చంద్రబాబు.. పవన్ కళ్యాణ్‌కు సంఘీభావం తెలపడానికి హుటాహుటిన హైదరాబాద్ నుంచి విజయవాడకు రావడంలో ఆంతర్యమేమిటి?

దత్తపుత్రుడినని నిరూపించుకున్నావు...

- తన డైరెక్షన్‌లో మంత్రులపై దాడి చేయడం వల్లే పవన్ కళ్యాణ్‌కు సంఘీభావం తెలపడానికి చంద్రబాబు వచ్చారన్నది స్పష్టమవుతోంది. చంద్రబాబుతో కలయిక ద్వారా మరోసారి తాను దత్తపుత్రుడినని.. ప్యాకేజీ స్టార్‌నని పవన్ కళ్యాణ్ చాటి చెప్పుకున్నారు.
- కాపు నాయకుడు, విలువలు ఉన్న నేత ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబ సభ్యులను నువ్వు మద్దతు తెలిపిన నీ టీడీపీ ప్రభుత్వం పోలీసులతో తీవ్ర స్థాయిలో వేధిస్తే.. అప్పుడు నువ్వేమయ్యావు పవన్? కాపులకు తీవ్ర ద్రోహం చేసిన చంద్రబాబు చంకనెక్కడానికి సిగ్గుగా లేదా?
- చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ జనసేన స్థాపించారన్నది మరోసారి స్పష్టమైంది. టీడీపీ, జనసేనే కాదు కమ్యూనిస్టులు, కాంగ్రెస్, బీజేపీ అంతా కట్టకట్టుకుని రండి.. మేం వెయిటింగ్.. రాజకీయంగా సీఎం వైఎస్ జగన్ ఈక కూడా పీకలేరు. దమ్ముంటే 175 స్థానాల్లో జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టు. అప్పుడు నిన్ను ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు అని పిలవం.

చంద్రబాబు ఆలోచనలే పవన్ అజెండా

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజం
- సంక్షేమాభివృద్ధిని అడ్డుకోవాలన్నదే వారి లక్ష్యం
- పవన్ నిజ స్వరూపాన్ని అందరూ చూశారు
- వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ చూసే ఈ ఆక్రోశం
- బాబు వెంట పడుతూ కార్యకర్తలను మోసం చేశారు
- మీ కుట్రలు సాగవు...

రామచంద్రపురం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ స్థాపించినప్పటి నుంచి చంద్రబాబు నాయుడు ఆలోచనలే అజెండాగా చేసుకుని పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం పరిపాలనా వికేంద్రీకరణ ద్వారా మూడు రాజధానులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళ్లాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే, పేదల సంక్షేమాన్ని అడ్డుకునేందుకే పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పని చేస్తామంటున్నారని ధ్వజమెత్తారు. ఎట్టకేలకు ముసుగు తీసిన పవన్, చంద్రబాబులు ఎవరి కోసం కలుద్దామంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మంత్రి వేణుగోపాల కృష్ణ ఇంకా ఏమన్నారంటే..

ఇది బాబుకు వత్తాసు పలకడం కాదా?

- సీఎం జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను పేదల వద్దకు తీసుకెళ్లారు. తద్వారా వారి అభివృద్ధిని కాంక్షిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇప్పుడు మీ కలయిక ఆ అభివృద్ధిని అడ్డుకోడానికా?



- పవన్ కళ్యాణ్ మాట్లాడిన భాష ద్వారా రాష్ట్ర ప్రజలు అతని నిజ స్వరూపాన్ని చూశారు. ఒక రాజకీయ నాయకుడిగా ఆ మాటలు దారుణం. చంద్రబాబు.. రైతుల ముసుగులో అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కొంత మందిని ప్యాకేజీతో తీసుకువచ్చి పాదయాత్ర చేయిస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా కుట్ర పన్నారు. దీనికి పవన్ వత్తాసు పలుకుతున్నారు.
- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక ఏం చేయాలో తెలియక ఆక్రోశంతో, ఆవేశంతో పవన్ కళ్యాణ్ విచక్షణ కోల్పోయి ప్రవర్తించడం ప్రజలందరూ చూసి, విస్తు పోయారు. పార్టీ పెట్టిన తర్వాత ఏనాడూ సొంతంగా పోటీ చేయలేని ఆయన చంద్రబాబును తిరిగి గద్దెనెక్కించేందుకు పరితపిస్తున్నారు.
- చంద్రబాబు రాసిన స్క్రిప్టును చదువుతూ ముందుకెళ్తున్న పవన్ కళ్యాణ్‌ను ప్యాకేజీ స్టార్ అని కాక మరేమనాలి? నిజాన్ని నిర్భయంగా చెబుతూ, ప్రజలకు చెప్పిందే చేస్తూ ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక ఈ రాష్ట్రాన్ని అశాంతి పాలు చేసేందుకు చంద్రబాబు, పవన్ చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు.
- ప్రజల ప్రయోజనార్థం రాజకీయ పార్టీ పెట్టానంటున్న పవన్ కళ్యాణ్.. తన సొంత అజెండాతో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ప్రయత్నం చేయాలే తప్ప చంద్రబాబు వెంట పడుతూ కార్యకర్తలను మోసం చేయడం తగదు.

ప్యాకేజీ స్టార్ అనక ఇంకేమనాలి?

- పవన్ కళ్యాణ్ ఒరిజినల్ క్యారెక్టర్ బయటపడింది
- మంత్రి ఆర్కే రోజా ధ్వజం
- జగనన్న సైనికులో... జనసైకోలో ఎన్నికల్లో తేలుతుంది
- పవన్‌కు అధికారమిస్తే మూడు పెళ్లిళ్లు చేసుకోవాలని జీవో తెస్తారేమో
- రాష్ట్రాన్ని పంచుకోదలిచే మళ్లీ కలిసిన చంద్రబాబు, పవన్



నగరి: జగనన్న సైనికులో.. జనసైకోలో.. ఎన్నికల్లో తేలిపోతుందని మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఇన్నాళ్లు పవన్ కళ్యాణ్ క్యారెక్టర్‌ను మూసిపెట్టి, పచ్చ చానల్స్ షో చేశాయని, ఇప్పుడు ఆయన ఒరిజినల్ క్యారెక్టర్ బయట పడిందని చెప్పారు. ఇన్నాళ్లు ఆయన ఫ్యాన్స్ సైకోల్లా ప్రవర్తిస్తుంటే ఎందుకలా చేస్తున్నారో పవన్ ప్రసంగం తర్వాత అర్థమైందన్నారు. ఆమె బుధవారం చిత్తూరు జిల్లా నగరిలో విలేకరులతో మాట్లాడారు. అమరావతి టీడీపీ రాజధాని అన్న మనిషి, ఇప్పుడు మాట మార్చారని.. అలాంటి పవన్‌ను ప్యాకేజీ స్టార్ అనకుండా ఇంకేమనాలని ఆమె ప్రశ్నించారు. మీరు కూడా మూడు పెళ్లిళ్లు చేసుకోండని కార్యకర్తలకు చెబుతున్న ఆయన.. అధికారంలోకి వస్తే అందరూ మూడు పెళ్లిళ్లు చేసుకోవాలని జీవో తెస్తారేమో అని ఎద్దేవా చేశారు. మంత్రి రోజా ఇంకా ఏమన్నారంటే..

రహస్య బంధం బట్టబయలు

- పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్లడం, ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను తీసుకొని అందులో నలుగుర్ని మంత్రుల్ని చేసినప్పుడు, ఇదే వైజాగ్‌లో జగనన్నను అరెస్ట్ చేసి వెనక్కు పంపినప్పుడు, ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కున్నప్పుడు మీ ప్రజాపరిరక్షణ ఏమైంది?
- కాపులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రాముఖ్యత ఎవ్వరూ ఇవ్వలేదు. ముద్రగడ కుటుంబంపై దురుసుగా ప్రవర్తించి, వారిని అరెస్ట్ చేస్తే ఆ రోజు చంద్రబాబు చర్యను చిరంజీవి రౌడీయిజం పాలన అని వ్యతిరేకించారు. నేడు మళ్లీ పవన్‌కళ్యాణ్.. కాపులకు ద్రోహం చేసిన అదే చంద్రబాబు చంకనెక్కి కూర్చున్నాడు. ఇన్నాళ్ల వారి రహస్య బంధం తేటతెల్లమైంది.

వాళ్లకు హైదరాబాదే దిక్కు

- 2019 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ మీటింగ్‌కు వచ్చిన జనం, ఓటింగ్‌కు రాలేదు. వీరి మధ్య సంబంధం మొదటి నుంచీ ఉంది. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకోవాలనుకుంటున్నారు. అందుకే మళ్లీ కలిశారు. వీరికి మన రాష్ట్రంలో ఇళ్లు కూడా లేవు. వీరికి హైదరాబాదే దిక్కు.
- చంద్రబాబు నాయుడు ఉండటానికి ఇల్లు ఇచ్చింది.. పవన్ కళ్యాణ్‌కు ఆఫీసు ఇచ్చింది లింగమనేని. దీన్ని బట్టే వీరి సంబంధం ఏమిటో ఇట్టే తెలుస్తోంది. చంద్రబాబు వాడకం ఎలా ఉంటుందో త్వరలో పవన్‌కు తెలుస్తుంది. ఆయన జాబితాలో మరో కరివేపాకు పవన్‌కళ్యాణ్.
- జగనన్న ఆకాశం లాంటి వారు. ఆకాశాన్ని చూసి ఉమ్మితే అది మీపైనే పడుతుంది. ఏ మున్సిపాలిటీ, ఏ వార్డుకైనా రండి.. 2019కి ముందు మీరు చేసిన అభివృద్ధి ఏమిటి.. ఆపై మేము చేసిన అభివృద్ధి ఏమిటో చూపుతాం. రానున్న ఎన్నికల్లో జగనన్న సైనికులకు.. జన సైకోలకు మధ్య జరిగే పోటీలో 175 సీట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం తథ్యం. అప్పుడు ఆ చెప్పుదెబ్బలేవో వారికే తగలడం ఖాయం.

బాబు డైరెక్షన్‌లో పవన్ యాక్షన్

- అందుకే విపరీత పదజాలంతో దూషణ
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్‌కళ్యాణ్ యాక్షన్ చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు రచనలకు అనుగుణంగా రాజకీయంగా పవన్‌కళ్యాణ్ నటిస్తున్నాడని.. సినిమా షూటింగ్‌కు ఒక స్లాట్, రాజకీయ షూటింగ్‌కు ఒక స్లాట్, వ్యక్తిగత జీవితానికి ఇంకో స్లాట్.. అలా మూడు స్లాట్‌లలో పనిచేస్తూ, ప్రభుత్వం మీద విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఇదే అంశాన్ని తాము ఆది నుంచి చెబుతున్నామని గుర్తుచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

జనవాణి ఒక డ్రామా

విశాఖ రాజధాని కావాలన్నది ఉత్తరాంధ్రవాసుల చిరకాల వాంఛ. వారి ఆకాంక్షను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా విశాఖలో జేఏసీ ఆధ్వర్యంలో గర్జన ర్యాలీ ఏర్పాటు చేస్తే, భారీవర్షంలో సైతం లక్షలాదిమంది స్వచ్ఛందంగా తరలి వచ్చారు. మూడు రాజధానులకు మద్దతుగా ప్రజలంతా ఏకమై కార్యక్రమం నిర్వహిస్తుంటే.. దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి పవన్ కళ్యాణ్ అదేరోజు విశాఖ పర్యటన పెట్టుకున్నారు. జనవాణి కోసం అని చెప్పినా.. అది ఒక డ్రామా మాత్రమే. అందుకే ర్యాలీలో పాల్గొని తిరిగివెళ్తున్న మంత్రులు, టీటీడీ చైర్మన్‌పై విమానాశ్రయం వద్ద జనసేన కార్యకర్తలు దాడిచేశారు. అవహేళన చేసి భయంకరంగా ప్రవర్తించారు. ఇదంతా వ్యూహం ప్రకారమే జరిగింది.

స్వీయ రాజకీయ సమాధి చేసుకున్న పవన్

మంత్రుల మీద దాడులు చేసిన అల్లరి మూక మీద కేసులు నమోదు చేయకుండా సన్మానించాలా? తొలుత ఆ దాడులతో తనకు సంబంధం లేదని చెప్పిన పవన్.. ఆ తర్వాత తన పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారంటూ విమర్శలకు దిగారు. అలా పరస్పర విరుద్ధంగా ప్రకటనలు చేసి హైడ్రామాకు తెరలేపిన పవన్.. కుట్రలో భాగంగా చంద్రబాబు డైరెక్షన్‌లో మంగళగిరి వచ్చి నానా హంగామా చేశారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఆ విధంగా తన రాజకీయ సమాధిని తానే స్వయంగా తవ్వుకున్నారు.

ఇద్దరూ ముసుగు తీసేశారు

చంద్రబాబు, పవన్ ఇద్దరూ ముసుగు హోటల్‌లో భేటీ అయ్యారు. ఇద్దరూ ఒకటైనట్లు చెప్పకనే చెప్పారు. తమతో మిగిలిన పార్టీలు కూడా కలిసి రావాలని కోరారు. అలా ఎప్పటినుంచో కొనసాగుతున్న తమ బంధాన్ని ఏ మాత్రం నైతికతలేని ఆ ఇద్దరూ బయట పెట్టుకున్నారు.

175 స్థానాల్లో పోటీ చేస్తారా?

పవన్‌కళ్యాణ్ నిజాయితీగా రాజకీయాలు చేస్తే.. మా సవాల్‌కు జవాబు చెప్పాలి. చంద్రబాబుకు దత్తపుత్రుడిగా వ్యవహరించకుండా, ప్రత్యక్ష రాజకీయం చేస్తే.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం 175 నియోజకవర్గాల్లో పోటీ చేస్తారా? ఎవరితోను పొత్తులేకుండా, ఎవరికో మద్దతు ఇవ్వకుండా, తన పార్టీ స్వయంగా అన్ని నియోజకవర్గాల్లో పోటీచేస్తుందని పవన్ చెప్పగలరా? ధైర్యంగా ఆ విషయాన్ని ప్రకటించగలరా? ఇదే మా సవాల్.

గడప గడపకూ భరోసా


తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


విశాఖ 54వ వార్డులో స్థానికులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. అన్ని జిల్లాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లగా వారికి ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు అండగా నిలుస్తున్నాయని, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో తామంతా చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆనందంగా తెలియజేశారు.


గుంటూరు జిల్లా పొన్నూరులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య


ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

క్లుప్తంగా

ఏపీ ఆర్‌సెట్‌కు 83.69 శాతం హాజరు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్-2022కు 83.69 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ ఆచార్య డి.అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,590 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 6,352 మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 13 నగరాలలో 15 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయని తెలిపారు.

జనసేన కార్యకర్తలకు బెయిల్ తిరస్కరణ

విశాఖ లీగల్: జనసేనకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల అరెస్టయిన తొమ్మిదిమంది ఆ పార్టీ కార్యకర్తల బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. కేసు విచారణ ప్రాథమికదశలో ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని విశాఖ నగరంలోని 7వ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కె.లలితాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ఈ నెల 15న విశాఖ గర్జనకు వచ్చిన మంత్రులపై విమానాశ్రయం వద్ద జనసేన పార్టీకి చెందిన 68 మంది కార్యకర్తలు దాడిచేసినట్లు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 59 మందిని స్టేషన్ బెయిల్ ద్వారా పోలీసులు విడుదల చేశారు. మిగిలిన తొమ్మిదిమందిపై ఐపీసీ 326 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వీరికి న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించడంతో కేంద్ర కారాగారానికి తరలించారు. నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయాధికారి తోసిపుచ్చారు.

నిషేధిత భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అక్రమాలు
- ఐదుగురు సబ్ రిజిస్ట్రార్లపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు

సాక్షి, అమరావతి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిషేధిత భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం బట్టబయలైంది. ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 34 ఎకరాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్టు విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తేలింది. అందుకు బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలకు విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిఫార్సు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2020-21లో నిషేధిత భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదు రావడంతో సమగ్రంగా విచారించాలని ప్రభుత్వం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 500కు పైగా రిజిస్ట్రేషన్లను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు ఈ అక్రమాలను గుర్తించారు. 22ఏ, రెడ్‌మార్క్, నిషేధిత భూములు, నాన్ లే అవుట్ కేటగిరీల కింద పేర్కొంటూ ఆ భూములను రిజిస్ట్రేషన్లు చేయొద్దని ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమాచారమిచ్చింది. అందుకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసేశారు. భీమవరం, నరసాపురం, అత్తిలి, పాలకొల్లు, మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 34 ఎకరాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటి మార్కెట్ విలువ రూ.10 కోట్లకుపైగానే. రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

రాజకీయ వ్యభిచారి పవన్
యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్



అనంతపురం సప్తగిరి సర్కిల్: పవన్ కల్యాణ్ రాజకీయ వ్యభిచారి అని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్నతో కలిసి ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. చెప్పు చూపించి ప్రజాప్రతినిధులను దుర్భాషలాడటం పవన్ నీచ బుద్ధికి నిదర్శనమని అన్నారు. పవన్‌ను ప్రజలు రబ్బరు చెప్పుతో కొడతారని అన్నారు. నీ తల్లిని, అభిమానులను అలగా జనమని టీడీపీ శ్రేణులు దుర్భాషలాడినప్పుడు వారి సంక నాకావా? అని ప్రశ్నించారు. ఎప్పుడు ఏ పార్టీతో కలుస్తారో, ఏం మాట్లాడుతారో పవన్‌కే తెలియదన్నారు. కులం, మతం, రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు జగనన్నపై ఎనలేని ప్రేమ ఉందని, నీలాంటి వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా ఆ ప్రేమ కొంచెం కూడా తగ్గదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లూ క్లై వశం చేసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంస్కారమే ప్రజలను విశేషంగా ఆకర్షించిందని మీసాల రంగన్న చెప్పారు. సీఎం జగన్ ఏనాడూ పవన్‌లా సంస్కారహీనుడిలా ప్రవర్తించలేదన్నారు.

ఏబీఎన్, టీవీ 5లకు గట్టి షాక్

సీఐడీ నోటీసులపై వెంకటకృష్ణ, మూర్తి దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

- నోటీసులు చెల్లవన్న వారి వాదనను తోసిపుచ్చిన హైకోర్టు
- సీఐడీ నోటీసులు చట్ట నిబంధనలకు లోబడే ఉన్నాయన్న న్యాయమూర్తి
- విచారణ పరిధిపై వారు లేవనెత్తిన అభ్యంతరాలు కొట్టివేత
- ఏపీ సీఐడీకి తెలంగాణ పొరుగు పోలీస్ స్టేషన్ అవుతుందని స్పష్టీకరణ
- సీఐడీ విచారణకు హాజరు కావాల్సిందేనని ఆదేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిని, కులాలను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకు విచారణకు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏబీఎన్ వెంకటకృష్ణ, టీవీ 5 మూర్తిలకు గట్టి షాక్ తగిలింది. దర్యాప్తులో భాగంగా తమ ముందు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వారిద్దరూ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేసింది. సీఐడీ నోటీసులు చెల్లవని, వాటిని కొట్టేయాలన్న వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. అలాగే సీఐడీ విచారణ పరిధిపై వారు లేవనెత్తిన అభ్యంతరాలన్నింటినీ కొట్టేసింది. ఏపీ సీఐడీ పరిధిలోకి తెలంగాణ వస్తుందని స్పష్టం చేసింది. ఏపీ, తెలంగాణ సీఐడీలకు ఇరు రాష్ట్రాలు ఒకదానికొకటి పొరుగు పోలీస్‌స్టేషన్లు అవుతాయని తేల్చిచెప్పింది. అందువల్ల సీఐడీ నోటీసులు చట్ట నిబంధనలకు లోబడే ఉన్నాయని, అవి చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. సీఐడీ విచారణకు హాజరు కావాల్సిందేనని వారిద్దరికీ తేల్చి చెప్పింది. ఇప్పటికే జారీ చేసిన నోటీసులకు



సంబంధించి వెంకటకృష్ణ, మూర్తిల వ్యక్తిగత హాజరు నిమిత్తం తాజాగా ఓ తేదీని ఖరారు చేసి ఆ విషయాన్ని రాతపూర్వకంగా వారికి తెలియచేయాలని సీఐడీ అధికారులను ఆదేశించింది. విచారణ సందర్భంగా వారిపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దని సూచించింది. ఈ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం తీర్పు వెలువరించారు.

కుట్రలో భాగంగానే వ్యాఖ్యలు..

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్, పలు కులాలను అవమానపరిచేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడినందుకు నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుతోపాటు ఏబీఎన్, టీవీ 5 చానెళ్లపై సీఐడీ గతేడాది సుమోటోగా కేసు నమోదు చేసింది. దీనిపై రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించి ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడంతో పాటు దర్యాప్తుపై స్టే ఇవ్వాలని కోరారు. అయితే హైకోర్టు ఇందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇదే రీతిలో ఏబీఎన్, టీవీ 5 చానెళ్లు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు సైతం దర్యాప్తును నిలుపుదల చేసేందుకు నిరాకరించింది.

ఏజీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సీఐడీకి రాష్ట్రం మొత్తం ఓ పోలీస్‌స్టేషన్ అవుతుందని, అందువల్ల దానికి పొరుగు పోలీస్‌స్టేషన్ అంటే తెలంగాణ సీఐడీ అవుతుందని తేల్చిచెప్పారు. సెక్షన్ 160(1), సెక్షన్ 2(ఎస్)లను కలిపి చదివితే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఐడీ పోలీస్‌స్టేషన్లు ఒకదానికొకటి పొరుగు పోలీస్‌స్టేషన్లు అవుతాయన్నారు. దీని ప్రకారం పిటిషనర్లకు సీఐడీ ఇచ్చిన నోటీసులు చట్ట నిబంధనలకు లోబడి ఉన్నాయని, అందువల్ల అవి చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు.

నోటీసులు ఇచ్చే పరిధి సీఐడీకి లేదంటూ పిటిషన్లు..

దర్యాప్తులో భాగంగా తమ ముందు హాజరు కావాలంటూ వెంకటకృష్ణ, మూర్తిలకు సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద సీఐడీ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసుల చట్టబద్ధతను సవాల్ చేస్తూ వెంకటకృష్ణ, మూర్తి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ విచారణ జరిపారు. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించగా, మూర్తి తరఫున పీవీజీ ఉమేశ్, వెంకటకృష్ణ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. కేసు ఏపీలో నమోదు చేశారని, పిటిషనర్లు మాత్రం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని, అందువల్ల వారికి ఏపీ సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసులు ఎంతమాత్రం చెల్లవని పోసాని, ఉమేశ్ వాదించారు. అయితే ఈ వాదనలను ఏజీ శ్రీరామ్ తోసిపుచ్చారు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌కు నిర్దిష్ట భౌగోళిక పరిధులు నిర్ణయించడం జరుగుతుందని, అలాగే సీఐడీకి రాష్ట్రం మొత్తాన్ని ఓ పోలీస్‌స్టేషన్‌గా పరిగణించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రం మొత్తం ఓ పోలీస్‌స్టేషన్ అయినప్పుడు ఏపీ సీఐడీకి దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్ అంటే తెలంగాణ అవుతుందని తెలిపారు.

విచారణలో ఆలస్యమెందుకు?

- వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- కేసు విచారణ బదిలీపై అభిప్రాయాలు తెలుసుకున్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో ఆలస్యం ఎందుకవుతోందని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏళ్ల తరబడి విచారణ చేయడం ఏంటని.. ప్రతి కేసు నాలుగేళ్లు, ఐదేళ్లు ఎందుకు పడుతోందని అసహనం వ్యక్తం చేసింది. తన తండ్రి హత్య కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో విచారణ చేయించాలని, విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ కోరారు. తెలంగాణకు బదిలీ చేసినా అభ్యంతరం లేదన్నారు. విచారణకు స్థానిక ఎంపీ అడ్డు పడుతున్నారని ఆరోపించారు. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ వాదనలు వినిపిస్తూ.. కేసు విచారణ తెలంగాణకు కాకుండా కర్ణాటకకు బదిలీ చేయాలని కోరారు. విచారణకు ఎంత సమయం పడుతుందన్న ధర్మాసనం ప్రశ్నకు ఆరు నెలలు పడుతుందని సమాధానమిచ్చారు. సీబీఐ కోరిన మీదట దస్తగిరి, రంగన్నలకు 1+1 బందోబస్తుతో రక్షణ కల్పిస్తున్నామని, భద్రత కొనసాగుతోందని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తెలిపారు. భద్రత కల్పిస్తున్నట్లు ఆధారాలు చూపాలని ధర్మాసనం పేర్కొంది. నిందితులు శివశంకర్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డిల తరఫు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, గురుకిషన్ కుమార్‌లు వాదనలు వినిపించారు. గురుకిషన్ వాదనలు వినిపిస్తూ.. కేవలం ఇద్దరి ఆధారంగా సీబీఐ దర్యాప్తు సాగుతున్నట్లుందని, ఇంకా చాలా మంది సాక్షులున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తు వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. కేసు బదిలీ చేయడానికి అంగీకరించిన ధర్మాసనం ఏ రాష్ట్రానికి బదిలీ అనేది శుక్రవారం వెల్లడిస్తామని తెలిపింది.

సబ్ రిజిస్ట్రార్లకు ఇబ్బందేమీ ఉండదు

సచివాలయ కార్యదర్శులకు రిజిస్ట్రేషన్ అధికారాలపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెట్టడం వల్ల సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన ఇబ్బందేమీ లేదని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నివేదించింది. సచివాలయ కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారం కట్టబెట్టినప్పటికీ సబ్ రిజిస్ట్రార్లు యథాతథంగా తమ కార్యకలాపాలను కొనసాగించుకుంటారని, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయవద్దని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఈ వివరాలను మెమో రూపంలో తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ మెమో ఆధారంగా గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెట్టడంపై దాఖలైన పిల్‌ను మూసివేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను నవంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారం కట్టబెడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామప్రసాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం పైవిధంగా స్పందించింది.

ఫ్లెక్సీల నిషేధంపై స్టేకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ బ్యానర్లను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్ల సభ్య కార్యదర్శులకు ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మంతోజు గంగారావు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. నవంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ బ్యానర్లను నిషేధిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో-65 జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు ఫ్లెక్సీ ప్రింటర్లు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చల్లా గుణరంజన్, డి.వెంకట నరసింహం వాదనలు వినిపిస్తూ.. పీవీసీ ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏకపక్షమన్నారు. ముందు ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసి, ప్రజల అభ్యంతరాలను స్వీకరించి ఆ తరువాతే నిషేధంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కేసులో రాష్ట్రం ఈ విధానాన్ని అనుసరించలేదన్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం విధించడం వల్ల ప్రభావితమయ్యే పిటిషనర్ల వంటి వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వడం గానీ, వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించడం గానీ చేయలేదన్నారు.

పర్యావరణ నిబంధనల ప్రకారమే నిషేధం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధిస్తున్నట్లు ఈ ఏడాది ఆగస్టులోనే ప్రకటన చేశారని తెలిపారు. పర్యావరణ చట్ట నిబంధనల ప్రకారమే ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం విధించామన్నారు. పర్యావరణ పరిరక్షణ అన్నది అంతర్జాతీయ ఒడంబడికలకు అనుగుణంగా ఉంటుందని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దిష్టమైన బాధ్యతలు ఉన్నాయన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు నిరాకరించింది.

బీజేపీ విధానాలతో ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నం

- పరిశ్రమలు మూతబడి ఆకలితో అలమటిస్తున్న నిరుద్యోగులు
- అధికారంలోకి వస్తే బళ్లారి జీన్స్ పరిశ్రమను తెరిపిస్తాం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- కర్నూలు జిల్లాలో కొనసాగిన 'భారత్ జోడో' యాత్ర


మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

ఆదోని టౌన్: బీజేపీ విధానాలు భారత ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ చెప్పారు. రోజురోజుకు పడిపోతున్న రూపాయి విలువే దీనికి నిదర్శనమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రూపాయి విలువను పెంచే చర్యలను తీసుకుంటామని చెప్పారు. భారత్ జోడోయాత్రలో భాగంగా కర్నూలు జిల్లాలో రెండోరోజు బుధవారం ఆయన ఆదోనికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ హింస, విధ్వంసాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ ఐదంచెల విధానంతో జీఎస్టీ వసూలు చేయడంతో ప్రజలకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. బీజేపీ చర్యలు సంపన్నులకే ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. లాభాల్లో నడుస్తున్న పరిశ్రమలను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. దేశవ్యాప్తంగా వేలాది పరిశ్రమలు మూతబడి నిరుద్యోగులు ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. రైతులు, రైతు కూలీల పరిస్థితి బాగాలేదన్నారు. దేశానికి జీన్స్ రాజధాని అయిన బళ్లారిలో జీన్స్ పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదని చెప్పారు. లక్షలమందికి ఉపాధి లభించే జీన్స్ పరిశ్రమ మూతపడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పరిశ్రమను తెరిపిస్తామన్నారు.

నా పాత్రను ఖర్గే నిర్ణయిస్తారు

కాంగ్రెస్ పార్టీలో తన పాత్రను అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఖర్గే, పోటీచేసిన థరూర్ ఇద్దరూ పార్టీలో అపార అనుభవమున్న నేతలన్నారు. థరూర్ సేవల్ని కూడా పార్టీ వినియోగించుకుంటుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుంటారా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు పార్టీ అధ్యక్షుడు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఏపీ రాజధానిగా అమరావతికే తమ మద్దతు ఉంటుందని రాహుల్ చెప్పారు. మూడు రాజధానులకు మద్దతు ఇవ్వబోమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర విభజన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తిచేస్తామన్నారు. కృష్ణా, గోదావరి జలాల వివాదాన్ని పరిష్కరిస్తామని చెప్పారు. యాత్రలో పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ తోపాటు దిగ్విజయ్‌సింగ్, జైరామ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ, విజయవాడ అభివృద్ధికి రూ.136 కోట్లు విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం, విజయవాడ నగరాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 136 కోట్లు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు నాలుగు రాష్ట్రాల్లో 10 లక్షలకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం రూ.1,764 కోట్లు విడుదల చేసింది. ఇందులో భాగంగా విజయవాడ, విశాఖపట్నం నగరాలకు నిధులిచ్చింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ. 293.75 కోట్లు, తెలంగాణకు రూ.331.40 కోట్లు కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది.

హైదరాబాద్‌కు వెళ్లిపోయిన పవన్

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆ పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళ్లినట్లు జనసేన వర్గాలు తెలిపాయి.

పారా మెడికల్ కోర్సుల్లో వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని పారా మెడికల్ కళాశాలలో 2022-23 అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్స్‌కు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బీఎస్సీ(నర్సింగ్)నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, బీపీటీ, బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లకు విద్యార్థులు గురువారం నుంచి 24 తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకూ వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు. వెబ్ ఆప్షన్స్ సమయం ముగిసిన తర్వాత సీట్లు కేటాయింపును యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎంపికైన విద్యార్థులు యూనివర్సిటీ ఫీజు రూ.5,600 ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

జగన్ నొక్కేది ఉత్తుత్తి బటన్‌లు: చంద్రబాబు


జూనియర్ ఎన్టీఆర్ ఫొటో ఉన్న జెండాలతో నిరసన తెలుపుతున్న అభిమానులు


చంద్రబాబు పర్యటనలో వాహనానికి టీడీపీ, జనసేన జెండాలు

సాక్షి, నరసరావుపేట/యడ్లపాడు, నాదెండ్ల, నరసరావుపేట రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్ ఉత్తుత్తి బటన్‌లు నొక్కుతూ కూర్చున్నాడని మండిపడ్డారు. ఇటీవల అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి చంద్రబాబు బుధవారం పల్నాడు జిల్లాలో పర్యటించారు. చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం తిమ్మాపురం, నాదెండ్ల, తూబాడు, సాతులూరు, జొన్నలగడ్డ, నరసరావుపేటల్లో ఆయన పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ భారీ వర్షాలతో పత్తి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అసత్యాలు చెప్పడంలో జగన్ దిట్ట అని, రైతులను ఆదుకోవాలనే ఆలోచనే ఆయనకు లేదని ధ్వజమెత్తారు. వరదలతో రైతులు నష్టపోతే ఒక్క మంత్రి మాట్లాడలేదని, నన్ను తిట్టడానికి మాత్రం పది మంది మంత్రులు ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి ఎకరా పత్తికి రూ.30 వేలు, మిరపకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పవన్‌ను కలిశా

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకే పవన్ కల్యాణ్‌ను కలిసి మద్దతు ప్రకటించానని చంద్రబాబు తెలిపారు. అమరావతికి వెళ్లేటప్పుడు తన కాన్వాయ్‌పై దాడి చేస్తే ప్రజాస్వామ్యమన్నారని మండిపడ్డారు. వివేకా హత్య జరిగితే నారాసుర రక్త చరిత్ర అన్నారని ధ్వజమెత్తారు. తనది హత్యలు చేసిన చరిత్ర కాదని.. ఆ తరహా రాజకీయం కూడా తెలీదన్నారు. తాను తీసుకొచ్చిన సంస్కరణల వల్లే సెల్‌ఫోన్ వచ్చిందన్నారు. అలాగే హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దానని చెప్పారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని, తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. తన జీవితంలో దాపరికం లేదని.. అందుకే అన్‌స్టాపబుల్ టాక్ షోలో అన్ని వివరించానన్నారు. టీడీపీ నేతలు ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, నక్కా ఆనంద్‌బాబు, అరవిందబాబు, శ్రావణ్‌కుమార్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివరామ్ పాల్గొన్నారు.

తారక్ అభిమానుల నిరసన

కాగా చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం తిమ్మాపురం బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అడ్డుతగిలారు. కాబోయే సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. బాబు ఎదురుగా అతడి ఫొటోలు ఉన్న భారీ జెండాలను ప్రదర్శించారు. అమరావతి రైతుల పాదయాత్రలో తమ హీరోని ఎందుకు విమర్శిస్తున్నారంటూ నినాదాలతో హోరెత్తించారు. చంద్రబాబు కావాలనే తిట్టించారని గట్టిగా అరిచారు. వెంటనే టీడీపీ కార్యకర్తలు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. మరోవైపు చంద్రబాబు యాత్రకు జనసేన కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. జనసేన, టీడీపీ జెండాలను బైక్, కార్లకు కట్టుకొని యాత్రలో హల్‌చల్ చేశారు.

అబద్ధాల్లో గోబెల్స్‌ను మించిన చంద్రబాబు

- రైతుల కోసం కాదు.. రాజకీయాల కోసమే పర్యటన
- వ్యవసాయం దండగ అన్నది బాబే
- ఉచిత విద్యుత్‌ను వ్యతిరేకించిందీ ఆయనే
- మంత్రి విడదల రజిని ధ్వజం



చిలకలూరిపేట: అబద్ధాలు చెప్పడంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు గోబెల్స్‌ను మించిపోయారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పంట పొలాల పరిశీలన పేరుతో పల్నాడు జిల్లాలో చంద్రబాబు చేపట్టిన పర్యటన ఆద్యంతం అబద్ధాలు, అసత్యాలతోనే సాగిందన్నారు. చిలకలూరిపేటలో తన కార్యాలయంలో బుధవారం మంత్రి విడదల రజిని మీడియాతో మాట్లాడారు. తాను వచ్చి చూసేవరకు పంట పొలాలను ఎవరూ పరిశీలించలేదని చంద్రబాబు అన్నారని చెప్పారు. అయితే తాను, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులంతా మంగళవారమే అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించామని గుర్తు చేశారు. ఇంత పచ్చి అబద్ధాలు ఎలా ఆడతారో బాబుకే తెలియాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా రైతులకు పంటల బీమా కట్టలేదని బాబు ఆరోపించారని, ఇది పచ్చి అబద్ధమని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ఒక్క ఎకరాకూ, ఒక్క రైతుకూ పంటల బీమా మొత్తాన్ని చెల్లించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే ప్రతి ఎకరాకు ప్రభుత్వమే పంటల బీమా చెల్లించిందన్నారు.

మహిళలు, బీసీలంటే బాబుకు చులకన..

బీసీ మహిళగా తాను మంత్రిగా ప్రజలకు సేవలు అందిస్తుంటే.. ఆకాశంలో తిరుగుతున్నానంటూ బాబు విమర్శలు చేయడం సిగ్గుచేటని రజిని మండిపడ్డారు. మహిళలు, బీసీలు అంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనే ఉందని ఆరోపించారు. రైతులకు పరామర్శ అంటూ వచ్చి పవన్ కల్యాణ్‌ను వెనకేసుకురావడం చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. రైతుల ఆత్మహత్యలు, అప్పులు అంటూ కాకిలెక్కలు పేపర్‌పై రాసుకొచ్చి చదివేసి వెళ్లారని దుయ్యబట్టారు. రైతులకు నష్టపరిహారమే చెల్లించలేదని చంద్రబాబు దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారని, వాస్తవానికి ఎప్పటికప్పుడు నష్టపరిహారం చెల్లిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. పంటలు నష్టపోయి అన్నదాతలు ఇబ్బందులు పడుతుంటే ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఒక్క పల్నాడు జిల్లాలోనే 2019లో రూ.2.8 కోట్లు, 2020లో రూ.3.1 కోట్లు రైతులకు ప్రభుత్వం చెల్లించిందన్నారు.



కాట్యాడ ప్రమీల, రమేశ్‌రావ్

● విలువ

పన్నెండేళ్లుగా వర్షపు నీటి ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి వాసులైన ప్రమీల, రమేష్‌రావు దంపతులు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఇంటి ముందు పది వేల లీటర్ల సంపు కట్టారు ఇంటి అవసరాలకు ఈ నీటినే వాడుతుంటారు. పెద్దగా చదువుకోని వీరు వాటర్ హార్వెస్టింగ్ గురించి చేసిన ఆలోచన అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. తోటి వారికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఇంకిపోని ఆలోచన

వర్షపు నీళ్లు భూమిలో ఇంకితే భూగర్భ జలం పెరుగుతుందని ఇతర రైతుల లాగే తానూ పొలం దగ్గర ఇంకుడు గుంత తవ్వుకున్నాడట రమేష్. ఊట బావితో ఎకరంన్నర భూమిలో పంటలు పండిస్తున్నాడు. అదే విధంగా ఇంటి దగ్గర వర్షపు నీరు వృథాపోకూడదని, ఇంటి అవసరాలకు వాడుకోవాలని ఆలోచన చేసి, ఆచరణలో పెట్టారు. ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీళ్లు వృథాగా పోకుండా ఓ పైపు ద్వారా ఆ నీటిని కొన్నాళ్లు బిందెలు, బకెట్లలో పట్టేవారట. ఆ తర్వాత సంపు ఏర్పాటు చేసి, ఆ నీటిని పైప్ ద్వారా మళ్లించాడు. ఆ నీరే ఇంటి అవసరాలు తీరుస్తోంది. తన ఇంటి పైకప్పు మీద ఓ పైపును అమర్చి అందులో ఓ డబ్బా పెట్టాడు. రాత్రి కురిసిన వర్షాన్ని తెల్లవారాక కొలత వేసి ఎన్ని మిల్లీమీటర్లు పడిందో చెప్పేస్తాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని వజ్జెపల్లి గ్రామానికి చెందిన రైతు కాట్యాడ రమేశ్ రావ్. పంటలు సాగు చేయడంలో కొత్త కొత్త ఆలోచనలు చేస్తుంటాడు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటాడు.

నీటి కరువుకు చెక్

వజ్జెపల్లిలో పన్నెండేళ్ల క్రితం ఇల్లు కట్టుకున్నాడు రమేశ్. అప్పుడు గ్రామంలో నీటికి తీవ్ర కరువు ఉండేది. రాళ్లు, రప్పలతో కూడుకున్న భూములు కావడంతో అక్కడ భూగర్భజలాలు పెద్దగా లేవు. ఎంత వర్షం పడినా భూగర్భజలమట్టం కొద్దికాలమే ఉంటుంది. ఆ తరువాత కరువు కాలమే. అలాంటి పరిస్థితుల్లో వర్షం కురిసినన్ని రోజులు నీటిని నిల్వ చేసుకోవాలంటే.. పెద్ద సంపు ఏర్పాటు చేయాలనుకున్నాడు. పది వేల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మాణానికి రూ.30 వేల దాకా ఖర్చు చేశారు. వర్షపు నీరు పైపు ద్వారా సంపులోకి చేరేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. వర్షం కురిసినన్ని రోజులు ఆ నీరు అంతా సంపులోకి చేరుతుంది. సంపు నిండితే బయటకు వెళ్లేలా ఏర్పాట్లున్నాయి. ప్రతీ రోజు బట్టలు ఉతకడం, స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు సంపు నుంచి నీటిని తోడుకుని వాడుకుంటారు. ఐదారు నెలల పాటు ఈ వర్షపు నీరే వీరి ఇంటి అవసరాలు తీరుస్తోంది. ఈ నీటి ఆధారంగా ఇంటి ఆవరణలో సపోటా, జామ, మామిడి చెట్లు పెంచారు. కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు.

వర్షం నీటి లెక్కలు వేస్తాడు...

'వానాకాలంలో ఎంత వర్షం కురిసినా నీటికి ఎప్పుడూ కష్టాలు ఎదుర్కొనేవాళ్లం. వాన నీటిని ఒడిసిపట్టుకోవడమే దీనికి పరిష్కారం అనుకున్నాం. ఇంటిపైన పడే ప్రతీ చినుకును పైపు ద్వారా సంపులోకి మళ్లించాం. మధ్యలో నీరు ఫిల్టర్ అయ్యేలా ఇసుక వేశాం. ఈ విధానం వల్ల నీళ్లు ఎన్ని రోజులైనా స్వచ్ఛంగా ఉంటాయి. నీళ్లను ఇంత జాగ్రత్త చేస్తున్నాం కాబట్టి, వాడకంలోనూ పొదుపు పాటిస్తాం. ఆరునెలల పాటు ఈ నీళ్లనే వాడుకుంటాం.' అని వివరించారు రమేష్‌రావు, ప్రమీల దంపతులు.

– ఎస్.వేణుగోపాల్‌చారి, సాక్షి, కామారెడ్డి



ఒడిసిపట్టుకుంటేనే భవిష్యత్తు

ఎన్ని డబ్బులు వచ్చినా సరైన పొదుపు పద్ధతులు పాటించకపోతే ఎంత ఇబ్బంది పడతామో, నీటి విషయంలోనూ అంతే. ఎంత వర్షం కురిసినా నీటికి కష్టాలు ఎదుర్కొనేవాళ్లం. వృథాగా పోయే నీళ్లను జాగ్రత్త చేసుకోవాలనే ఆలోచనను అమలులో పెట్టాక సమస్యను అధిగమించాం. పొలం దగ్గర ఇంకుడు గుంత తవ్వుకోవడం వల్ల భూగర్భజలమట్టం పెరిగింది. మా సొంత ఆలోచనతోనే వర్షపు నీటిని కొలత వేస్తూ, దీని ఆధారంగా పంటలు సాగు చేయడం సులువవుతోంది.

– కాట్యాడ ప్రమీల, రమేశ్‌రావ్, రైతు



'ఏదైనా సాధించాలనుకుని పోరాడే వాళ్లకు ఈ డాక్యుమెంటరీ ఒక ప్రేమలేఖ' అంటాడు అంతర్జాతీయ చెఫ్ వికాస్ ఖన్నా. 94 ఏళ్ల వయసులో పట్టుబట్టి కేరళ సాక్షరతా మిషన్‌లో నాలుగో క్లాసు పాసైన కార్త్యాయని అమ్మ మీద అతడు 'బేర్‌ఫుట్ ఎంప్రెస్' పేరుతో డాక్యుమెంటరీ నిర్మించాడు. ఇప్పటికే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్న ఆ డాక్యుమెంటరీ త్వరలో భారతప్రేక్షకుల కోసం రిలీజ్ కానుంది. ఈ డాక్యుమెంటరీ ఆడపిల్లలందరినీ చదివించక తప్పని స్ఫూర్తినిస్తుంది అంటున్నాడు వికాస్.

● డాక్యుమెంటరీ


పోరాడే వాళ్లకో ప్రేమలేఖ



వికాస్ ఖన్నా

అంతర్జాతీయ వంటగాడిగా ఖ్యాతి పొందిన వికాస్ ఖన్నాకు నానమ్మ వయసు ఉన్న వారు ఇచ్చే స్ఫూర్తి పట్ల ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. ఎందుకంటే అతడు జన్మతః కాళ్లలో ఇబ్బందితో పుట్టాడు. అంటే 13 ఏళ్ల వరకు పరిగెత్తడం అతనికి సాధ్యం కాలేదు. దాంతో ఆడుకోవడానికి వెళ్లేవాడు కాదు. అందువల్ల అతడి నానమ్మ అతణ్ణి తన వంటగదిలో కూచోబెట్టుకుని వంటలు చేస్తూ మంచి మంచి కబుర్లు చెప్పేది. ఆమె వల్ల అతను స్ఫూర్తి పొందాడు. అంతే కాదు గొప్ప వంటవాడు అయ్యాడు.

ఇప్పుడు బహుశా కేరళ కార్త్యాయని అమ్మను చూసినప్పుడు అతనికి తన నానమ్మ గుర్తుకు వచ్చి ఉంటుంది. కార్త్యాయని అమ్మ 96 ఏళ్ల వయసులో చదువుకోవాలని సంకల్పించింది. పల్లెల్లో వయోజనులు చదువుకోవడం గురించి ఆలోచనే ఉండదు. ఇక 90 దాటిన వారిని 'ఇంకా పిలుపు రాలేదా' అన్నట్టు చూస్తూ ఉంటారు కొందరు. అలాంటిది కేరళలోని అలెప్పి జిల్లా 'చెప్పడ్' అనే చిన్న ఊళ్లోని కార్త్యాయని అమ్మ అందరి అంచనాలు తారుమారు చేసింది. కేరళ ప్రభుత్వం వయోజనుల కోసం ఏర్పాటు చేసిన అక్షరాస్యతా కార్యక్రమం కింద ఇంట్లో ఉండి చదువుకుని నాలుగో తరగతిని వందకు 98 మార్కులతో పాసయ్యింది. 15 నుంచి 75 ఏళ్ల వయసు ఉన్నవారికి కనీస చదువు నేర్పాలనుకున్న ఈ కార్యక్రమంలో కార్త్యాయని అమ్మ ఉత్సాహంగా దూకింది. చదవడం (30 మార్కులకు పరీక్ష), రాయడం (40 మార్కులకు), లెక్కలు (30 మార్కులకు) ఈ మూడు అంశాల్లో ఉమ్మడిగా 100కు 30 మార్కులు వస్తే పాస్ చేస్తారు. కాని కార్త్యాయని అమ్మకు 98 మార్కులు వచ్చాయి. దాంతో ఆమెకు రాష్ట్రం మొత్తం సలామ్ చేసింది. ప్రతిష్ఠాత్మక కేంద్ర స్త్రీ శక్తి అవార్డు వరించింది.



'ఏదైనా పట్టుబట్టి సాధించాలనుకునేవారికి ఆమెను మించిన స్ఫూర్తి లేదు' అంటాకు వికాస్ ఖన్నా. ఇంతకు ముందు వికాస్ ఖన్నా 'ది లాస్ట్ కలర్' అనే సినిమాకు దర్శకత్వం వహించాడు. ఈ డాక్యుమెంటరీ అతడి రెండో ప్రయత్నం. ఉత్త కాళ్లతో ఆమె ఒక యోధురాలిగా పరీక్ష రాయడానికి స్థానిక స్కూలుకు వెళుతున్న ఫొటో ఎవరినైనా కట్టి పడేస్తుంది. ఆ పరీక్షలో పాసయ్యి గెలిచి ఆమె పట్టుదలకు సామ్రాజ్ఞి అయ్యింది. అందుకే వికాస్ ఖన్నా ఈ డాక్యుమెంటరీకి 'బేర్‌ఫుట్ ఎంప్రెస్' (ఉత్తకాళ్ల సామ్రాజ్ఞి) అని పెట్టాడు.

నూరేళ్ల ఆయుష్షుకు చేరినా కార్త్యాయని అమ్మ ఇంకా చదువుకోవాలనే అభిలషిస్తోంది. 'మరి అలాంటిది మన దేశంలో చిన్నారి ఆడపిల్లలు ఎంత మంది చదువుకోవాలని కోరుకుంటారో కదా. వారందరూ చదువుకోవాల్సిన అవసరాన్ని ఈ డాక్యుమెంటరీ చెప్తుంది' అంటాడు వికాస్.

ఇప్పటికే అనేక అంతర్జాతీయ ఫెస్టివల్స్‌లో పాల్గొన్న ఈ డాక్యుమెంటరీ త్వరలో మన దేశంలో బహుశా ఓటీటీ ద్వారా విడుదల కానుంది.

● రంగస్థలం



'మై యహా హూ' నాటకంలో...

సామూహిక సమర స్వరం

ఇది కాలక్షేపమో... కామెడీ నాటకమో కాదు. వాస్తవజీవిత దృశ్యాలను కళ్లకు కట్టే నాటకం. 'నాటక రంగంపై దృశ్య, అదృశ్య ప్రపంచాలు ఒకే దగ్గర కనిపిస్తాయి' అంటారు. ఈ నాటకం చూస్తే అదెంత నిజమో అర్థమవుతుంది....

బెంగళూరులో 'మరా' అనే మీడియా అండ్ ఆర్ట్స్ సంస్థ ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం ఈ సంస్థ సభ్యులు మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొద్దిమంది మహిళలను కలుసుకున్నారు. ఈ మహిళలు లైంగిక హింస నుంచి కుల హింస వరకు రకరకాల హింస బాధితులు. వారి బాధలకు చూ కర్ దేఖో (టచ్ చేసి చూడు) పేరుతో నాటక రూపం ఇచ్చారు.

ఆ తరువాత...

'బాధితుల స్వరాన్ని బాధితులే వినిపిస్తే ఎలా ఉంటుంది!' అనే ఆలోచన చేశారు 'మరా' సభ్యులు.

ఆ రెండు రాష్ట్రాలకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. వారి స్పందన ఎలా ఉంటుందో తెలియందేమీ కాదు.

'రోజువారి కూలిపనులు చేసుకునేవాళ్లం. ఎప్పుడూ నటించింది లేదు' అన్నారు వాళ్లలో చాలామంది. 'ఎవరిలాగో కనిపించనక్కర్లేదు. నటించనక్కర్లేదు. మీరు మీరుగా కనిపిస్తే చాలు' అని వారికి ధైర్యం చెప్పారు. ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించారు.

అలా 'మై యహా హూ' (నేను ఇక్కడ ఉన్నాను) నాటకానికి రూపకల్పన జరిగింది.

'ఫ్రీడా థియేటర్ గ్రూప్' బ్యానర్‌పై ఈ నాటకాన్ని తొలిసారిగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో ప్రదర్శించారు. నాటకంలో సందర్భానికి అనుగుణంగా రకరకాల ప్రతీకలు వాడుకున్నారు. హృదయాన్ని కదిలించే సంగీతాన్ని వినిపించారు. అద్భుతమైన స్పందన వచ్చింది.

సజీవమైన నాటకంలో నటించడం అంటే మామూలు విషయం కాదు. 'నాకు ఇలా అన్యాయం జరిగింది' అని చెప్పుకునే సందర్భంలో మనసులోని దుఃఖనదులు కట్టలు తెంచుకోవచ్చు. కన్నీళ్లతో కళ్లు మసకబారవచ్చు. అందుకే ఇలాంటి నాటకంలో మనసును, శరీరాన్ని ఏకీకృతం చేసుకోవడం ముఖ్యం. ఈ విద్యలో పట్టు సాధించారు నాటకరంగ సభ్యులు.

నటబృందంలో పద్దెనిమిది నుంచి నలభై రెండు సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలు ఉన్నారు. వీరు రకరకాల హింస బాధితులు మాత్రమే కాదు పోలీస్ నుంచి వైద్యం వరకు రకరకాల వ్యవస్థ బాధితులు. కష్టకాలంలో స్నేహితులు, సొంత కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని అభాగ్యులు.

కిందపడిన చోటు నుంచి తమకు తాముగా పైకి లేచి కొత్త జీవితాన్ని మొదలుపెట్టిన శక్తిమంతులు.

'మరా' సభ్యురాలు అనుషీ అగర్వాల్ మాటల్లో చెప్పాలంటే 'బాల్యం నుంచి యవ్వనం వరకు వివిధ దశలలోని భిన్నమైన భావోద్వేగాలకు ఈ నాటకం అద్దం పడుతుంది. ఇది బాధితుల ఉమ్మడి గొంతుక'

'మరా' ప్రతి సంవత్సరం 'అక్టోబర్ జామ్' పేరుతో ఆర్ట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటుంది. ఇందులో భాగంగా బెంగళూరులోని వివిధ ప్రాంతాలలో 'మై యహా హూ' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం వల్ల ప్రేక్షకులకు బాధిత జీవితాలను కళ్లముందు చూసే అవకాశం దొరికింది. మరి ఇందులోని ఎనిమిది మంది కళాకారులకు?

వారి మాటల్లోనే చెప్పాలంటే... 'నాటకం మాకు తిరుగులేని శక్తిని ఇచ్చింది'

'ఇంతకు ముందు బాధితురాలిగా ఎంతో మంది ముందు కన్నీళ్లతో నిల్చున్నాను. ఎక్కడా న్యాయం జరగలేదు. అన్ని ద్వారాలు మూసుకుపోయాయి. ఇప్పుడు మాత్రం బాధితురాలు, సర్వైవర్‌గా జనం ముందు నిల్చోలేదు. ఆత్మవిశ్వాసం ఉన్న కళాకారిణిగా నిలబడ్డాను. నా కోసం నాటకరంగం ఒక ద్వారాన్ని తెరిచే ఉంచింది. ధైర్యంగా మాట్లాడే గొంతును ఇచ్చింది' అంటుంది నాటక బృందంలో ఒకరైన కషి.



'మరా' మీడియా అండ్ ఆర్ట్స్ సంస్థ సభ్యులు

> బాల్యం నుంచి యవ్వనం వరకు వివిధ దశలలోని భిన్నమైన భావోద్వేగాలకు ఈ నాటకం అద్దం పడుతుంది. ఇది బాధితుల ఉమ్మడి గొంతుక.

సాధారణంగా చాలామంది కెరీర్‌లో ఎదిగేందుకు చేస్తోన్న ఉద్యోగాన్ని వదిలేసి... స్టార్టప్ పెట్టడమో, ట్రెండ్‌కు తగ్గట్టుగా సేంద్రియ వ్యవసాయాన్ని ఎంచుకోవడం వంటిదో చేస్తుంటారు. అయితే కర్ణాటకకు చెందిన అనుషాశెట్టి మాత్రం వీటన్నింటికి భిన్నం. తనకు నచ్చిన డ్యాన్స్ కోసం బంగారంలాంటి ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేసి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా రాణిస్తూ యువతరానికి ప్రేరణగా నిలుస్తోంది.

డ్యాన్స్ కోసం డ్యాన్స్



భర్త సౌరభ్‌తో అనుషాశెట్టి

ఉడిపి జిల్లాలోని కుందాపూర్ అనే చిన్న గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది అనుషాశెట్టి. అనుష తల్లి ప్రభుత్వ ఉద్యోగి, తండ్రి వ్యాపార రీత్యా బెంగళూరులో ఉండేవారు. తల్లి ఉద్యోగం గ్రామంలో కావడంతో అనుష అమ్మ దగ్గర ఉంటూ చక్కగా చదువుకునేది. చిన్నప్పటినుంచి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ లోనూ, క్రీడల్లోనూ చాలా చురుకుగా ఉండేది. దీంతో తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహిస్తుండేవారు. ఇంటర్మీడియట్ అయ్యాక సెట్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి ర్యాంక్ రావడంతో బెంగళూరులోనే టాప్–2 కాలేజీలో ఇంజినీరింగ్ సీటు వచ్చింది. దురదృష్టవశాత్తూ తండ్రికి వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆమెను చదివించలేక గ్రామానికి దగ్గరల్లోని కాలేజీలో చేరమన్నారు. అయినా అనుష ఏ మాత్రం వెనక్కు తగ్గకుండా ధైర్యంగా ముందుకు సాగింది. కష్టపడి చదివి ఇంజినీరింగ్ పూర్తి చేసి, క్యాంపస్ సెలక్షన్స్‌లో మంచి ఐటీ ఉద్యోగాన్ని సంపాదించింది.



ఉద్యోగం వదిలేసి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ తన ప్రతిభా పాటవాలతో ఐటీ ఉద్యోగిగా ఎదిగిన అనుషకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఎంతో మక్కువ. టీవీ, స్టేజిషోల మీద జరిగే డ్యాన్స్ కార్యక్రమాన్ని చూసి డ్యాన్స్ నేర్చుకునేది. డ్యాన్స్‌పై ఉన్న ఆసక్తి రోజురోజుకి పెరగడంతో డ్యాన్స్ సాధన మరింతగా చేయాలనుకున్నప్పటికీ, ఉద్యోగరీత్యా డ్యాన్స్ ప్రాక్టీస్ చేసే తీరిక ఉండేది కాదు. మరోపక్క కుటుంబ అవసరాలకు ఆర్థికంగా అండగా ఉండాల్సిన పరిస్థితి. దీంతో కొన్నిరోజులు డ్యాన్స్‌ను పక్కన పెట్టింది. 2015లో ఓ ప్రోగ్రామ్‌లో సౌరభ్ పరిచయమయ్యాడు. సౌరభ్ ఐటీ ఉద్యోగిగా పనిచేస్తూనే డ్యాన్స్ టీచర్‌గా చేసేవాడు. అభిరుచులు ఒకటే కావడంతో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి, పెళ్లితో ఒకటయ్యారు. తర్వాత ఇద్దరూ కలిసి 2020లో 'జోడీ అనురాభ్' పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. వారాంతాల్లో ఇద్దరూ వివిధ రకాల డ్యాన్స్ చేసి, వీడియోలను పోస్టు చేసేవారు. వీటికి వీక్షకుల నుంచి మంచి స్పందన లభించేది. ఇలా కొంతకాలం పాటు చేశాక ఇద్దరూ తమ తమ ఉద్యోగాలను వదిలేసి పూర్తి సమయాన్ని డ్యాన్స్‌కు కేటాయించారు. వీరి నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. అయినా వెనక్కి తగ్గలేదు. తమ నిర్ణయానికి కట్టుబడి డ్యాన్స్ వీడియోలు పోస్టు చేస్తూ నాలుగు లక్షలమంది అభిమానులను సొంతం చేసుకున్నారు. రకరకాల డ్యాన్స్ స్టెప్పులతో లక్షల వ్యూస్, అభిమానులతో ఇన్‌ఫ్లుయెన్సర్స్‌గా రాణిస్తున్నారు. లక్షల జీతం లేకపోయినప్పటికీ తమను అభిమానించే వారు లక్షల్లో ఉన్నారని ఈ జోడీ తెగ సంతోష పడిపోతోంది.

కిచెన్ టిప్స్

● అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయ, టమోటా ముక్కలు తీసుకుని మిక్సీలో పేస్టులా గ్రైండ్ చేసుకోవాలి. ఆయిల్ వేడిచేసి ఈ పేస్టును వేసి..ఆయిల్ పైకి తేలేంత వరకు వేగనివ్వాలి. తరువాత చల్లారనిచ్చి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేసుకోవాలి. ఇంటికి ఎవరైనా సడన్‌గా అతిథులు వచ్చినా, బిజీగా ఉన్నప్పుడు మసాలా తయారు చేసే సమయం ఉండదు కాబట్టి.. అప్పుడు ఈ మసాలా పేస్టును కూరల్లో వేసి వండితే డిష్ త్వరగా తయారవ్వడమేగాక, ఎంతో రుచికరంగా ఉంటుంది.



● గోబీ మంచూరియా చేసేముందు, క్యాలీఫ్లవర్ ముక్కలను సన్నగా తురుముకోవాలి. ఈ తురుముకు కొద్దిగా ఉప్పు కలిపి పక్కన పెట్టుకోవాలి. 15 నిమిషాల తరువాత తురుమును పిండితే దానిలోని నీరంతా పోతుంది. ఇలా నీరు పిండిన గోబీ తురుమును గుండ్రని బాల్స్‌లా చేస్తే మంచూరియా బాగా వస్తుంది.



బ్యూటిప్స్

గ్రీన్ టీ మాస్క్!



కప్పు గ్రీన్ టీలో రెండు స్పూన్ల బియ్యం పిండి, అర స్పూను తేనె వేసి బాగా కలిపి ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాలపాటు ఆరనిచ్చి, తరువాత ఐదు నిమిషాలపాటు ముఖంపైన గుండ్రంగా మర్దనా చేసి తరువాత కడగాలి. వారానికి రెండు సార్లు ఈ మాస్క్ వేసుకుంటే ముఖ నిగారింపు మెరుగుపడుతుంది.

లెమన్ మాస్క్!

శనగపిండి, పసుపు, నిమ్మరసం, పచ్చిపాలను ఒక్కోస్పూను తీసుకుని మెత్తని పేస్టులా కలుపుకోవాలి. ఈ పేస్టును ముఖానికి రాసి మర్దనా చేసుకోవాలి. 20 నిమిషాల తరువాత చల్లటి నీళ్లతో కడగాలి. ఇలా చేయడం వల్ల ముఖచర్మం శుభ్రపడి ఆరోగ్యంగా ఉంటుంది.





స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు	సెన్సెక్స్ ▲ 147	59,107
	నిఫ్టీ ▲ 25	17,512

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (తారెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	10,624	▽ 149
డోజోన్స్	30,281	▽ 243
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,925	▽ 12
డాక్స్	12,741	▽ 24
షాంఘై	3,044	▽ 37
నికాయ్	27,257	▲ 101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,236 ▽ 126
బంగారం (99.5 స్వచ్ఛత)	50,035 ▽ 125
వెండి (కిలో)	55,606 ▲ 404

జోయాలుక్కాస్‌లో దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ దీపావళి సందర్భంగా జ్యువెలరీ కొనుగోళ్లపై ప్రత్యేకమైన క్యాష్ బ్యాక్ ఆఫర్లను ప్రకటించింది. రూ.50,000 అంతకుపైబడిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాలను కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.2,000 విలువైన గిఫ్ట్ వోచర్‌ను ఇవ్వనుంది. అలాగే రూ.50,000, అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి రూ.1,000 విలువ గల గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి ఆభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్‌బీఐ డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు జరిపిన వారికి 5 శాతం రాయితీ కూడా ఇస్తుంది. ఈ నెల 24 వరకు ఈ ఆఫర్ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని షోరూమ్‌లలో అందుబాటులో ఉంటుందని జోయాలుక్కాస్ తెలిపింది.

క్రోమా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ఆఫర్లు



హైదరాబాద్: టాటా గ్రూపునకు చెందిన క్రోమా దీపావళి పండగ సందర్భంగా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' పేరుతో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు అందిస్తుంది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై 20% వరకూ క్యాష్‌బ్యాక్, రెండేళ్ల కాలపరిమితితో అతి సులభమైన ఈఎంఐ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపింది. పలు బ్యాంక్ కార్డులపై పదిశాతం తక్షణ డిస్కౌంట్ లభిస్తుంది. దేశవ్యాప్తంగా క్రోమా స్టోర్లతో పాటు www.croma.com వెబ్‌సైట్‌లో ఈ ఆఫర్లు అక్టోబర్ 30 వరకు అమల్లో ఉంటాయని పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
20-10-2022	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	444-00
విజయవాడ	444-00
రిటైల్ ధర (డజను)	66.00
19-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

ఇండస్‌ఇండ్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 1,805 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 57 శాతం జంప్‌చేసి రూ. 1,805 కోట్లను అధిగమించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో కేవలం రూ. 1,147 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 9,792 కోట్ల నుంచి రూ. 10,719 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 8,708 కోట్లను తాకింది.

స్టాండెలోన్ ఇలా

క్యూ2లో ఇండస్‌ఇండ్ బ్యాంక్ స్టాండెలోన్ నికర లాభం 60 శాతంపైగా పురోగమించి రూ. 1,787 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 9,491 కోట్ల నుంచి రూ. 10,719 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.77 శాతం నుంచి 2.11 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.8 శాతం నుంచి 0.61 శాతానికి మెరుగుపడ్డాయి. కన్సాలిడేటెడ్ ఫలితాలలో అనుబంధ కంపెనీ భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, సహచర సంస్థ ఇండస్‌ఇండ్ మార్కెటింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ పనితీరు కలసి ఉన్నట్లు బ్యాంక్ పేర్కొంది. మొండి రుణాలు, కంటింజెన్సీలకు కేటాయింపులు రూ. 1,707 కోట్ల నుంచి రూ. 1,141 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 0.4 శాతం నీరసించి రూ. 1,218 వద్ద ముగిసింది.

అల్ట్రాటెక్ లాభం డౌన్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) రెండో త్రైమాసికంలో ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 42% క్షీణించి రూ.759 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2021-22) ఇదే కాలంలో రూ. 1,310 కోట్లకుపైగా ఆర్జించింది. ఆదాయం మాత్రం 16% వృద్ధితో రూ. 13,893 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 12,017 కోట్ల టర్నోవర్ సాధించింది. ఇంధన వ్యయాలు పెరిగిపోవడం, లాభదాయకత తగ్గడంతో నిర్వహణ మార్జిన్లు 14%కి పరిమితమైనట్లు కంపెనీ పేర్కొంది.



ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు 1 శాతం బలపడి రూ. 6,398 వద్ద ముగిసింది.

నెస్లే డివిడెండ్ రూ.120

క్యూ3 లాభం 8 శాతం అప్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2022) మూడో త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ3)లో నికర లాభం 8 శాతం బలపడి రూ. 668 కోట్లను అధిగమించింది. గతేడాది(2021) ఇదే కాలంలో రూ. 617 కోట్లు ఆర్జించింది. నికర అమ్మకాలు సైతం 18 శాతం వృద్ధితో రూ. 4,591 కోట్లను తాకాయి. గత క్యూ3లో రూ. 3,883 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీ క్యాలెండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. వాటాదారులకు రెండో మధ్యంతర డివిడెండ్ కింద షేరుకి రూ.120 చెల్లించేందుకు బోర్డు అనుమతించినట్లు నెస్లే ఇండియా వెల్లడించింది.

త్రైమాసిక రికార్డ్..: గత ఐదేళ్లలో ఒక త్రైమాసికానికి అమ్మకాల్లో అత్యధిక వృద్ధిని అందుకున్నట్లు ఈ సందర్భంగా నెస్లే ఇండియా చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ తెలియజేశారు. దేశీ అమ్మకాలు 18 శాతంపైగా ఎగసి రూ. 4,361 కోట్లను దాటాయి.

కస్టమర్ల వద్దకే నెస్లే

మైనెస్లే పేరుతో డైరెక్ట్ టు కంజ్యూమర్ (డీ2సీ) విభాగంలోకి (ఆన్‌లైన్) కంపెనీ ప్రవేశించింది. తొలుత ఢిల్లీ రాజధాని ప్రాంత కస్టమర్లకు ఈ సేవలను పరిచయం చేయనున్నారు. తరువాత దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని నెస్లే ఇండియా సీఎండీ సురేశ్ నారాయణన్ వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు 2 శాతం లాభపడి రూ. 19,800 వద్ద ముగిసింది.

2 వారాల్లో 82 నుంచి 83

- మరో చరిత్రాత్మక కనిష్టానికి రూపాయి
- ఒకేరోజు 60 పైసలు నష్టం
- ఈ ఒక్క నెలలోనే 2 శాతం డౌన్
- ఫారెక్స్ అవుట్‌ఫ్లోస్, డాలర్ ఇండెక్స్ బలోపేతం నేపథ్యం



ముంబై: అమెరికా కరెన్సీ డాలర్ మారకంలో రూపాయి విలువ చరిత్రాత్మక పతనం కొనసాగుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో బుధవారం రూపాయి మారకం విలువ 60 పైసలు పడిపోయి 83 స్థాయి వద్ద ముగిసింది. ఒక దశలో 83.01 స్థాయిని కూడా చూసింది. రూపాయి మంగళవారం ముగింపు 82.40. బుధవారం ట్రేడింగ్‌ను 82.32 వద్ద ప్రారంభించినప్పటికీ, ఈ స్థాయిలో నిలబడలేక లాభాలను వదులుకుంది. సెప్టెంబర్ 22 తర్వాత రూపాయి ఒకేరోజు 60 పైసలు పడిపోవడం ఇదే తొలిసారి. అలాగే అక్టోబర్ 6వ తేదీన రూపాయి 82ను చూసింది. 14 రోజులు తిరిగే సరికి 100 పైసలు నష్టపోయి, 83 స్థాయిని చూసింది. కేవలం ఈ నెల ఇప్పటి వరకూ గడచిన 20 రోజుల్లో రూపాయి 2 శాతం (160 పైసలు) నష్టపోయింది.

ప్రతికూలతలు ఇవీ...

- రూపాయి తీవ్ర నష్టానికి డాలర్ ఇండెక్స్ బలోపేతం ప్రధాన కారణం. అమెరికా వడ్డీరేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల్లో డాలర్లలోకి పెట్టుబడుల వరద, వెరసి అమెరికాకు డాలర్ ఇన్‌ఫ్లోస్ డాలర్ ఇండెక్స్‌కు బలాన్ని ఇస్తున్నాయి. అమెరికాలో వడ్డీరేట్ల మరింత పెంపు ఖాయమనడానికి సూచనగా బాండ్లు ఈల్డ్స్ 14 యేళ్ల గరిష్ట స్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో డాలర్ ఇండెక్స్ 20 సంవత్సరాల గరిష్ట స్థాయిలో ట్రేడవుతోంది. ఈ వార్త రాస్తున్న రాత్రి 10 గంటల సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఆరుకరెన్సీల (యూరో, స్విస్ ఫ్రాంక్, జపనీస్ యన్, కెనడియన్ డాలర్, బ్రిటన్ పౌండ్, స్వీడిష్ క్రోనా) ప్రాతిపదిక లెక్కించే డాలర్ ఇండెక్స్ 20యేళ్ల గరిష్ఠం 113 వద్ద ట్రేడవుతోంది. రూపాయి విలువ భారీ నష్టంతో 83.11 వద్ద ట్రేడవుతోంది. ఇక డాలర్ మారకంలో బుధవారం జపాన్ యన్ 32 యేళ్ళ కనిష్ఠం 150కి పడిపోతే, యూరో 0.8 శాతం నష్టపోయింది. పౌండ్ విలువ 0.6 శాతం తగ్గింది.
- ఇక అంతర్జాతీయంగా కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, పటిష్ట స్థాయిలో కొనసాగుతున్న క్రూడ్ ధరలు, ఈక్విటీ మార్కెట్ల బలహీన ధోరణి, ఫారిన్ ఫండ్ అవుట్‌ఫ్లోస్ రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. భారత్‌లో విదేశీ వ్యవస్థాగత ఇన్వెస్టర్ల ఈక్విటీ మార్కెట్ల అమ్మకాలు బుధవారం రూ.454 కోట్లు.

బంగారం వెనకడుగు..

డాలర్‌లోకి నిధులు తరలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం అంతర్జాతీయ మార్కెట్లో బలహీనంగా ట్రేడవుతోంది. ఈ వార్త రాస్తున్న సమయంలో పసిడి ఔన్స్ (31.1 గ్రాము) ధర న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో 23 డాలర్లు తగ్గి 1632 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది. అయితే ఆర్థిక మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో దీర్ఘకాలంలో పసిడిలో పెట్టుబడులకు ఇది సమయమని నిపుణులు సూచిస్తున్నారు.

17,500 పైకి నిఫ్టీ

- 59వేల ఎగువకు సెన్సెక్స్
- అధిక వెయిటేజీ షేర్ల అండ
- సూచీలకు నాలుగోరోజూ లాభాలే



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఐటీసీ ర్యాలీతో స్టాక్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 147 పాయింట్లు పెరిగి 59,107 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25 పాయింట్లు బలపడి 17,512 వద్ద నిలిచింది. ప్రైవేట్ బ్యాంక్స్, ఫైనాన్స్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, రియల్టీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, మెటల్, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సూచీలు ఉదయం సానుకూలంగా ట్రేడింగ్ ప్రారంభించాయి. నేడు వీక్లీ డెరివేటివ్స్ ముగింపు కారణంగా మిడ్ సెషన్ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. ఆఖర్లో అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ అండతో బుధవారం లాభాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,961-59,400 పరిధిలో కదలాడింది. నిఫ్టీ 17,487 - 17,608 శ్రేణిలో ట్రేడైంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.454 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.908 కోట్ల షేర్లను అమ్మేశారు. ప్రపంచ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ట్రేడ్ అవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఇండెక్సుల్లో అధిక వెయిటేజీ ఉన్న రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ షేర్లు 2%..., హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒకశాతం చొప్పున రాణించాయి.
- ఏరోస్పేస్ ఉపకరణాల తయారీకి బోయింగ్ ఇండియా వ్యాపార ఒప్పందాన్ని కుదుర్చుకోవచ్చనే వార్తల నేపథ్యంలో మిశ్ర ధాతు నిగమ్ (మిధాని) షేరు మూడు శాతం లాభపడి రూ.249 వద్ద స్థిరపడింది.
- పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార విభజనలో భాగంగా ఏర్పడిన కొత్త కంపెనీ పిరమల్ ఫార్మా షేర్లు లిస్టింగ్ తొలిరోజే నిరాశపరిచాయి. బీఎస్‌ఈలో రూ.201.80 వద్ద లిస్టయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే ఐదుశాతం క్షీణించి రూ.191.75 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. పిరమల్ ఎంటర్‌ప్రైజెస్(పీఈఎల్) నుంచి ఫార్మాస్యూటికల్స్ వ్యాపారాన్ని విడదీసి, ప్రత్యేక సంస్థగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయడానికి గత ఏడాది అక్టోబర్‌లో (పీఈఎల్) డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఎస్ఐ, గురుగావ్‌లో 40 సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

గురుగావ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ).. సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **అర్హత:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ)లో సభ్యులుగా ఉండాలి. **వయసు:** 31 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.33,000 నుంచి రూ.40,000 చెల్లిస్తారు.
» **కాంట్రాక్ట్ వ్యవధి:** ఒక ఏడాది
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.10.2022
» **వెబ్‌సైట్:** www.icsi.edu.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 12 ఐటీ ప్రొఫెషనల్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా ఐటీ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **విభాగాలు:** క్లౌడ్ ఇంజనీర్, అప్లికేషన్ ఆర్కిటెక్ట్, ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్, ఇంటిగ్రేషన్ ఆర్కిటెక్ట్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 10 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2022
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సీఎస్ఐఆర్-ఏఎంపీఆర్ఐ, భోపాల్‌లో 11 పోస్టులు

భోపాల్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్.. సీఎస్ఐఆర్‌కి చెందిన అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ ప్రాసెస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎంపీఆర్ఐ).. ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:**ప్రాజెక్ట్ అసోసియేట్1-05, ప్రాజెక్ట్ అసోసియేట్ 2-03, ప్రాజెక్ట్ అసిస్టెంట్-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్సీ/డిప్లొమా/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ తేది:** 02.11.2022 (ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు)
» **వెబ్‌సైట్:** ampri.res.in

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీలో 16 సైట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. సైట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **అర్హత:** బీఈ/బీటెక్/డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 10 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,10,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేజీఎం/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ- 110017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.11.2022
» **వెబ్‌సైట్:** www.ircon.org

నాల్కో, ఒడిశాలో 19 పోస్టులు

ఒడిశాలోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో) వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 19
» **పోస్టులు:** సీఓఓ, సీఎఫ్ఓ, ప్రాజెక్ట్ మేనేజర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, సివిల్ ఇంజనీర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/పీజీ డిగ్రీ/డిప్లొమా/ఎంబీఏ/సీఎంఏ/సీఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం 2 నుంచి 15 ఏళ్ల అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 నుంచి 62 ఏళ్ల వరకు ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.30,000 నుంచి రూ.1,00,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, నాల్కో ఫౌండేషన్, నాల్కో భవన్, పీ-1, నయాపల్లి, భువనేశ్వర్-751013, ఒడిశా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.10.2022
» **వెబ్‌సైట్:** www.nalcoindia.com



లా స్పెషల్

క్లాట్‌కు.. కదలండిలా!

కామన్ లా అడ్మిషన్ టెస్ట్.. క్లాట్‌గా సుపరిచితం! జాతీయ స్థాయిలోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా యూనివర్సిటీల్లో.. ఐదేళ్ల బీఏ-ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. క్లాట్‌లో ప్రతిభ చూపి.. నేషనల్ లా యూనివర్సిటీల్లో కోర్సు పూర్తి చేసుకుంటే..న్యాయవాద వృత్తితో పాటు.. కార్పొరేట్ రంగంలోనూ.. కొలువుదీరొచ్చు. ఇంతటి కీలకమైన క్లాట్‌లో రాణించేందుకు అభ్యర్థులు తమ సన్నద్ధతకు పదును పెట్టుకోవాల్సిన సమయం! ఎందుకంటే.. పరీక్ష తేదీ సమీపిస్తుండడమే! క్లాట్-2023 పరీక్ష డిసెంబర్ 18న జరగనుంది. ఈ నేపథ్యంలో.. క్లాట్ వివరాలు, ప్రత్యేకతలు, పరీక్షలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం...

» నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశాలకు క్లాట్
» డిసెంబర్ 18న ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష
» బీఏ-ఎల్‌ఎల్‌బీ,ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో చేరే అవకాశం
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

న్యాయ విద్య అంటే ఎల్‌ఎల్‌బీ లేదా ఎల్‌ఎల్‌ఎం. ఈ కోర్సులు పూర్తి చేస్తే న్యాయవాద వృత్తిలోనే కొనసాగాలనే అభిప్రాయం ఉండేది. అదంతా గతం. కాని నేటి కార్పొరేట్ ప్రపంచంలో న్యాయ నిపుణులకు బహుళజాతి సంస్థల్లో కొలువులు లభిస్తున్నాయి. ఈ కోర్సుల బోధనలో ప్రసిద్ధిగాంచిన నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్‌కు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

22 నేషనల్ లా యూనివర్సిటీలు

క్లాట్ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా 22 నేషనల్ లా యూనివర్సిటీల్లో.. అయిదేళ్ల వ్యవధిలోని ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్‌ఎల్‌బీ ప్రవేశాలకు క్లాట్-యూజీ, ఎల్‌ఎల్‌ఎం ప్రవేశాలకు క్లాట్-పీజీ పేరుతో వేర్వేరుగా పరీక్షలు ఉంటాయి.

అర్హతలు

- **క్లాట్-యూజీ:** కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **క్లాట్-పీజీ:** అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి.

క్లాట్-యూజీ ఇలా

- క్లాట్-యూజీని ఆఫ్‌లైన్ విధానంలో అయిదు సబ్జెక్ట్‌లలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 28 నుంచి 32ప్రశ్నలు; జీకే అండ్ కరెంట్ అఫైర్స్35 నుంచి 39ప్రశ్నలు;లీగల్ రీజనింగ్ 35నుంచి 39 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్ 28 నుంచి 32 ప్రశ్నలు;క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 13నుంచి 17 ప్రశ్నలు అడుగుతారు.పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్‌లలో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలోనూ గ్రాఫ్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఎదురవుతాయి.

క్లాట్-పీజీ.. 120 మార్కులు

- బీఏ-ఎల్‌ఎల్‌బీ, లేదా ఎల్‌ఎల్‌బీ అర్హతగా నేషనల్ లా యూనివర్సిటీల్లోని ఎల్‌ఎల్‌ఎం స్పెషలైజేషన్లలోని సీట్ల భర్తీకి క్లాట్-పీజీ నిర్వహిస్తారు. ఈ పరీక్ష 120 ప్రశ్నలతో.. 120 మార్కులకు ఉంటుంది. ఇందులోనూ ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలుగా అడుగుతారు.
- క్లాట్ పీజీలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

విజయం సాధించాలంటే

క్లాట్-యూజీ

క్లాట్ యూజీలో ఉండే అయిదు సెక్షన్లలోనూ మెరుగైన ప్రతిభ చూపేందుకు ఆయా సిలబస్ అంశాలపై సమగ్ర ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరిశీలించే ఈ సబ్జెక్ట్‌లో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో రాణించడానికి కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై అవగాహన పెంచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ఈ ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం ముఖ్యం. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్, ఇతర ముఖ్య ప్రచురణలు నిత్యం చదవాలి.

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్

సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సులు గురించి పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.

లీగల్ రీజనింగ్

న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే ఈ విభాగంలో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు, ఫ్యాక్ట్స్, వాటి ద్వారా చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవడం ఈ విభాగంలో మంచి మార్కులకు దోహదం చేస్తుంది.

లాజికల్ రీజనింగ్

తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండే విభాగం ఇది. ఇందులోనూ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. దీంతోపాటు అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానం ప్రశ్నలు కూడా అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్

ఈ విభాగంలో రాణించేందుకు పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజ్, రేషియో తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

క్లాట్ పీజీలో ఇలా

క్లాట్ పీజీలో విజయానికి..అభ్యర్థులు తాజా ముఖ్యమైన తీర్పులు,రాజ్యాంగ,శాసనపరమైన అంశాలు, చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం కూడా ఈ పరీక్షలో స్కోర్‌కు దోహదం చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేది:** నవంబర్ 13, 2022
- **క్లాట్ పరీక్ష తేదీ:** డిసెంబర్ 18, 2022
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat-2023

నేషనల్ లా యూనివర్సిటీలు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా-బెంగళూరు; నల్సార్-హైదరాబాద్; నేషనల్ లా యూనివర్సిటీ-భోపాల్; వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్-కోల్‌కత; నేషనల్ లా యూనివర్సిటీ-జోధ్‌పూర్; హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ-రాయ్‌పూర్; గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ-గాంధీనగర్; డా॥రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ-లక్నో; రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా-పంజాబ్;చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ-పాట్నా; నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్-కొచి; నేషనల్ లా యూనివర్సిటీ-కటక్(ఒడిశా); నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా-రాంచి; నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యూరిడికల్ అకాడమీ-అసోం; దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ-విశాఖపట్నం; తమిళనాడు నేషనల్ లా స్కూల్-తిరుచిరాపల్లి; మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ-ముంబై; మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ-నాగ్‌పూర్; మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ-ఔరంగాబాద్; హిమాచల్‌ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ-సిమ్లా;ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ(ఎంపీడీఎన్ఎల్‌యూ)-జబల్‌పూర్;డాక్టర్‌బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ లా యూనివర్సిటీ-సోనేపట్, హర్యానా.

విస్తృత అవకాశాలు

క్లాట్‌లో విజయంతో నేషనల్ లా యూనివర్సిటీల్లో చేరి కోర్సులు పూర్తిచేసుకున్న అభ్యర్థులు కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, పలు దేశాల మధ్య కంపెనీల ఒప్పందాలతో జరుగుతున్న కార్యకలాపాల నేపథ్యంలో సంస్థలు న్యాయ నిపుణులను నియమించు కుంటున్నాయి. అదే విధంగా క్లాట్‌కు పోటీ కూడా పెరుగుతోంది.కాబట్టి అభ్యర్థులు మెరుగైన స్కోర్ సాధించే విధంగా ఇప్పటి నుంచే కృషి చేయాలి.

– ప్రొ॥ వి.బాలకిష్టారెడ్డి,
ఇంచార్జ్ వీసీ, నల్సార్, హైదరాబాద్

నేడు విజయవాడలో 'వ్యవసాయదారుల' సమ్మేళనం

సాక్షి, అమరావతి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, విదేశీ కొలువులు వదిలి వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణిస్తోన్న యువరైతులంతా విజయవాడలో సమావేశమవుతున్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని అయోధ్య నగర్‌లోని హైందవి సమావేశ మందిరంలో ఈ నెల 20న విద్యావంతులైన వ్యవసాయదారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణంరాజు చెప్పారు. ఇటీవల కాలంలో ఉన్నత విద్యనభ్యసించి దేశ విదేశాల్లో స్థిరపడిన విద్యావంతులు ఎంతో మంది సాగుబాట పట్టారని, వారు సాధిస్తోన్న విజయాలను, పొందిన అనుభవాలను నేటి యువతరానికి తెలియజేసే లక్ష్యంతో వారందర్నీ ఒక వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు 150 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్న ఈ సమ్మేళనంలో వ్యవసాయ మార్కెటింగ్, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, నాబార్డు మాజీ చైర్మన్ గోవిందరాజుతో పాటు పలువురు మేధావులు పాల్గొంటారు.

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులుగా ముగ్గురు నియామకం

చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆహార కమిషన్‌కు ప్రభుత్వం ముగ్గురు సభ్యులను నియమించిందని చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం కమిషన్ కార్యాలయంలో స్టేట్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జాతీయ ఆహార భద్రత చట్టం–2013ను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సభ్యులుగా బి.కాంతారావు, లక్ష్మీరెడ్డి ఇండేల, జక్కంపూడి కృష్ణకిరణ్‌ను నియమించామని, త్వరలో మరో ఇద్దరు సభ్యుల నియామకం చేపడతామని చెప్పారు. వాట్సాప్ నంబర్ 94905 51117కు వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలకు సిఫారసు చేస్తున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్, ఆహార కమిషన్ మెంబర్ సెక్రటరీ విజయసునీత పాల్గొన్నారు.

చీరమీను..
రుచి అదిరేను


చిట్టిచేప.. గోదావరి ప్రత్యేకం
- సైజు అంగుళం.. బిందె రూ.30 వేల పైమాటే..
- పులస తర్వాత స్థానం దీనిదే..
- విశాఖ, హైదరాబాద్‌తో పాటు ఫ్రాన్స్‌కు రవాణా
- ఏడాదిలో మూడు వారాలే లభ్యం


చీరమీను

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఇండో పసిఫిక్ ప్రాంతంలో లభించే అరుదైన చేప జాతి చీరమీను. రొయ్య పిల్లలను పోలి ఉన్నా అది చేప జాతి. గోదావరికి ప్రత్యేకం. పులస తర్వాత స్థానం దీనిదే. ఏడాదిలో సీజన్‌గా మూడు వారాలు మించి దొరకదు. అంగుళమే ఉన్నా రుచిలో అదరగొడుతుంది. ధరలో బంగారంతో పోటీపడుతుంది. చీరమీను అక్టోబర్లోనే గోదావరి ఒడ్డున దొరుకుతుంది. దసరా నుంచి దీపావళి మధ్య లభించే చీరమీను మహా అయితే నాగులచవితి వరకూ మాత్రమే లభిస్తుంది. మత్స్యకారులు గోదావరి ఒడ్డున చీరలతో పట్టుకుంటారు. అందుకే ఈ చేపను గోదారోళ్లు చీరమీనుగా పిలుస్తారు.

సముద్రనీరు, గోదావరి కలిసే చోట..

శాస్త్రీయంగా సారిడా గ్రాసిలిస్, టంబిల్, ఆండో స్క్వామిస్ జాతులకు చెందిన పిల్ల చేపల్నే చీరమీను అంటారు. సముద్రనీరు, గోదావరి కలిసే బురద నీటి మడుగుల్లో ఎక్కువగా లభిస్తాయి. మడ అడవులు ఎక్కువగా పెరిగే ప్రాంతాల్లోని నీళ్లలో ఆక్సిజన్ శాతం అధికంగా ఉండటంతో ఆ జాతి చేపలు ఆ ప్రాంతానికి వెళ్లి గుడ్లు పెడతాయి. గుడ్లు పిల్లలుగా మారి ఒకేసారి సమూహంగా గోదావరి ఒడ్డున ఈదుతుంటాయి. ఇవి పాండిచ్చేరి కేంద్రపాలిత యానాం, కోనసీమలోని భైరవపాలెం, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపాలెం, అంతర్వేది ప్రాంతాల్లో లభిస్తాయి. గౌతమీ గోదావరి యానాం వద్ద బంగాళాఖాతంలో భైరవపాలెం సమీపంలో కలుస్తుంటుంది. ఈ ప్రాంతంలో చీరమీను ఎక్కువగా లభిస్తుంది. పులస మాదిరిగానే రూ.వేలకు వేలు పెట్టినా సీజన్‌లో చీరమీను తినాల్సిందేనంటారు. అరుదుగా దొరికే ఈ చీరమీనును ఇటీవల బకెట్లు, బిందెల్లో విశాఖపట్నం, హైదరాబాద్‌తో పాటు ఫ్రాన్స్ దేశానికి కూడా పంపిస్తున్నారు. వీటిని తవ్వ, సేరు, కుంచం, బిందెలతో కొలిచి అమ్ముతున్నారు. ప్రస్తుతం సేరు(కిలో) చీరమీను రూ.1500 నుంచి రూ.2000 పలుకుతోంది. బిందె రూ.30వేలు పైమాటే. చింతచిగురు–చీరమీను, చీరమీను–మామిడికాయ, చీరమీను–గోంగూర ఇలా కలగలుపు వంటల్లో వినియోగిస్తారు.


సముద్రంలో సారిడా గ్రాసిలిస్

గోదావరికే ప్రత్యేకం

సముద్రం వైపు నుంచి వీచే తూర్పు గాలులకు నది ఒడ్డున చీరమీను లభ్యమవుతుంది. ఇది గోదావరిలో మాత్రమే యానాం పరిసర ప్రాంతాల్లో అరుదుగా లభిస్తుంది. వీటిని ఆకాశంలో ఎగిరే పక్షులు చూసి తింటుంటాయి. చీరల్లో మాత్రమే లభిస్తాయి. శాస్త్రీయంగా సారిడా గ్రాసిలిస్, టంబిల్, ఆండో స్క్వామిస్ జాతులకు చెందిన పిల్ల చేపలే ఇవి.
–డాక్టర్ చంద్రశేఖర్, బయోలజీ హెడ్, ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల, యానాం


చింతకాయలతో తయారుచేసిన చీరమీను డిష్


చీరలతో చీరమీను పడుతున్న మత్స్యకారులు

ఇండియన్ అర్బన్ హౌసింగ్ కాంక్లేవ్‌లో ఏపీ స్టాల్

- గుజరాత్‌లో ప్రారంభమైన సమ్మిట్
- జగనన్న హౌసింగ్, టిడ్కో ఇళ్లపై ప్రజెంటేషన్

సాక్షి, అమరావతి : కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో జరుగుతున్న 'ఇండియన్ అర్బన్ హౌసింగ్ కాన్‌క్లేవ్–2022'లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక, ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ నేతృత్వంలోని బృందం బుధవారం పాల్గొంది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుండగా, మొదటి రోజు కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి హరదీప్‌సింగ్ పురి ప్రారంభించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కాన్‌క్లేవ్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేసింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రంలో పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు, వైఎస్సార్, జగనన్న కాలనీల నమూనాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. మన గృహ నిర్మాణ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ కాన్‌క్లేవ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో రాష్ట్రంలో పట్టణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను సైతం ప్రదర్శించినట్టు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. సమ్మిట్‌లో టిడ్కో డైరెక్టర్ రాఘవరావు, గృహ నిర్మాణ సంస్థ జేఎండీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు అర్బన్ హౌసింగ్ క్షేత్ర పర్యటనలో భాగంగా రాజకోట్‌లో నిర్మిస్తున్న జి+13 నిర్మాణాలను అజయ్ జైన్ ఆధ్వర్యంలో రాష్ట్ర బృందం పరిశీలించింది. దేశంలోని ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు అత్యధికంగా 31 లక్షల ఇళ్ల మంజూరుపై ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు వివరించినట్టు ప్రసన్నకుమార్ వివరించారు.


ఏపీ స్టాల్ వద్ద అజయ్ జైన్‌తో రాష్ట్ర బృందం

ఆప్కో నుంచి సరికొత్త డిజైన్లు

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌తో ఒప్పందం
- మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకున్న సంస్థలు
- ఈ ఒప్పందంతో 1,77,447 మంది చేనేత కార్మికులకు లబ్ధి


పరిశ్రమలు, జౌళిశాఖ మంత్రి అమరనాథ్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకున్న ఎన్ఐడీ, రాష్ట్ర జౌళిశాఖ అధికారులు

సాక్షి, అమరావతి: మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన డిజైన్లలో చేనేత వస్త్రాలను అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీఐఐసీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పరిశ్రమలు, జౌళిశాఖ మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో ఎన్ఐడీ, రాష్ట్ర జౌళిశాఖ అధికారులు ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేతలను ప్రోత్సహించే విధంగా దేశంలోనే మొదటిసారిగా ఇటువంటి ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. దీనిద్వారా 1,77,447 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మిల్లుల్లో తయారవుతున్న వస్త్రాల పోటీని తట్టుకునే విధంగా నూతన డిజైన్లు, నూతన టెక్నాలజీ వినియోగంలో ఎన్ఐడీ ఆప్కోకి సహకరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేల వంతున ఇప్పటివరకు రూ.776.13 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. వారిని ప్రోత్సహించేందుకు ఆప్కో షోరూంలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సుమారు రూ.58 కోట్ల టర్నోవర్ నమోదు చేసిన ఆప్కో ఈ ఏడాది రూ.100 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా వెంకటగిరిలో ఉన్న ప్రగట కోటయ్య ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. మార్కెట్ సర్వే నిర్వహించడం ద్వారా వినియోగదారులు కోరుకున్న విధంగా డిజైన్లను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ సర్వేలో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు జారీచేశారు.

పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక బ్రాండింగ్

- ఫిబ్రవరి పెట్టుబడుల సదస్సుకు ప్రత్యేక లోగో
- త్వరలో దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు, సమావేశాలు
- సమీక్షలో మంత్రి అమర్‌నాథ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రత్యేక బ్రాండింగ్‌పై దృష్టిసారిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా లోగో రూపొందించి దేశీయంగా, అంతర్జాతీయంగా రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల సదస్సు ఏర్పాట్లపై మంత్రి బుధవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించగలిగే రంగాల వారీగా పారిశ్రామికవేత్తలతో సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మారిటైమ్, అగ్రి–ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ, స్కిల్ డెవలప్‌మెంట్‌లపై త్వరలో భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. దక్షిణ కొరియా, తైవాన్, జపాన్, బ్రిటన్, అమెరికా, న్యూజిలాండ్ దేశాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు రోడ్‌షోలు నిర్వహించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. జనవరిలో దావోస్‌లో జరిగే సమావేశాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర అధికారుల బృందం వెళ్లి ఏపీలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నట్లు తెలిపారు. విశాఖ పెట్టుబడుల సదస్సు నిర్వహణ బాధ్యతలను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్‌కు అప్పగించిన నేపథ్యంలో ఆ ప్రతినిధులతో మంత్రి సమాలోచనలు జరిపారు. విద్యుత్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మెరైన్, మౌలికవసతులు, పోర్టులు, విమానయాన, డిఫెన్స్, నైపుణ్య రంగాలకు సంబంధించిన రోడ్‌షోలను మూడునెలల్లో పూర్తి చేయాలని కోరారు.

ఏపీఐఐసీ కార్యకలాపాలపై సమీక్ష

ఏపీఐఐసీ కార్యకలాపాలపై మంత్రి అమర్‌నాథ్ సమీక్షించారు. ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంక్, భూ కేటాయింపులు, ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల పురోగతిపై వివరాలు అడిగారు. పారిశ్రామిక పార్కుల్లో భూముల కేటాయింపుపై ఆరా తీశారు. 2019 నుంచి నేటివరకు 2,450 యూనిట్లకు 4,664 ఎకరాల భూమి కేటాయించినట్లు ఏపీఐఐసీ వీసీ, ఎండీ భరత్‌గుప్తా మంత్రికి తెలిపారు. వాటిలో ఇప్పటికే 64 పరిశ్రమలు ఉత్పత్తి దశలోకి వెళ్లాయని, 10 యూనిట్లు ట్రైల్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయని చెప్పారు. 2022–23లో రూ.330 కోట్ల ఆదాయం లక్ష్యంగా సాగుతున్నట్లు తెలిపారు. ఈఎంసీలు సహా రాష్ట్రవ్యాప్తంగా ముందుకు సాగుతున్న రూ.1,934 కోట్ల విలువైన 61 ఇంజనీరింగ్ పనుల పురోగతిని వివరించారు. ఇప్పటివరకు రూ.751.78 కోట్ల పనులు పూర్తిచేసినట్లు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



marico
మనందరిలో ఉన్నవాడు,
అతను ఎవరు?
ప్రతి రోజు సూర్యుడిని నిద్ర లేపేవాడు
పిచ్చుక, పావురం, కాకి, ఆవు, ఎద్దు
మనందరికీ ఆహారం ఇచ్చేవాడు, అతను ఎవరు?
ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్నాడు
పంట కొయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు, ఒక నదిలా తిరుగుతున్నాడు
దుంపల్లా, భూమి లో ఒదిగి పోయాడు
అతను ఎవరు?
మట్టి లో విత్తనం ల కలిసి పోయాడు
తేనీటిలో పంచదార లా కరిగి పోయాడు
బియ్యంలో, కొబ్బరి లో, పండ్లలో దాగి ఉంటాడు
అతను ఎవరు?
అతను సృష్టించేవాడు, అతను కడుపు నింపేవాడు
మనందరినీ పాలించేవాడు, నాలో మరి మీలో ఉండేవాడు
అతను ఎవరు?
అతను రైతు.
మారికోలో, కల్పవరిక్ష ఫౌండేషన్ ద్వారా , మేము రైతులతో కలిసి వాళ్ళ వ్యవసాయ దిగుబడులను పెంపొందించడానికి సహాయ పడతాము.
2026 నాటికి , 1,00,000 రైతులను పైగా చేరుకొని, ₹1,000 కోట్లకు పైగా వ్యవసాయ ఆదాయాన్ని అదనంగా పెంచుతాము
Parachute
Kalpavriksha
మనం పోషించేదే, పెరుగుతుంది
మరిన్ని వివరాలకై టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చెయ్యండి: 18002664646
మరిన్ని
వివరాలకై
స్కాన్
చెయ్యండి

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 20 । అక్టోబర్ । 2022



దేశీయ గోవుల క్షేత్రంలో కేరళ మంత్రి

పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలో దేశీయ గోవుల పెంపక క్షేత్రాన్ని కేరళ పశుసంవర్ధక శాఖ మంత్రి చించురాణితో కూడిన బృందం బుధవారం సందర్శించింది. -IIలో▸



రైతులు సంతృప్తి చెందేలా నష్ట పరిహారం

రైతులు సంతృప్తి చెందేలా నష్ట పరిహారం చెల్లిస్తామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ తెలిపారు. ఆమె భూసేకరణపై రైతులతో బుధవారం సమావేశమయ్యారు. -IIలో▸



ఏర్పాట్లు ముమ్మరం

ఈ నెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

విజయవాడ రూరల్: ఏపీపీఎస్సీ దేవదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్–3, రెవెన్యూ సర్వీసెస్ గ్రూప్–4, (జూనియర్ అసిస్టెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్) మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని ఏపీ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఉమ్మడి కృష్ణాజిల్లా సంచాలకులు సీహెచ్ లక్ష్మీదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, స్టయిపెండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని వివరించారు. ప్రిలిమినరీ పరీక్షల్లో మెరిట్ ఆధారంగా 60 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీలోగా విజయవాడలోని స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95050 94349, 99668 49937 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కృష్ణా జిల్లాలో 10.4 మి.మీ. వర్షపాతం

చిలకలపూడి (మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో బుధవారం 10.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పెదపారుపూడి మండలంలో 37.8, అత్యల్పంగా కోడూరు మండలంలో 0.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. మండలాల వారీగా.. గుడివాడలో 30.6 మిల్లీమీటర్లు, గుడ్లవల్లేరు 26.2, బంటుమిల్లి, పెడన 19.2, నందివాడ, పామర్రు 12.8, మచిలీపట్నం 11.8, మొవ్వ 9.8, ఘంటసాల 8.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బాపులపాడు మండలంలో 7.8 మిల్లీమీటర్లు, ఉయ్యూరు 7.6, గూడూరు 7.2, గన్నవరం 7.0, పమిడిముక్కల 6.8, కృత్తివెన్ను 5.8, ఉంగుటూరు 5.4, చల్లపల్లి, పెనమలూరు 5.2, కంకిపాడు 4.0, తోట్లవల్లూరు 3.6, అవనిగడ్డ 2.2, మోపిదేవి 1.4, నాగాయలంక మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

సీఎం సభకు సర్వం సిద్ధం

- నేడు అవనిగడ్డలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన
- పచ్చ తోరణాలు, భారీ కటౌట్లు, క్లాత్ ఫ్లెక్సీల ఏర్పాటు
- స్పందన అర్జీల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్
- 20 మంది బాధిత రైతులతో సీఎం ముఖాముఖి
- 1,350 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- సభకు వచ్చేవారి కోసం ప్రత్యేక బస్సులు, ఆటోలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే సింహాద్రి, ఎమ్మెల్సీ తలశిల, కలెక్టర్, ఎస్పీ



స్టాళ్ల వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు



సిద్ధమైన సభావేదిక

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిషేధిత భూముల సమస్యను పరిష్కరించిన నేపథ్యంలో అవనిగడ్డ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో గురువారం బహిరంగ సభ జరగనుంది. ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతూ పచ్చ తోరణాలు, భారీ కటౌట్లు, క్లాత్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎస్పీ పి. జాషువా, జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాలతో కలిసి కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సభాప్రాంగణం, హెలిప్యాడ్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ.. సీఎం పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. నిషేధిత భూముల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 35,600 ఎకరాల భూములకు చెందిన 22 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అవనిగడ్డలో జరిగే బహిరంగ సభలో సీఎం చేతుల మీదుగా రైతులకు క్లియరెన్స్ పత్రాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజల కోసం 500 బస్సులు ఏర్పాటు చేశామని, బస్సులు దిగిన తరువాత సభావేదిక వద్దకు చేరుకునేందుకు ఆటోలను సిద్ధం చేశామని వివరించారు.

ప్రత్యేక బందోబస్తు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకుని 1,350 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కృష్ణా ఎస్పీ పి.జాషువా తెలిపారు. డీఐజీ బాలరాజు పర్యవేక్షణలో నలుగురు అడిషనల్ ఎస్పీలు, 15 మంది డీఎస్పీలు బందోబస్తును పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. వేలాది మంది రైతులు, ప్రజలు తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

గురువారం ఉదయం 10.10 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు వేకనూరు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 గంటలకు వేకనూరులో బయలుదేరి 10.55 గంటలకు అవనిగడ్డ సభాస్థలికి చేరుకుంటారు. 10.55 నుంచి 11.05 గంటల వరకు స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం నిషేధిత భూముల సమస్య పరిష్కారంతో లబ్ధి పొందిన 20 మంది రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడి వారితో గ్రూపు ఫొటో దిగుతారు. అనంతరం సభావేదికకు వెళ్లి రైతులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, అధికారులు బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. సమస్యలపై అర్జీలు తీసుకునేందుకు ప్రత్యేక స్పందన కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే వారి కోసం తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీఓ కిశోర్, డీఈఓ తాహెరా సుల్తానాతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గగుడి మాస్టర్ ప్లాన్ సిద్ధం

ఆలయ పరిసరాల్లోనే భక్తులకు సదుపాయాలు ● దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆలయ పరిసరాల్లోనే భక్తులకు సకల సదుపాయాలు కల్పించేలా ఈ ప్లాన్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంత్రి బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అమ్మవారి ఆలయాన్ని ఆగమ శాస్త్రం, వాస్తు ప్రకారం అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అమ్మవారి ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా నిపుణులతో మాస్టర్ ప్లాన్ తయారు చేయించామన్నారు. సిద్ధమైన ప్లాన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ పరిసరాల్లోనే సకల సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునే ప్రదేశంలోనే సామగ్రిని భద్రపరుచుకునేందుకు క్లోక్‌రూమ్‌లు ఏర్పాటు చేసేలా నిర్మాణాలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఎవరైనా రాజగోపురం మీదగానే ఆలయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రసాదాల పోటు భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రసాదాల విక్రయ కేంద్రాలు, మరో వైపు లడ్డూ తయారీ పోటును ఏర్పాటు చేస్తామని వివరించారు. టీటీడీ తరహాలోనే దుర్గమ్మ లడ్డూ ప్రసాదం తయారీకి కొత్త టెక్నాలజీని వినియోగించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. దసరా ఉత్సవాలు, భవానీ దీక్ష విరమణల సమయంలో నాణ్యత దెబ్బతినకుండా లక్షల సంఖ్యలో లడ్డూలు తయారు చేసి, ప్యాకింగ్ చేసి అందించేలా అత్యాధునిక టెక్నాలజీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ మంత్రి దంపతులు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి వచ్చారు. మంత్రి దంపతులకు ఆలయ ఈఓ భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ అమ్మ వారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రేపు ట్రయల్ రన్

రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ● జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన



ఫ్యామిలీ డాక్టర్‌పై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ఈ నెల 21వ తేదీన ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసినితో కలిసి ఎన్టీఆర్ జిల్లాలోని పలు పీహెచ్‌సీల పరిధిలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ పరిధిలోని జూపూడి, మూలపాడు, జి.కొండూరు పీహెచ్‌సీ పరిధిలోని చేవూరు హెచ్‌డబ్ల్యూసీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ–సంజీవని, ఎన్‌సీడీ–సీడీ సర్వే, సెంటర్లలో ఉండాల్సిన 14 రికార్డులను తనిఖీ చేశారు. ప్రపంచ బ్యాంకు బృందం సందర్శనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం విజయవాడలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జిల్లాలోని గ్రామీణ ప్రాంత వైద్యాధికారులతో ఫ్యామిలీ డాక్టర్ విధానంపై జూమ్ సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. జిల్లా ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమ అధికారి డాక్టర్ మోతీబాబు, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు వైద్యులు డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ శ్రీకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షకుల వివరాలు కోరిన ఆర్జేడీ

మచిలీపట్నం: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ కేడర్‌కు చెందిన అధికారులు, ఉద్యోగుల సమగ్ర వివరాలను సత్వరమే అందజేయాలని ఆ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్ అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ) ఎంపీహెచ్‌ఈఓ, హెల్త్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్సు, పీహెచ్ఎన్(నాన్‌టీచింగ్), ఎంపీహెచ్ఎస్ (ఎం.ఎఫ్), డీపీఎంఓ, సీనియర్ అసిస్టెంట్ వివరాలను పంపించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సూపర్‌వైజర్ కేడర్‌కు చెందిన అధికారులు, ఉద్యోగుల వాస్తవ కేడర్ స్ట్రెంత్, ప్రస్తుతం పనిచేస్తున్న వారు, అందుబాటులో ఉన్న ఖాళీలు, ఆయా చోట్ల ఎంత కాలం నుంచి పని చేస్తున్నారనే సమగ్ర వివరాలను అందజేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేషనలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసిన నేపథ్యంలో ఏర్పాట్లు చకా చకా జరుగుతున్నాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే ప్రాతిపదికన పర్యవేక్షకులు ఉండేలా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పీహెచ్‌సీల వారీగా సూపర్‌వైజర్ కేడర్‌కు చెందిన అధి కారులు, ఉద్యోగుల జాబితాను అధికారులు సేకరిస్తున్నారు.

నున్న సమీపంలోని ఫారంలో పెరుగుతున్న కడక్‌నాథ్ కోళ్లు





- కొవ్వు తక్కువ.. రుచి ఎక్కువ
- ఔషధగుణాలతో ఆరోగ్యానికి మేలు
- కిలో మాంసం ధర రూ.1000కి పైనే..

కడక్‌నాథ్ కోడి.. భలే గిరాకీ

గుణదల (విజయవాడ తూర్పు): మాంసాహార ప్రియులు సరికొత్త రుచులను ఆస్వాదిస్తుంటారు. మటన్, చికెన్, చేపలు, రొయ్యలను ఇష్టంగా భుజిస్తారు. నాటు కోడి, బ్రాయిలర్, పెద్ద బ్రాయిలర్ (పేరెంట్స్) కోళ్ల మాంసం మార్కెట్‌లో లభిస్తోంది. ఇప్పుడు కడక్‌నాథ్ కోడి మాంసం మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. ధర ఎక్కువైనా మంచి పోషక విలువలతోపాటు రుచికరమైన ఈ మాంసాన్ని భుజించేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు.

కడక్‌నాథ్ కథ ఏమిటంటే..

కడక్‌నాథ్ రకానికి చెందిన కోళ్లు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయి. సాధారణంగా నాటుకోళ్లు వివిధ రంగుల్లో ఉంటాయి. కడక్‌నాథ్ కోళ్లు వాటికి భిన్నంగా ఈకలే కాదు శరీరం కూడా నలుపు రంగులో ఉంటాయి. మెలనిన్ అనే హార్మోన్ కారణంగా ఈ కోళ్లు నలుపు రంగులో ఉంటాయి. సాధారణ కోడి మాంసంతో పోలిస్తే కడక్‌నాథ్ కోడి మాంసంలో కొవ్వు శాతం చాలా తక్కువ. రుచి మాత్రం బాగుంటుంది. ఈ కారణంగా మాంసాహార ప్రియులు ఈ కోళ్లను ఇష్టపడుతున్నారు. ఈ కోళ్ల మాంసానికి మార్కెట్‌లో ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. కిలో మాంసం ధర రూ.1000 పైనే. అంటే మటన్ ధర కంటే కడక్‌నాథ్ కోడి మాంసం ధరే ఎక్కువ అన్నమాట.

పోషక విలువలు ఎక్కువే..

ధర ఎక్కువైనా మార్కెట్లో కడక్‌నాథ్ మాంసానికి అధిక డిమాండ్ ఉండటానికి కారణం పోషక విలువలే. కొలెస్ట్రాల్ శాతం తక్కువగా ఉండటంతో పాటు ప్రొటీన్, ఐరన్ శాతం ఎక్కువగా ఉంటుంది. కోడి గుడ్డులో సైతం అత్యధిక ప్రొటీన్లతో పాటు లినోలెయిక్ యాసిడ్స్ ఉంటాయి. ముఖ్యంగా ఈ కోళ్లకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. సాధారణంగా కోళ్లలో కనిపించే వ్యాధులు వీటి దరికి చేరవు.


ఎక్కడైనా బతుకుతాయి

కడక్ నాథ్ కోళ్లు కేవలం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే కాక అన్ని ప్రదేశాల్లోనూ జీవించగలవు. చిన్న చిన్న పురుగులతో కడుపు నింపుకోకుండా పోషక విలువలున్న ఆహారం తీసుకుంటాయి. కూరగాయలు, ఆకుకూరలు, రాగులు, సజ్జలు ఇలా వేటినైనా జీర్ణించుకోగలవు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న కడక్‌నాథ్ కోళ్లు రైతులకు అధిక లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ రంగంలో వీటికి డిమాండ్ అధికంగా ఉంది. అనేక మంది యువ రైతులు కడక్‌నాథ్ కోళ్ల ఫారాలు నిర్వహిస్తూ లాభాల బాటలో నడుస్తున్నారు. ఒక్కో కోడి నెలకు 10 నుంచి 18 గుడ్లు పెట్టడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ పిల్లలు పెరిగి వ్యాపారం వృద్ధి చెందుతోందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

పౌల్ట్రీ రంగంలో కడక్‌నాథ్ జాతి కోళ్లకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఈ రంగానికి మరింత చేయూత ఇచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కుదేలైన కోళ్ల ఫారాలను తెరిచి కడక్‌నాథ్ కోళ్ల పెంపకం పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ జాతి కోడి పిల్లలను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కడక్‌నాథ్ కోడి పిల్లలను ఇచ్చే దిశగా సమాలోచన చేస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా కడక్‌నాథ్ పౌల్ట్రీ ఫారాలు ఏర్పాటు చేయాలని పశు సంవర్ధక శాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి..



కడక్‌నాథ్ జాతి కోళ్లకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. 2017లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి 500 కడక్‌నాథ్ కోడి పిల్లలతో పౌల్ట్రీఫారం ఏర్పాటు చేశాను. నిర్వహణ వ్యయం పెద్దగా ఉండదు. ఆకుకూరలు, కూరగాయ ముక్కలు మూడు పూటలా ఉంటే చాలు. నాలుగు నెలల వ్యవధిలో కోడి మాంసానికి సిద్ధమవుతుంది. మార్కెట్‌లో ఉన్న డిమాండ్ కారణంగా అధిక సంఖ్యలో కోళ్లు అమ్ముడుపోతున్నాయి. నా వ్యాపారం లాభాల బాటలో నడుస్తోంది. ప్రభుత్వం మరింత చేయూతనిస్తే మరింత వృద్ధిచెందుతుంది.

– ఇంటి ప్రదీప్, పౌల్ట్రీ యజమాని, విజయవాడ

విద్యార్థుల పరిశోధనలకు ప్రోత్సాహం


- ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుక
- 30వ బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్ ఆవిష్కరణ



30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రేణుక తదితరులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విద్యార్థులను పరిశోధనా రంగం వైపు ప్రోత్సహిస్తూ, వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే బాలల సైన్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక సూచించారు. స్థానిక పున్నమ్మతోటలోని తన కార్యాలయంలో 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్‌ను ఆమె బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ రేణుక మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంపై జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయిందని, మండల సైన్స్ కో ఆర్డినేటర్లు ఎంఈఓల సహకారంలో మండల స్థాయిలో అన్ని పాఠశాలల గైడ్ టీచర్లకు మరొకసారి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక ప్రాజెక్ట్ తప్పనిసరిగా సమర్పించేలా డీవైఈఓ, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు నివశించే ప్రాంత సమస్యలపై శాస్త్రీయ పరిశోధన చేసి పరిష్కారం చూపేలా ప్రాజెక్టులు ఉండాలని డీఈఓ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ రిపోర్టు, లాగ్‌బుక్, నాలుగు చార్టులను నవంబర్ 15వ తేదీ నాటికి తన కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, వెంకటేశ్వరరావు, రీసోర్స్ పర్సన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్చరీలో కృష్ణా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన 42వ జాతీయ జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. కాంపౌండ్ విభాగంలో కె.వెంకటాద్రి, మనోజ్ కుమార్, షణ్ముఖి నాగసాయి, రికర్వ్ రౌండ్ బాలుర విభాగంలో వి.శివఆదిత్య, బాలికల విభాగంలో కె.చంద్రహాసిని, సీహెచ్ దాలిశివాని, టి.భువనరాజేశ్వరి కృష్ణా జిల్లా నుంచి విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు.

మచిలీపట్నంలో ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తలు



మచిలీపట్నం వ్యవసాయ క్షేత్రంలో ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందం

మచిలీపట్నం: స్థానిక వ్యవసాయ పరిశోధన క్షేత్రాన్ని అంతర్జాతీయ పరిశోధన సంస్థ ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన అంతర్జాతీయ పరిశోధన సంస్థ సహకారంతో చౌడు నేలల్లో సాగు చేసేందుకు అనువైన వరి వంగడాల కోసం మచిలీపట్నం వ్యవసాయ క్షేత్రం ఆధ్వర్యంలో పరిశోధనలు చేస్తున్నారు. ఇందు కోసం మచిలీపట్నం సమీపంలోని రుద్రవరంలో 16 లవణ సాంద్రత వద్ద వివిధ రకాల వరి సాగును ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ బృందానికి మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి ఆహ్వానం పలికారు. ప్రపంచంలోనే ఎక్కువ చౌడు నేలను తట్టుకునే రకాలను రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తలు డాక్టర్ వసీం హుస్సేన్, డాక్టర్ మార్గరేట్ కాటలో, డాక్టర్ జాయ్ రామోస్, డాక్టర్ మహీందర్‌కు ఇక్కడి వరి రకాల సాగుపై అవగాహన కల్పించారు. ఎంసీఎం 100, ఎంసీఎం 103, ఎంసీఎం 109, ఎంసీఎం125 రకాల ఉత్పత్తి, ఆంధ్రప్రదేశ్‌లో వాటి సాగు పరిస్థితులను వివరించారు. చౌడు నేలను తట్టుకొని సాగు చేసేలా వరి రకాలను సిద్ధం చేస్తున్న క్రమంలో తగిన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తల బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ వసీం హుస్సేన్ హామీ ఇచ్చారు. ఇక్కడ జరుగుతున్న పరిశోధనలపై సంతృప్తి వ్యక్తం చేసి, శాస్త్రవేత్తలను అభినందించారు.

న్యాయసేవా సదస్సును విజయవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 22వ తేదీన జరిగే న్యాయసేవా సదస్సును విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులకు ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎ.పద్మ వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. న్యాయ సేవా సదస్సులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిరోధం తదితర అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న శాఖల అధికారులు ఆయా పథకాల సంక్షిప్త సమాచారంతో స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100 లేదా 112, ఉమెన్ హెల్ప్ లైన్ 181 సేవలను తెలిపేలా పోస్టర్లు ముద్రించి ప్రదర్శించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. జగనన్న విద్యా దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన వంటి పథకాలపై అమలుపై కరపత్రాలను ముద్రించి పంపిణీ చేయా లని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, డీఆర్డీఏ, నగరపాలక సంస్థ, స్త్రీ, శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, విద్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు సమన్వయంతో సదస్సును జయప్రదం చేయాలని కోరారు. జేసీ శ్రీవాస్ నుపూర్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఈఓ సి.వి.రేణుక, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామకుమార్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశీయ గోవుల క్షేత్రంలో కేరళ మంత్రి



పెదపారుపూడి(పామర్రు): మండలంలోని యలమర్రు గ్రామంలో రైతులు ఏర్పాటు చేసిన దేశీయ గోవుల పెంపక క్షేత్రాన్ని కేరళ రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి కె. చించురాణి వారి బృందంతో కలిసి బుధవారం సందర్శించారు. గ్రామానికి చెందిన వల్లభనేని భానుప్రకాష్, ఇతర రైతుల బృందం ప్రభుత్వం అందించిన సబ్సిడీతో ఏర్పాటు చేసిన పుంగనూరు జాతి, దేశీయ గోవుల జాతుల గురించి మంత్రి చించురాణికి వివరించారు. గోవుల పోషణ, ప్రభుత్వం అందించే పలు రకాల పథకాల గురించి మంత్రి బృందం రైతులను అడిగి తెలుసుకున్నారు. పుంగనూర గో ఆధారిత వ్యవసాయం, సేంద్రియ పాల ఉత్పత్తుల గురించి రాష్ట్ర పశువర్ధకశాఖ సంచాలకులు (డైరెక్టర్) డాక్టర్ అమరేంద్రకుమార్ వారికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఉప సంచాలకులు డాక్టర్ రత్నశ్రీ, పెదపారుపూడి పశువైద్యులు డాక్టర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



బాబు మృతదేహం

జి.కొండూరు(మైలవరం): మోటారు స్విచ్ ఆపేందుకు ప్రయత్నించిన వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన వెల్లటూరు శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎన్టీఆర్ జిల్లా, ఏ. కొండూరు మండల పరిధిలోని చీమలపాడు తండాకు చెందిన జరపల బాబు(48) జి.కొండూరు మండల పరిధిలోని వెల్లటూరు శివారులో ఓ రైతుకు చెందిన సపోటా తోటలో కాపలాదారుడిగా పనిచేస్తున్నారు. కుటుంబంతో కలిసి 18 ఏళ్లుగా తోటలోనే నివాసం ఉంటున్నాడు. కాగా వర్షాలు పడుతున్న క్రమంలో తోటకు నీటి అవసరం లేనందున ఆటోమేటిక్‌గా పనిచేస్తున్న విద్యుత్ మోటారును ఆపేందుకు బుధవారం తెల్లవారుజామున ప్రయత్నించాడు. ఈ క్రమంలో స్విచ్‌బోర్డుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు ఐక్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మరాజు పేర్కొన్నారు.

'నీట్'గా శిక్షణ.. ఈజీగా సీటు



నీట్‌లో ప్రతిభ చూపిన మైనార్టీ విద్యార్థులతో ఇంతియాజ్

- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకున్న మైనార్టీ విద్యార్థులు
- 10 మందికి ఎంబీబీఎస్, ఐదుగురికి బీడీఎస్ సీట్లు
- మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీల విద్యాభివృద్ధి కేంద్రం(సీఈడీఎం), అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో నీట్-2022 ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఉచిత శిక్షణను 60 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. వారిలో 10 మంది మెడిసిన్‌లో, ఐదుగురు బీడీఎస్‌లో ఏ కేటగిరిలో సీట్లు వచ్చే మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం సీఈడీఎం కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ పట్టుదల, నిరంతర శ్రమతో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు.

23 శాతం విద్యార్థులకు సీట్లు..

సీఈడీఎం డైరెక్టర్ డాక్టర్ ఎండీ మస్తాన్ వలీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 285 మంది విద్యార్థులకు శిక్షణ కల్పించి 23 శాతం మంది విద్యార్థులకు సీట్లు పొందే అర్హత సాధించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మైనార్టీ విద్యార్థులు లబ్ధిపొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజాద్‌బాషాలు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అకాడమీ డైరెక్టర్స్‌ను సత్కరించారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్ నిర్మాణ పనుల పరిశీలన



జాతీయ రహదారి వెంబడి ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడ తూర్పు): జాతీయ రహదారి కారిడార్‌లో పనులు ఆలస్యం లేకుండా వెంటనే జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పర్యటనలో భాగంగా ఆయన రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం వరకు జాతీయ రహదారి వెంబడి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ప్రసాదంపాడు వద్ద జరుగుతున్న కారిడార్ పనులపై ఆరా తీశారు. నవంబర్ చివరిలోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన బందరు రోడ్డులో చెత్తను వేసుకుని వెళ్తున్న క్లాప్ వెహికల్‌ను తనిఖీ చేశారు. తడి, పొడి వ్యర్థాలను వేరుచేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఆ తర్వాత కృష్ణలంక రాణిగారితోట వారధి దిగువన రిటర్నింగ్ వాల్ వద్ద నివాసం ఉంటున్న ప్రజలు రిటర్నింగ్ వాల్ వద్ద పశువులను కట్టడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ప్రత్యామ్నాయంగా తమకు పశువులకు స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని విన్నవించుకోవటంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆమేరకు సూచన చేశారు. స్థానికుల ఇళ్ల నుంచి వచ్చే మురుగు పారేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించేందుకు అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.చంద్రశేఖర్, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, కరీముల్లా ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన

మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణా జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తూ, స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగిన వారికి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి కల్పించేందుకు బుధవారం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఈవో తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ అజీజ్ పర్యవేక్షణ చేశారు. స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉద్యోగోన్నతులను కల్పించే క్రమంలో అర్హులైన వారి సీనియార్టీ జాబితా సిద్ధం చేయాలని కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు చేశామని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు.



విజయవాడ నగర శివారులోని కొత్తూరు తాడేపల్లిలో ప్రమిదలు తయారు చేస్తున్న కుమ్మరి



వెలుగుల వేడుకకు ముస్తాబు

దీపావళి.. చీకట్లను పారదోలే వెలుగుల ఉత్సవం. అందరి జీవితాల్లో సంతోషం నింపే సంబరం. పేద, ధనిక, చిన్న, పెద్ద తేడా లేకుండా, కులాలకు అతీతంగా జరుపుకునే ఆనందాల ఉత్సవం. అటువంటి పండుగను ఈ ఏడాది ఉత్సాహంగా జరుపుకునేందుకు అంతా సిద్ధమవుతోంది. కుమ్మరి సారెకు చేతినిండా పని దొరికింది. మట్టి ప్రమిదలతో పాటు విభిన్న ఆకృతుల్లో కొత్త రకం ప్రమిదలు మార్కెట్‌లో కొలువుదీరుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







విజయవాడ వన్‌టౌన్‌లో కొలువుదీరిన వివిధ రకాల ప్రమిదలు

విశాఖకు మరో ఏసీ స్లీపర్ బస్సు

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నుంచి విశాఖపట్నానికి మరో ఏసీ స్లీపర్ బస్సును ప్రారంభించామని ఆర్టీసీ ఆటోనగర్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ స్లీపర్ సర్వీసు గురువారం నుంచి రోజు విడిచి రోజు రాత్రి 11 గంటలకు పీఎన్‌బీఎస్ నుంచి బయలుదేరి ఉదయం 6.30 గంటలకు విశాఖకు చేరుతుందన్నారు. అదే రోజు విశాఖపట్నం నుంచి 22.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.15 గంటలకు విజయవాడకు చేరుతుందన్నారు. నగరంలోని బెంజ్‌సర్కిల్, మార్గ్ కృష్ణాయ, ఎన్టీఆర్ సర్కిల్, పటమట సెంటర్, ఆటోనగర్ టెర్మినల్, అశోక్‌నగర్, కామయ్యతోపు సెంటర్, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్, కామినేని హాస్పిటల్, ఎనికేపాడు వద్ద నుంచి ఎక్కేందుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. రాజమండ్రి, అన్నవరంలలో మాత్రమే ఆగుతుందని తెలిపారు.

అతిరాస సామాజికవర్గం అభ్యున్నతికి కృషి

ఏపీ అతిరాస కార్పొరేషన్ చైర్మన్ భాస్కరరావు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అతిరాస కార్పొరేషన్ పరిధిలోని 18 ఉపకులాల సామాజికవర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ అతిరాస సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో బుధవారం బీసీ వెల్ఫేర్ పర్సన్ ఇన్‌చార్జ్ జీ ఉమాదేవి, బీసీ కార్పొరేషన్ల సమన్వయకర్త అగ్రహారం ప్రవీణ్ సమక్షంలో బోర్డ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో అతిరాస సామాజికవర్గంతోపాటు కార్పొరేషన్ పరిధిలోని ఉప కులాలైన మేర చిప్పోళ్లు, ఆసాదుల, సామంతుల తదితర కులస్తుల సమస్యలపై చర్చించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన అతిరాస కార్పొరేషన్ డైరెక్టర్లు టి.వెంకటేశ్వరరావు, ఎనుముల రాజ్యలక్ష్మి, బుర్రి మంగతాయారు, కొండా కోట సత్యవతి, చల్లా భవానీ, దూలి అచ్చయమ్మ, జె.లక్ష్మి, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై వర్క్‌షాప్

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం, రెడ్ రోప్, షీల్డ్ ఆఫ్ ద చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా 'మానవ అక్రమ రవాణా, ఎదుర్కొనే దర్యాప్తు' అనే అంశంపై బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ఏపీ సీఐడీ చీఫ్, అడిషనల్ డీజీ పీవీ సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు అంకితభావంతో పని చేసి మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. మానవ అక్రమ రవాణా అమానవీయ చర్యని పేర్కొన్నారు. దీని నిర్మూలనకు అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అమెరికాలో రెండు దశాబ్దాలకుపైగా పోలీస్ అధికారిగా పని చేసిన ప్రొఫెసర్ జెఫ్ బ్లోమ్ టెక్నిక్స్ టూ ప్రివెంట్ ట్రాఫికింగ్, ఇంటెలిజెన్స్ కలెక్షన్ అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీ సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత, రెడ్‌రోప్ అధినేత క్రిసోలైట్, రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌ల ఆఫీసర్లు, దర్యాప్తు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్‌నుపూర్, చిత్రంలో డీఆర్‌వో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ అధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణ పనులు, స్థల సేకరణ పురోగతిపై జిల్లాలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఇంజినీర్లతో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులపై మండల అధికారులు, ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. మండలాల వారీగా చేపట్టిన నాడు- నేడు పనులలో రెడ్డిగూడెం మండలం వెనుకబడి ఉందని, నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలలో ప్రహరీలు, కొత్త భవనాలు నిర్మించడానికి ఇసుక కొరత లేదని, అవసరానికి అనుగుణంగా మండలాధికారులు స్థానికంగా ఉండే ఇసుక రీచ్‌ల నుంచి పది మెట్రిక్ టన్నులు తీసుకోవచ్చన్నారు. రైతు ప్రయోజనాల కోసం రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా నిర్మించే మల్టీపర్పస్ స్పెషాలిటీ భవనాలు, బీఎంసీయూ, ఏఎంసీయూల నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తి చేయాలని, ఇప్పటికే స్థల సేకరణ పూర్తి అయిన వాటికి భవన నిర్మాణాలు పనులు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ప్రజలకు తెలిపే విధంగా ప్రచారం చేయాలని, ప్రజలు ఆధార్ సెంటర్లలో పేరు, అడ్రస్ మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ సీవీ రేణుక, హౌసింగ్ పీడీ శ్రీదేవి, జిల్లా సహకార శాఖ అధికారి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంతృప్తి చెందేలా నష్ట పరిహారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ-గుండుగొలను జాతీయ రహదారి-16 నందు హైటెన్షన్ విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటులో సేకరించే భూములకు రైతులు సంతృప్తి చెందేలా నష్ట పరిహారం చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో భూసేకరణకు సంబంధించి గొల్లపూడి, జక్కంపూడి అంబాపురం, నున్న రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రైతులు భూసేకరణకు సంబంధించి తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు. హైటెన్షన్ విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటులో స్థానిక అధికారులు సరైన నిర్ణయాన్ని తీసుకోలేదన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఎంతో మంది హైటెన్షన్ విద్యుత్ టవర్ లైన్ల వలన నష్టపోతున్నారన్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల రేడియేషన్ వలన ఆరోగ్యంపై ప్రభావం చూపి.. అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనిని పరిగణనలోకి తీసుకుని భూగర్భ కేబుల్ లైన్లు నిర్మాణం చేస్తే భూములు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లేని పక్షంలో ఏర్పాటు చేసిన లైన్లకు సేకరించే భూమితో పాటు రేడియేషన్ లేకుండా అదనంగా మరికొన్ని మీటర్ల భూమికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభ్యర్థనపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ హైటెన్షన్ విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటుకు ఇప్పటికే ఎలైన్‌మెంట్ పూర్తి చేయడం జరిగిందని, నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగానే భూ సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. భూ గర్భ కేబుల్ లైన్లు ఏర్పాటు సాధ్యపడదన్నారు. ప్రస్తుతం భూ సేకరణకు ప్రతిపాదించిన భూములకు సంబంధించిన రైతులకు నష్టపరిహార చెల్లింపులో తగు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. మరోసారి తాను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తానన్నారు. అనంతరం మరోసారి సమావేశం ఏర్పాటు చేసి రైతుల మనోభావాలను, అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంత మేరకు నష్టపరిహారం చెల్లించేందుకు అవకాశం ఉంటే అంతవరకు చెల్లించి రైతులను సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటానని నుపూర్ అజయ్ హామీనిచ్చారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ అదితి సింగ్, విజయవాడ రూరల్ తహసీల్దార్ బి. శ్రీనివాస్ నాయక్, జాతీయ రహదారులు, ట్రాన్స్‌కో గ్రిడ్ అధికారులు, గొల్లపూడి, జక్కంపూడి అంబాపురం నున్న గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చంద్రబాబుకు పాలేరు

మాజీ మంత్రి వెలంపల్లి



మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): చంద్రబాబునాయుడుకు పాలేరుగా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని, ఈ విషయం మరోసారి స్పష్టమైందని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. తన నియోజకవర్గంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతున్న విధానం చూస్తే గుండా, రౌడీలా వ్యవహరిస్తున్నట్టుందని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై అక్కసుతో తిట్టడం ఆయన దిగజారుడు విధానాన్ని తెలియజేస్తుందన్నారు. చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకొని మాట్లాడుతున్నట్లు చాలా స్పష్టంగా కనిపిస్తుందని, దానినే అందరూ చెబుతున్నారన్నారు. చెప్పు తీసుకొని వేషాలు వేయటం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో షూటింగ్ గ్యాప్‌లో రాష్ట్రానికి వచ్చి ఇక్కడ మరో షెడ్యూల్‌లో నటించి వెళ్లిపోయే పవన్‌కల్యాణ్ రాజకీయాలకు పనికిరాడన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లేనని ఆరోపించారు. వారిద్దరినీ ప్రజలు తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెలంపల్లితో పాటుగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

నగదు, నగలు చోరీ

గుడివాడ రూరల్: పట్టణంలోని స్లేడర్‌పేటలో ఓ ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్లేడర్‌పేటలో అప్పిగట్ల ఆడమ్‌స్మిత్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి బీరువాలో ఉన్న 10కాసుల బంగారం, రూ.20వేల నగదు, వెండి వస్తువులు, ట్యాబ్‌లను అపహరించుకుపోయారు. చోరీ సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. బుధవారం ఇంటికి వచ్చిన వారు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ క్లూస్‌టీంతో కలసి చోరీ గురైన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఇంటి యజమాని అప్పిగట్ల ఆడమ్‌స్మిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

సర్టిఫికెట్ల పంపిణీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):విక్రమ సింహపురి యూనివర్శిటీ–నెల్లూరు, సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా యూజీసీ నిబంధనల ప్రకారం నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ఇన్ జర్నలిజంలో ఉత్తీర్ణులైన వారికి ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలబంగాధర తిలక్ బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కరోనా కారణంగా ఆన్‌లైన్‌లో ఈ కోర్సునకు సంబంధించిన తరగతులు నిర్వహించామన్నారు. జర్నలిజం రంగంలో ఉన్న వారిలో నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా వారికి సర్టిఫికెట్ ఉండాలనే లక్ష్యంతో ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ విక్రమ సింహపురి యూనివర్శిటీని సంప్రదించి ఈ కోర్సును నిర్వహించారన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ జర్నలిజం పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఇప్పుడు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను అందచేశామన్నారు. 310 మంది సర్టిఫికెట్ ఇన్ జర్నలిజం కోర్సును విజయవంతంగా పూర్తి చేశారని తిలక్ చెప్పారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ నరేంద్ర మోడీ వేర్ ఈజ్ మై జాబ్ అనే నినాదంతో నవంబర్ 3న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాలోత్సవం భవన్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నరేంద్రమోడీ వేర్ ఈజ్ మై జాబ్ చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, నాగేశ్వరరావు, నాయకులు సంగీత సురేష నోహిత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఏ కోర్సుతో ఉపాధి అవకాశాలు


రేవతిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):చార్టెండ్ అకౌంటెంట్ కోర్సు పూర్తి చేసిన వారికి అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చైన్నెకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ రేవతి రంగనాథం చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల సెమినార్ హాల్లో కామర్స్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రేవతి హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం జీఎస్టీ వల్ల సీఏలకు మంచి డిమాండ్ ఉందన్నారు. న్యాయపరమైన ఖాతాలు, తనిఖీ అనే అంశంపై ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కామర్స్ విభాగాధిపతి కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

22న సీజ్ చేసిన వాహనాలు వేలం

మైలవరం: మైలవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 29 వాహనాలకు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని ఎస్ఈబీ హౌస్ ఆఫీసర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్, మైలవరం కార్యాలయం బుధవారం తెలిపింది. వేలంపాటలో పాల్గొనదలచిన అభ్యర్థులు ఈఎమ్‌డీ(రిఫండబుల్) ద్విచక్రవాహనాలకు రూ.5వేలు, ఫోర్ వీలర్స్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసిందిగా తెలిపారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 16 శాతం జీఎస్టీ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఎస్ఈబీ ఎస్ఐ గిరిజ సత్యకుమారి–9440902459, జి.అనిల్‌బాబు ఎస్ఐ, మైలవరం ఎస్ఈబీ –8897770007 నంబర్లలో సంప్రదించాలి.

నేడు ఏఎంసీ చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం

మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అప్పిడి సత్యనారాయణరెడ్డి గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మైలవరం పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

గడప గడపకు మన ప్రభుత్వంలో అవినాష్


సంక్షేమ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): నవరత్నాలతో పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 3వ డివిజన్ పరిధిలోని గుణదల లూర్దునగర్ ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు బాసటగా నిలిచేందుకు జగనన్న ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు పరుస్తున్న సంక్షమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగ పడే విధంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విలువలతో కూడిన రాజకీయాలతో సీఎం జగన్ క్రమశిక్షణతో మెలుగుతున్నారని తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్....

ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న మద్దతుతో ప్రతిపక్ష పార్టీల నేతలకు కంటకంగా మారిందని అన్నారు. జనసేన నేత పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ నాయకులను అసభ్య పదజాలంతో తిట్టడం సరికాదన్నారు.

కేవలం చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ నటిస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ మాటలను కట్టడి చేసుకోవాలని హితవు పలికారు. మరోమారు ఇలాంటివి జరిగితే ప్రజలే సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, నాగేంద్ర, డేవిడ్‌రాజు, మాతంగి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పనులకు శంకుస్థాపన


పైపులైను పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడ తూర్పు): ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పటమట 14వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ లో రూ.50 లక్షల అంచనాలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాటర్ పైప్ లైన్ పనులకు బుధవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే, ఎంపీ అధికార పార్టీలో ఉండి కూడా ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే తూర్పు నియోజకవర్గంలో రూ.400 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా విజయవాడ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిలో నడిపిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి నగర మేయర్ భాగ్యలక్ష్మి అన్ని విధాలా సహకరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి ఏ ఒక్క వర్గానికో, ప్రాంతానికో పరిమితం కాకుండా అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యంతో పరిపాలన చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల నమ్మకం కలిగేలా పాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు ఉనికి ప్రశ్నార్థంగా మారి మంత్రులపై దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. పార్టీలన్నీ ఏకమై పోటీ చేసినా 30 ఏళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగనే ఉంటారన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబయ్య, 14వ డివిజన్ అధ్యక్షులు శెటికం దుర్గా ప్రసాద్ వైస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాజు, చిమట బుజ్జి, ఉకోటి రమేష్, ఆంజనేయులు, జయరాజు, యేసుపాదం, నాగరాజు, రామాంజనేయులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో అవకతవకలపై విచారణకు ఆదేశం

జి.కొండూరు: మండల పరిధిలో ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదులో అవకతవకలు జరిగినట్లు రైతుల నుంచి ఫిర్యాదు అందుతున్న క్రమంలో సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాయితీగా పంటలను సాగు చేస్తున్న రైతుల పేరుతో రైతుకు తెలియకుండా వేరే వ్యక్తులు కౌలు కార్డులు పొంది ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విధంగా చేయడం వలన రైతులకు అందవలసిన ప్రభుత్వ పథకాలు అక్రమార్కుల చేతికి అందుతాయని, ఈ ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు దృష్టికి తానే స్వయంగా తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో నిజాలు నిగ్గుతేల్చేందుకు ఈ నెల 25న విజయవాడ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ జి.కొండూరు వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి పంపిణీ అవుతున్న రైతు పథకాలు అందని రైతులు తమకు ఎటువంటి అనుమానాలు ఉన్నా విచారణ కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోళ్లు


ధాన్యం కొనుగోలు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రంగనాథ్ బాబు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ధాన్యం కొనుగోళ్లను గ్రామాల్లోని వలంటీర్లకు, సివిల్ సప్లయిస్ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్లకు బాధ్యతలను అప్పగించడం శుభపరిణామమని మండల వ్యవసాయాధికారి రంగనాథ్ అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్లకు, వీఏఏలకు వలంటీర్లకు ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ రంగనాథ్ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఆర్‌బీకే నుంచి నలుగురు చొప్పున వలంటీర్లకు శిక్షణ ఇస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకోవాలన్నారు. రిటైర్డు మేనేజర్ క్వాలిటీ కంట్రోల్ నరసింహారావు మాట్లాడుతూ వలంటీరు, టెక్నికల్ అసిస్టెంటు రైతు తెలియజేసిన తేదీ ప్రకారం పొలం వెళ్లి ధాన్యం శాంపిల్స్ తీసుకుంటారని, ప్రభుత్వం కల్పించిన రవాణా సదుపాయంతో సంచులు, హమాలీలను తీసుకువెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. రైతుల సమక్షంలోనే ధాన్యం కాటా వేసి రైస్‌మిల్ నుంచి రశీదు ఇవ్వాల్సి ఉందన్నారు. హమాలీల కూలీ ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుందని, తేమ శాతం 17 శాతం ఉండే ప్రభుత్వ నిబంధన ఉందన్నారు. తాలు, తప్ప, రంగుమారిన ధాన్యం ఉంటే 3 నుంచి 5 శాతం తరుగు తీసివేయాల్సి ఉంటుందన్నారు. ఏ గ్రేడు ధానం క్వింటా రూ.2060, సాధారణ రకం రూ.2040 చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు.

బస్టాండ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


బస్టాండ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వచ్ఛ భారత్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్లీన్ ఇండియా కార్యక్రమాన్ని నలంద ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం నగరంలోని పండిట్ నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలో చేపట్టారు. అందులో భాగంగా 100 మందికి పైగా వలంటీర్లు పాల్గొని బస్టేషన్ ప్రాంగణమంతా తిరిగి 200 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా సరైన పద్ధతిలో వాటిని డిస్పోజ్ చేసే విధానంపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్లాస్టిక్ వినియోగం బాగా పెరిగిపోయిందని తెలిపారు. దానిని నిషేధించి ప్రజలకు నష్టం జరగకుండా చూడటం మనందరి బాధ్యత అన్నారు. సమాజ హితం కసం వలంటీర్లు మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్టీసీ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం

డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇరవై నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటానికి తెరదింపి, తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డీఎస్సీ –98 క్వాలిఫైడ్ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక వివేకానంద స్కూల్లో సమావేశమైన క్వాలిఫైడ్ అభ్యర్థులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు జక్కిరెడ్డి సీతారామిరెడ్డి, జె.సాయిరాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించామని, అధికారంలోకి రాగానే సమస్యకు పరిష్కారం చూపి తమను ఆదుకున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు తమకు సహకరించిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.


గ్రౌండ్‌లో టెంట్లు ఏర్పాటు చేసిన దృశ్యం


పోలీసు అమరవీరుల స్థూపం సిద్ధం చేస్తున్న దృశ్యం




కవాతు ప్రాక్టీసు చేస్తున్న పోలీస్ సిబ్బంది

పోలీసు అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు

అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అన్ని చర్యలు తీసుకున్నారు. గ్రౌండ్ అంతా చదును చేసి కవాతు నిర్వహణకు సౌకర్యంగా ఉండేలా చూస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గొల్లపూడిలో 905 కేజీల ప్లాస్టిక్ ఉత్పత్తులు సీజ్



భవానీపురం(విజయవాడ పశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని పలు దుకాణాలలో విక్రయిస్తున్న ప్లాస్టిక్ ఉత్పత్తులపై అధికారులు బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి సౌజన్య, స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి జ్యోత్స్న, విజయవాడ రూరల్ ఈఓపీఆర్‌డీ వీఎల్ శేషగిరిరావు, పంచాయతీ సిబ్బంది షాపులను తనిఖీ చేశారు. ఇందులో ఆరు షాపులలో ఉన్న 905 కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని ఆయా షాపుల యజమానులపై రూ.63వేలు జరిమానా విధించారు. ప్రభుత్వం నవంబర్ 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని ప్రతి దుకాణదారు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులు షాపుల యజమానులను హెచ్చరించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు బుధవారం అసిస్టెంటు ఇంజినీరు చిట్టిబాబు, అసిస్టెంటు డైరెక్టర్ పి.వరప్రసాద్ సబ్‌స్టేషన్ ఫంక్షన్స్, సిస్టమ్స్ ఎలిమెంట్స్, స్విచ్‌గేర్ అండ్ ప్రొటెక్షన్, ప్రొటెక్టింగ్ డివైసెస్‌ల గురించి శిక్షణ ఇచ్చారు. ఆరు నెలల పాటు జరిగే శిక్షణ కాలంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, పరీక్షలు నిర్వహిస్తామని ఏఈ చిట్టిబాబు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు మేలు


సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

జి.కొండూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. సుహాసిని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఈ నెల 21వ తేదీన ప్రారంభించనున్న క్రమంలో చెవుటూరు వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను ఆమె రాష్ట్ర హెచ్‌డబ్ల్యూసీ నోడల్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మోతీబాబుతో కలిసి బుధవారం పరిశీలించారు.

వెల్నెస్ సెంటర్లో వైద్య పరికరాలు, వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

23న ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): 28వ డివిజన్ సత్యనారాయణపురం నర్రావారి వీధిలో ఈ నెల 23వ తేదీ స్కిన్ వరల్డ్ క్లినిక్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ పూనూరు లిఖిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖంపై మచ్చలు, మొటిమలు, నల్ల మంగుతో పాటు దీర్ఘకాలిక చర్మ వ్యాధులైన సొరియాసిస్, అలర్జీ, ఎక్సీమా వంటి ఇతర చర్మ సంబంధిత వ్యాధులు నివారణకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ఈ సదవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఇబ్రహీంపట్నం: స్థానిక స్మార్ట్ ఈ–వరల్డ్ షోరూమ్‌లో ఈనెల 16న చోరీ చేసిన నిందితుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు. స్టేషన్‌లో నిందితుడి వివరాలు, నేరం జరిగిన తీరు బుధవారం ఆయన వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామానికి చెందిన సయ్యద్ సాహిద్ బాషా అనే వ్యక్తి కొండపల్లి శాంతినగర్ వద్ద తచ్చాడుతున్న సమయంలో పోలీసులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానంతో స్టేషన్‌కు తెచ్చి విచారించారు. విచారణలో నేరం అంగీకరించడంతో అతని నుంచి 28 సెల్‌ఫోన్‌లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును మూడు రోజుల్లో ఛేదించిన పోలీస్ సిబ్బందిని సీపీ టి.కె.రాణా అభినందించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐలు పాపారావు, శ్రీను పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాజకీయాలు కలుషితం

ముస్లీం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే రాజకీయాలు కలుషితమవుతాయని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయపార్టీకి అధ్యక్షుడిగా ఉన్న పవన్ కళ్యాణ్ సహనం కోల్పోయి చెప్పు చూపిస్తూ తోలు తీస్తా..తాట తీస్తా అంటూ మాట్లాడటం చేయడం కార్యకర్తలను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు. అలాంటి మాటలు సినిమాల్లోనే కానీ, రాజకీయాల్లో చెల్లవని పేర్కొన్నారు.

ఏదైనా, ఎవరిపైనైనా విమర్శలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాలే కానీ, సహనం కోల్పోయి మాట్లాడకూడదని సూచించారు. విశాఖలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా రాష్ట్ర మంత్రులపై దాడి జరిగిందని, కానీ టీడీపీ అధినేత చంద్రబాబు పవన్ కళ్యాణ్‌ను పరామర్శించడం వింతగా ఉందన్నారు.

కార్తిక మాసంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్):శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తికమాసంలో ప్రతి ఒక్కరూ సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపుకోవాలనే ఉద్దేశంతో ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో సామూహిక వ్రతాలు ఏర్పాటు చేసినట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం, సోమవారంతో పాటు ఏకాదశి, పూర్ణిమ రోజుల్లో వ్రతాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోవా కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

జూపూడి(ఇబ్రహీంపట్నం): నోవా గ్రూప్ ఆఫ్ కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ నోవా కళాశాల యాజమాన్యం ఏడాది కాలంగా క్లాసులు నిర్వహించకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడుతోందన్నారు. ఫీజులు లక్షల్లో వసూలు చేసి తరగతులు నిర్వహించక పోవడం, హాస్టళ్లలో సదుపాయాలు కల్పించకపోవడం దుర్మార్గం అన్నారు. తక్షణమే ఫ్యాకల్టీని నియమించి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిగ్‌బాష్ లీగ్ నుంచి వైదొలిగిన హర్మన్‌ప్రీత్

భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆస్ట్రేలియాలో జరుగుతున్న మహిళల బిగ్‌బాష్ లీగ్ టి20 టోర్నీ నుంచి వైదొలిగింది. వెన్ను నొప్పితో ఈ సీజన్‌లో తాను పాల్గొనడం లేదని హర్మన్ తెలిపింది. గత ఏడాది మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడిన హర్మన్ 406 పరుగులు చేసి, 15 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు గెల్చుకుంది. ఇటీవల ఆసియా కప్ టి20 టోర్నీలో హర్మన్ సారథ్యంలో భారత జట్టు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.



ఇంగ్లండ్ జట్టులో టైమల్ మిల్స్‌కు చోటు

టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే ఇంగ్లండ్ తుది జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. పేస్ బౌలర్ రీస్ టాప్లే చీలమండ గాయం కారణంగా ఈ మెగా టోర్నీకి దూరమయ్యాడు. దాంతో టాప్లే స్థానంలో మరో ఎడంచేతి వాటం పేసర్ టైమల్ మిల్స్‌ను ఇంగ్లండ్ జట్టులోకి ఎంపిక చేశారు. గత ఏడాది యూఏఈలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో మిల్స్ నాలుగు మ్యాచ్‌లు ఆడి ఏడు వికెట్లు తీశాడు. ఈ ఏడాది టాప్లే 16 టి20 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లతో ఇంగ్లండ్ టాప్ బౌలర్‌గా నిలిచాడు.

ముగ్గురికీ నిరాశ


అర్జున్ గుకేశ్ విదిత్

చెన్నై: ఎయిమ్‌చెస్ ర్యాపిడ్ ఆన్‌లైన్ అంతర్జాతీయ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, చెన్నై కుర్రాడు దొమ్మరాజు గుకేశ్, మహారాష్ట్ర ప్లేయర్ విదిత్ సంతోష్ గుజరాతి క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. ప్రపంచ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అర్జున్ 0.5–2.5తో ఓటమి పాలయ్యాడు. ప్రిలిమినరీ దశలో కార్ల్‌సన్‌ను ఓడించిన అర్జున్ నాకౌట్ దశలో మాత్రం అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయాడు. కార్ల్‌సన్‌తో తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న అర్జున్ ఆ తర్వాతి రెండు గేముల్లో ఓడిపోయాడు. 16 ఏళ్ల గుకేశ్ 1.5–2.5తో రిచర్డ్ రాపోర్ట్ (రొమేనియా) చేతిలో... విదిత్ 0.5–2.5తో జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్) చేతిలో పరాజయం చవిచూశారు.

సాజన్ సంచలనం



పోంటివెద్రా (స్పెయిన్): ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ చరిత్రలో గ్రీకో రోమన్ విభాగంలో పతకం నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా సాజన్ భన్వాల్ గుర్తింపు పొందాడు. పురుషుల 77 కేజీల విభాగంలో సాజన్ కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతక పోరులో ఉక్రెయిన్‌కు చెందిన దిమిత్రో వాసెత్‌స్కీపై సాజన్ గెలుపొందాడు. నిర్ణీత ఆరు నిమిషాల బౌట్ తర్వాత ఇద్దరూ 10–10 పాయింట్లతో సమంగా నిలిచారు. అయితే ఆఖరి పాయింట్ భారత రెజ్లర్ సాధించడంతో సాజన్‌ను విజేతగా ప్రకటించారు. హరియాణాకు చెందిన సాజన్ నాలుగో ప్రయత్నంలో అండర్–23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించాడు. 2018, 2019లలో ఐదో స్థానం పొందిన సాజన్ 2021లో 24వ స్థానంలో నిలిచాడు. ఈసారి మాత్రం సాజన్ కాంస్యంతో మెరిశాడు.

విండీస్ విజయం

- జింబాబ్వేపై 31 పరుగులతో గెలుపు
- 'సూపర్ 12' ఆశలు సజీవం
- నిప్పులు చెరిగిన జోసెఫ్, హోల్డర్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోసెఫ్

హోబర్ట్: వెస్టిండీస్ దారిలో పడే విజయం సాధించింది. టి20 ప్రపంచకప్ తొలిరౌండ్ గ్రూప్ 'బి'లో జింబాబ్వేపై తప్పక గెలవాల్సిన పోరులో ఓపెనర్ చార్లెస్ (36 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించగా, బౌలింగ్‌లో అల్జారీ జోసెఫ్ (4/16), జేసన్ హోల్డర్ (3/12) నిప్పులు చెరిగారు. రెండు సార్లు వరల్డ్ చాంపియన్ అయిన విండీస్ 31 పరుగుల తేడాతో జింబాబ్వేపై విజయం సాధించి 'సూపర్ 12' ఆశల్ని సజీవంగా నిలబెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. కరీబియన్ టాపార్డర్‌లో ఓపెనర్ కైల్ మేయర్స్ (12 బంతుల్లో 13; 2 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఎవిన్ లూయిస్ (18 బంతుల్లో 15; 1 ఫోర్) నిరాశపరిచారు. కానీ మరో ఓపెనర్ జాన్సన్ చార్లెస్ 13 ఓవర్లదాకా క్రీజులో నిలిచాడు. జట్టు స్కోరు 97 పరుగుల వద్ద అతను అవుట్ కాగానే... జింబాబ్వే బౌలర్ సికందర్ రజా (3/19) ఒకే ఓవర్లో బ్రూక్స్ (0), హోల్డర్ (4)లను పెవిలియన్ చేర్చాడు. దీంతో విండీస్ 101 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఆఖరి ఓవర్లలో రోవ్‌మన్ పావెల్ (21 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు), అకీల్ హోసీన్ (18 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు) ధాటిగా ఆడటంతో 150 పైచిలుకు స్కోరు చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 2, సీన్ విలియమ్స్ ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జింబాబ్వే 18.2 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ వెస్లీ మదెవెరె (19 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్), చివర్లో లూక్ జాంగ్వే (22 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. మిగతా వారిలో ఆరుగురు బ్యాటర్స్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నిజానికి పవర్‌ప్లేలో 4.4 ఓవర్ల వరకు 47/1 స్కోరుతో పటిష్టంగా ఉన్న జింబాబ్వే మరో 11 పరుగుల వ్యవధిలో 4 కీలక వికెట్లను కోల్పోయి 64/5 స్కోరుతో కష్టాల్లో కూరుకుపోయింది. జోసెఫ్, హోల్డర్ ధాటికి ఎవరూ క్రీజులో నిలువలేకపోయారు.

ఐర్లాండ్‌ను గెలిపించిన కాంఫర్

ఇదే గ్రూపులో జరిగిన మరో పోరులో ఐర్లాండ్ 6 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై జయభేరి మోగించింది. ధనాధన్ మెరుపులతో టి20 మజా పంచిన ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ మిడిలార్డర్ బ్యాటర్ కుర్టిస్ కాంఫర్ (32 బంతుల్లో 72 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హీరోగా నిలిచాడు. అంతకుముందు స్కాట్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 176 పరుగులు చేసింది. మైకెల్ జోన్స్ (55 బంతుల్లో 86; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. కెప్టెన్ బెరింగ్టన్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), క్రాస్ (28; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. తర్వాత ఐర్లాండ్ 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి గెలిచింది. 61/4 స్కోరుతో పరాజయం దిశగా పయనిస్తున్న జట్టును కాంఫర్, జార్జ్ డాక్రెల్ (37 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అబేధ్యమైన ఐదో వికెట్‌కు 119 పరుగులు జోడించి గెలిపించారు.


జోంగ్వే బౌల్డ్


కుర్టిస్ కాంఫర్

'బి'లో అందరూ రేసులో...

గ్రూప్ 'బి' అందరిని ఊరిస్తోంది. ఇందులో ఉన్న స్కాట్లాండ్, జింబాబ్వే, విండీస్, ఐర్లాండ్ రెండేసి మ్యాచ్‌లాడాయి. అన్నీ జట్ల ఖాతాలో ఒక విజయం, 2 పాయింట్లు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు జట్లు శుక్రవారం ఆడే రెండు లీగ్ మ్యాచ్‌లు నాకౌట్‌గా మారాయి. రేపు ఐర్లాండ్‌తో విండీస్, స్కాట్లాండ్‌తో జింబాబ్వే తలపడతాయి. గెలిచిన రెండు జట్లు 'సూపర్ 12'కు అర్హత సంపాదిస్తాయి.

గ్రూప్ 'ఎ'లో నేటి మ్యాచ్‌లు
శ్రీలంక X నెదర్లాండ్స్ (ఉ.గం. 9:30 నుంచి)
నమీబియా X యూఏఈ (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

రెండో వార్మప్ వర్షార్పణం

కివీస్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్ రద్దు



బ్రిస్బేన్: భారత్ ఆఖరి ప్రాక్టీస్ మ్యాచ్ వర్షంతో రద్దయింది. 'గాబా' వేదికగా న్యూజిలాండ్‌తో బుధవారం జరగాల్సిన వార్మప్ మ్యాచ్ ఎడతెరిపిలేని వానతో సాధ్యపడలేదు. వర్షం కుండపోత ఎలా ఉందంటే... దీంతో టాస్ వేయడం కాదు కదా... కనీసం భారత్, కివీస్ ఆటగాళ్లు వేదిక వద్దకు కూడా వెళ్లలేకపోయారు. ఈ మ్యాచ్‌కంటే ముందు అక్కడే పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌ల పోరును కూడా భారీ వర్షం ఆపేసింది. అఫ్గానిస్తాన్ 20 ఓవర్లు ఆడి 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. తర్వాత పాకిస్తాన్ 2.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 19 పరుగులు చేసింది. అప్పుడు మొదలైన జడివాన వాన ఇక ఆగనేలేదు. దీనివల్ల బ్రిస్బేన్‌లో బుధవారం మొత్తం 3 మ్యాచ్‌లు రద్దయ్యాయి. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌ల మధ్య వార్మప్ కూడా ఒక్క బంతి కూడా పడకుండా వర్షార్పణమైంది. భారత్ తమ తొలి ప్రాక్టీస్‌లో ఆస్ట్రేలియాను ఓడించింది. సూర్యకుమార్, రాహుల్ అదరగొట్టారు. భారత్ ప్రధాన టోర్నీలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో 23న జరిగే పోరులో తలపడుతుంది. మెల్‌బోర్న్‌లో జరిగే ఈ మ్యాచ్‌పై కూడా వర్షం ప్రభావం ఉంటుందని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది.

సాత్విక్-చిరాగ్ జోడీ ముందంజ

- సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్
- తొలి రౌండ్‌లోనే ఓడిన సైనా



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నారు. అయితే మహిళల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ సైనా నెహ్వాల్ మాత్రం తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ఆటగాడు సాత్విక్–చిరాగ్ ద్వయం 21–15, 21–19తో కాంగ్ మిన్ హ్యుక్–సియో సెయుంగ్ (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. 44 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి గేమ్‌లో 16–15తో ఆధిక్యంలో ఉన్నదశలో వరుసగా ఐదు పాయింట్లు గెలిచింది. సింగిల్స్‌లో ఎనిమిదో ర్యాంకర్ లక్ష్య సేన్ 21–16, 21–12తో ప్రపంచ ఆరో ర్యాంకర్ ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా)పై, ప్రణయ్ 21–13, 22–20తో జావో జున్ పెంగ్ (చైనా)పై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 32వ ర్యాంకర్ సైనా 17–21, 21–19, 11–21తో జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది.

భారత షూటర్ల జోరు

కైరో: ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం జరిగిన జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రమిత భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. ఫైనల్లో రమిత 16–12తో చైనా షూటర్ యింగ్ షెన్‌పై గెలుపొందింది. జూనియర్ మహిళల 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు దివ్యాంశి (547 పాయింట్లు) స్వర్ణం, వర్షా సింగ్ (539 పాయింట్లు) రజతం, టియానా (523 పాయింట్లు) కాంస్యం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం భారత్ మొత్తం 25 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

సామియా శుభారంభం



జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సామియా ఇమాద్ ఫారూఖి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సామియా 21–10, 15–21, 21–11తో జు ఇన్ కిమ్ (కొరియా)పై నెగ్గగా... రుత్విక శివాని 21–18, 15–21, 17–21తో లీ సె యోన్ (దక్షిణ కొరియా) చేతిలో... శ్రీ కృష్ణ ప్రియ 12–21, 16–21తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు.

సినిమా


● లైలా, రజీషా విజయన్, కార్తీ, నాగార్జున

కార్తీ నిరూపించుకున్నాడు - నాగార్జున


''ఓ సూపర్‌స్టార్ అన్నగా(సూర్య) ఉన్నప్పుడు.. ఆ షాడో నుంచి బయటకు వచ్చి... సొంత ప్రతిభను నిరూపించుకోవడం అనేది చాలా తక్కువ. అటువంటి వారిని అరుదుగా నేను ఇద్దర్నే చూశాను. తెలుగులో చిరంజీవి తమ్ముడు పవన్ కల్యాణ్, కన్నడలో శివరాజ్‌కుమార్ సోదరుడు పునీత్ రాజ్‌కుమార్. ఇప్పుడు తమిళ్‌లో సూర్య బ్రదర్ కార్తీ. ఇలా నిరూపించుకోవడం కష్టమైన పని. విభిన్నమైన, ప్రయోగాత్మక సినిమాలు చేస్తూ అన్నలా సూపర్‌స్టార్ అయ్యాడు కార్తీ'' అని నాగార్జున అన్నారు. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించిన తమిళ చిత్రం 'సర్దార్'. రాశీఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రంలో లైలా ఓ కీ రోల్ చేశారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేస్తోంది.
ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'సర్దార్' ప్రీ రిలీజ్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ– ''ఊపిరి' సినిమా నుంచి కార్తీతో నా అనుబంధం ప్రారంభమైంది. తను తెలుగులో మాట్లాడతాడు.. పాటలు పాడతాడు. తెలుగులో మాట్లాడినవారిని మనం హృదయాల్లో పెట్టుకుంటాం.. అందుకే కార్తీని తెలుగు ప్రేక్షకులు అంతగా ఆదరిస్తారు. అన్నపూర్ణ స్టూడియోస్ 'సర్దార్' సినిమాను సమర్పిస్తున్నందుకు చాలా గర్వంగా, హ్యాపీగా ఉంది'' అన్నారు. కార్తీ మాట్లాడుతూ– ''నాగార్జునగారు నాకు రియల్ బ్రదర్.. పెద్ద స్ఫూర్తి. సక్సెస్, ఫెయిల్యూర్స్ అనేవి ఆయన్ని ఎఫెక్ట్ చేయలేవు. సినిమాలంటే ఆయనకు ఎంతో ప్యాషన్. మంచి మనవతావాదిగా ఉంటేనే మంచి యాక్టర్‌గా ఉండగలమని నాగార్జునగారు ఓ సందర్భంలో చెప్పారు. నేనూ ఎప్పట్నుంచో ఫాలో అవుతున్నాను. నాగార్జునగారు యాక్ట్ చేస్తున్నారనే నేను 'ఊపిరి' సినిమా చేశాను. నా కెరీర్‌లో 'సర్దార్' చాలా ముఖ్యమైన సినిమా. 'సర్దార్' ఇండియన్ స్పై థ్రిల్లర్'' అన్నారు. ''నేను నటించిన 'శివపుత్రుడు' దీపావళికి రిలీజై హిట్ సాధించింది. 'సర్దార్' కూడా దీపావళికి విడుదలవుతోంది. నా బర్త్ డే కూడా ఈ దీపావళి రోజునే (అక్టోబరు 24). చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. ప్రతి ఒక్కరూ 'సర్దార్' సినిమాను ఎంజాయ్ చేస్తారు''అన్నారు. గేయ రచయిత రాకేందు మౌళి, అన్నపూర్ణ స్టూడియోస్ సాయిబాబా, కాస్ట్యూమ్ డిజైనర్ ప్రవీణ్ రాజా పాల్గొన్నారు.

పదమూడేళ్ల తర్వాత...!

దాదాపు పదమూడేళ్ల తర్వాత మళ్లీ ఓ మలయాళ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు హీరోయిన్ జ్యోతిక. ఈ నెల 18న జ్యోతిక బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. మమ్ముట్టి హీరోగా మలయాళ హిట్ 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్' ఫేమ్ జో బేబీ దర్శకత్వంలో 'కాతల్' అనే సినిమా రూపుదిద్దుకోనుంది. ఈ సినిమాలోనే జ్యోతిక హీరోయిన్‌గా నటించనున్నారు. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కానుంది. ఇక ఇప్పటికే తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసిన జ్యోతిక ఇంతకుముందు మలయాళంలో 'రాఖిలి పట్టు'(2007), 'సీతా కల్యాణం' (2009) అనే సినిమాలు చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది.


● జ్యోతిక

ప్రిన్స్ ఓ చాలెంజ్ - శివ కార్తికేయన్


● శివ కార్తికేయన్

"ప్రిన్స్' యూనివర్సల్ సబ్జెక్ట్. ఇందులోని డైలాగ్స్, కామెడీ చాలా ఆర్గానిక్‌గా ఉంటాయి. తెలుగు, తమిళ ప్రేక్షకులు అనే తేడా లేకుండా అందరికీ మా సినిమా నచ్చుతుంది" అని హీరో శివ కార్తికేయన్ అన్నారు. అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రిన్స్'. శివ కార్తికేయన్, మారియా ర్యాబోషప్క జంటగా నటించారు. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, డి.సురేష్ బాబు, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివ కార్తికేయన్ పంచుకున్న విశేషాలు...

● నటుడిగా అన్ని భాషల్లో మూవీస్ చేసి ప్రేక్షకులని అలరించాలని ఉంటుంది. ప్రస్తుతం కామెడీ సినిమాలు తగ్గిపోతున్నాయి. నాకు కామెడీ సినిమాలు చేయడం అన్నా, చూడటం అన్నా చాలా ఇష్టం. నా స్నేహితుడి ద్వారా ఒకసారి అనుదీప్‌ని కలిశాను. ఆయన చెప్పిన లైన్ చాలా ఎగ్జైట్ చేయడంతో 'ప్రిన్స్' కి ఓకే చెప్పాను.
● 'ప్రిన్స్' నా తొలి స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్. ఈ ప్రాజెక్ట్ ఒక సవాల్‌తో కూడుకున్నది. అనుదీప్ తెలుగులో కథ రాశారు. తెలుగు స్క్రిప్ట్‌ని తమిళ్‌లో చేయడం ఒక సవాల్‌గా తీసుకొని పని చేశాం. అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. నా పాత్రకి తెలుగులో నేను డబ్బింగ్ చెప్పలేదు.
● ఒక ఇండియన్ అబ్బాయి బ్రిటీష్ అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆ ఊరి మనుషుల్లో ప్రేమ, పెళ్లి విషయాల్లో మైండ్ సెట్ వేరేగా ఉంటుంది. వారి ఆలోచనలను బ్రేక్ చేసే ఆలోచన చాలా ఎగ్జైట్ చేసింది. ● నేను కథని ఎంపిక చేసుకునేటప్పుడు గత చిత్రం రిజల్ట్ గురించి ఆలోచించను. ప్రేక్షకులు ఈ సినిమాని ఎందుకు చూడాలి? ఈ కథలో కొత్తదనం ఏంటి? విమర్శకులు దీన్ని ఎలా చూస్తారు? అని ఆలోచిస్తాను. నా అభిమానులు సోషల్ మీడియాలో నన్ను ప్రిన్స్ అని పిలుస్తుంటారు. పైగా ప్రిన్స్ అన్ని భాషలకు సరిపోయే టైటిల్.. అందుకే ఆ పేరు పెట్టాం. ● నేను, హీరో నానిగారు ఒకేలా కనిపిస్తామని ప్రేక్షకులు చెబుతుంటారు. నానిగారు కూడా యాంకర్‌గా, సహాయ దర్శకుడిగా పనిచేసి, హీరోగా ఎదిగారు. నేను కూడా టీవీలో పని చేసి సినిమాల్లోకి వచ్చాను. నా పదేళ్ల నట ప్రయాణంలో ప్రేక్షకులు పంచిన ప్రేమని మర్చిపోలేను. ● సునీల్ నారంగ్, డి.సురేష్ బాబు, రామ్‌మోహన్ రావు కాంబినేషన్‌లోని 'ప్రిన్స్' లో భాగం కావడం హ్యాపీ. తెలుగులో రాజమౌళిగారితో మూవీ చేయాలని ఉంది. అలాగే త్రివిక్రమ్, సుకుమార్‌గార్ల సినిమాలంటే ఇష్టం. ప్రస్తుతం 'మహావీరుడు' సినిమా చేస్తున్నా.

భవిష్యత్‌లోనూ ద్విభాష(తెలుగు, తమిళ) చిత్రాలు చేయాలనే ఆలోచన నాకు ఉంది. ప్రస్తుతం విజయ్ హీరోగా వంశీ పైడిపల్లిగారు ఓ సినిమా చేస్తున్నారు. అలాగే హీరో రామ్ చరణ్– శంకర్‌గారు కలసి పని చేస్తున్నారు. తెలుగు–తమిళ పరిశ్రమల వాళ్లు కలిసి సినిమా చేయడం చాలా మంచి పరిణామం. "ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్, విక్రమ్, కాంతార' చిత్రాలు అద్భుతమైన విజయాలు అందుకున్నాయి. దక్షిణాది పరిశ్రమ ఇప్పుడు గొప్ప స్థితిలో ఉండటం సంతోషం.

అందుకే కాంతారను తెలుగులో రిలీజ్ చేశాం - నిర్మాత అల్లు అరవింద్

''సాధారణంగా నేను డబ్బింగ్ సినిమాలు రిలీజ్ చేయడం తక్కువ. కానీ 'కాంతార' ఎమోషన్స్‌కు, హీరో పెర్ఫార్మెన్స్‌ను కనెక్ట్ అయ్యాను. ఈ ఎమోషన్స్‌నే తెలుగు ప్రేక్షకులకూ అందించాలనే ఉద్దేశంతో 'కాంతార' ని గీతా ఫిల్మ్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా తెలుగులో రిలీజ్ చేశాం. తెలుగు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడం హ్యాపీ'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రిషబ్‌శెట్టి నటించి, దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'కాంతార'. కిశోర్ కుమార్, అచ్యుత్ కుమార్, సప్తమి గౌడ, ప్రమోద్ శెట్టి, ప్రకాష్ కీలక పాత్రలు పోషించారు. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 30న విడుదలైంది. ఈ సినిమాను తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో ఈ నెల 15న రిలీజ్ చేశారు. తెలుగులో 'కాంతార' దాదాపు 20 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసిందని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''కన్నడ 'కాంతార' ని బన్నీ వాసు చూడమంటే చూశాను.. నచ్చింది. ఈ సినిమాను చూసిన తర్వాత విష్ణుతత్వం, రౌద్రరూపం ఇవన్నీ కలిపి వైజాగ్‌కు సమీపంలోని సింహాచలంకు దగ్గరగా ఉన్న కథ అనిపించింది. ఇంగ్లీష్, యూరోపియన్, కొరియన్‌ల నుంచి 'కాంతార' కథను తీసుకోలేదు. ఓ ఊరిలో జరిగిన కొన్ని విశేషాలను తీసుకుని రాసుకున్నారు. ఈ మూవీని ఏ ఎమోషన్స్‌ను ఫీలై చక్కగా తీశారో, ఆ ఎమోషన్స్‌కి తెలుగు వారు కనెక్ట్ అయ్యి ఇంత మంచి విజయాన్ని అందించారు. అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ బాగుంది. గీతాఆర్ట్స్‌లో ఓ సినిమా చేసేందుకు రిషబ్ ఒప్పుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు. ''వరాహరూపం అనేది విష్ణుమూర్తికి కనెక్ట్ అవుతుంది. దాంతో మా కల్చర్‌కు ఎమోషన్స్‌ను జోడించి 'కాంతార' చేశాం. మంచి కంటెంట్ ఉన్న సినిమాలకు హద్దులు లేవని తెలుగు ప్రేక్షకులు నిరూపించారు. మూడు రోజుల్లోనే 20కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. 'గీతా ఫిల్మ్స్ డిస్ట్రిబ్యూషన్'తో 'కాంతార'ని తెలుగు ప్రేక్షకులకు అందించిన అరవింద్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు రిషబ్ శెట్టి.


● సప్తమి, రిషబ్, అల్లు అరవింద్

ఖోఖో నేపథ్యంలో...


● తారకరత్న

నందమూరి తారకరత్న హీరోగా నటించిన తాజా చిత్రం 'సారథి'. జాకట రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వైశాలి హీరోయిన్‌గా నటించారు. పంచభూత క్రియేషన్స్‌పై పి.నరేష్ యాదవ్, యస్.కృష్ణమూర్తి, పి.సిద్ధేశ్వర్ రావు నిర్మించిన ఈ మూవీ మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''ఖో ఖో గేమ్ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఎక్కువ భాగం రియల్ లొకేషన్స్‌లో చిత్రీకరించాం. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఆలోచన అందరిలో రేకెత్తించేలా మా సినిమా ఉంటుంది. కరోనా మహమ్మారిలో ఎదురైన సవాళ్లను అధిగమించి సినిమాను పూర్తి చేసినందుకు తారకరత్నకి ధన్యవాదాలు. సిద్ధార్థ్ వాటికన్ సంగీతం అలరిస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి.

నవ్వులు ఫుల్


● అనిల్ రావిపూడి, అప్పిరెడ్డి, సంజయ్, ప్రణవి

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. దర్శకుడు పూరి జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. మైక్ మూవీస్‌పై అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఇట్ ఈజ్ ఫ్రస్టేషన్ సాంగ్..' అనే పాటని దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యాన్ని అందించగా, రాహుల్ సిప్లిగంజ్‌తో కలిసి భీమ్స్ సిసిరోలియో పాడారు. ఈ సాంగ్‌లో నటుడు సునీల్ తళుక్కున మెరిశారు. ''పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. షూటింగ్ తుది దశలో ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

తెలిసినవాళ్లు వస్తున్నారు!


● రామ్ కార్తీక్, హెబ్బా పటేల్

రామ్ కార్తీక్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'తెలిసినవాళ్లు'. కేఎస్వీ సమర్పణలో సిరెంజ్ సినిమా పతాకంపై విప్లవ్ కోనేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా నవంబర్‌లో విడుదలకానుంది. ఈ సందర్భంగా విప్లవ్ కోనేటి మాట్లాడుతూ– ''ఫ్యామిలీ, రొమాన్స్, థ్రిల్లర్ జోనర్స్‌లో సరికొత్త కథనంతో రూపొందిన చిత్రమిది. ఈ చిత్రం టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. శ్రీ చరణ్ పాకాల చక్కని సంగీతం అందించారు. ఇప్పటికే విడుదల చేసిన ఈ మూవీలోని 'శశివదనే..' పాటకు మంచి రెస్పాన్స్ లభించింది. మా సినిమా విజయంపై మంచి నమ్మకంతో ఉన్నాం. త్వరలో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అజయ్ వి.నాగ్, అనంత్ నాగ్ కావూరి, లైన్ ప్రొడ్యూసర్ : డాక్టర్ జేకే సిద్ధార్థ.